ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 181 పేజీలు: 8+4 వెల: 6.50

## జంతర్‌మంతర్ నిరసనలో 2873 మంది నేరస్తులు

5లో

### బిజెపిలో చేరకపోతే చంపేస్తామంటున్నారు: అభిజిత్




ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ముఖచిత్రం


# భోగాపురం వైమానిక తలమానికం

### ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

### అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముస్తాబు

### రేపు స్వయంగా ఆవిష్కరించనున్న ప్రధాని మోడీ

### ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మరో సువర్ణాధ్యాయం



విమానాశ్రయంలో అతి సుందరంగా రూపొందించిన అంతర్భాగం

**విజయనగరం, జులై 30 ప్రభాతవార్త:** జిల్లా భోగాపురంలో అత్యంత ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1న ప్రారంభం కానున్న ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం,నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి కావడం విశేషం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులతో ఇది రూపుదిద్దుకుంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను నెరవేరుస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఇదొక సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు.
**ప్రత్యేకతలు:** రన్‌వే: ఎయిర్‌బస్, బోయింగ్ వంటి భారీ విమానాలు సైతం ల్యాండ్ అయ్యేలా 3,800 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో 'క్యాట్‌ఐ' రన్‌వేను సిద్ధంచేశారు. **టెర్మినల్ భవనం:** సుమారు 79,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు అంతస్తులుగా విశాలమైన ప్యాసింజర్ టెర్మినల్‌ను నిర్మించారు. మొదటి దశలో ఏటా 6 మిలియన్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండగా, రాబోయే రోజుల్లో 18 మిలియన్లకు విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు.
**ప్రత్యేక డిజైన్:** ఈ విమానాశ్రయ నిర్మాణం తీర ప్రాంత విశిష్టతను చాటేలా 'ఎగిరే చేప' ఆకృతిలో ప్రేరణ పొందింది. టెర్మినల్ పైకప్పు సాంప్రదాయ 'ట్రిగ్రామ్' థీమ్ ఆర్ట్‌తో ఆకట్టుకునేలా ఉంది.
**ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ :** 55 మీటర్ల ఎత్తులో, 360 డిగ్రీల విహంగ వీక్షణ సేవలు అందించేలా ఎంటీసీ టవర్‌ను ఏర్పాటు చేశారు. **కార్గో సేవలు:** దాదాపు 5,000 చదరపు

>>2



# 'పరీక్షల' బిల్లుకు 'పెద్దలు' సై

### రాజ్యసభలోను ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ బిల్లు ●లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం

**న్యూఢిల్లీ,జులై 30:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఎనిమిదో రోజు గురువారం కూడా ప్రతిపక్ష ఆందోళనలతో ఉభయ సభలు పలుమార్లు అంతరాయానికి గురయ్యాయి. జులై 20న విద్యార్థుల నిరసన ర్యాలీపై పోలీసులు చేపట్టిన చర్యలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభల్లో నిరసనలు వ్యక్తం చేశారు.ఈ పరిణామాల మధ్య రాజ్యసభ ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నివారణ) సవరణ బిల్లు-2026కు ఆమోదం తెలిపింది. ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించింది.బిల్లుపై జరిగిన చర్చలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆందోళనలను తాత్కాలికంగా శాంతింపజేయడానికే ప్రభుత్వం ఈ

>>2

### వందేమాతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

5లో

# ఆంధ్ర సంస్కృతికి ప్రతీక 'భోగాపురం'



### చరిత్రలో నిలిచేలా ప్రారంభవేడుకలు

### ఎయిర్‌పోర్టుతోపాటు ఉత్తరాంధ్ర ముఖచిత్రం మార్చే ఎఐ డేటా సెంటర్లు

### ప్రధాని రాకను చరిత్రాత్మకం చేయాలి

### ఆర్థికాభివృద్ధికి ఇది కొత్త ఇంజిన్: సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై30,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేశామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సు ద్వారాను,మౌఖికంగాను మంత్రులు,అధికారులు,ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి పౌరుడ్నీ భాగస్వామిని చేయాలి అన్నారు. ఆగస్టు 1వ తేదీన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు,ఆయనకు ఆ సందర్భంగా మనం అద్భుతమైన రీతిలో మన సాంస్కృతిక వారసత్వం పరిడమిల్లే విధంగా స్వాగతం పలకాలన్నారు. ఎయిర్ పోర్టు పాసింజర్ టెర్మినల్, ఏవియేషన్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్, ఎడ్యుసిటీలను ప్రారంభించుకోబోతున్నామన్నారు. అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఏపీకి ఓ లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తుంది రాష్ట్ర అభివృద్ధికి ఇది ఓ గేమ్ చేంజర్. ఎయిర్ పోర్టుతో పాటు ఏఐ డేటా సెంటర్లు, రేర్ ఎర్త్ మినరల్స్ లాంటి ఖనిజాలు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మారుస్తాయన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు టేకాఫ్ అయితే ఉత్తరాంధ్రతో పాటు యావత్ రాష్ట్రానికి కీలక ప్రాజెక్టుగా మారుతుందిఈ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను, యజమానుల్ని గౌరవిస్తూ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తున్నామన్నారు. వచ్చే 9 రోజుల పాటు ఉత్తరాంధ్ర లోని ప్రతీ ఇంటా ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తిచేరాలి. ఉత్తరాంధ్ర లోని 6జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలి అన్నారు. అరకు కాఫీ, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలు, స్థానిక కళారూపాలను కూడా ఘనంగా ప్రదర్శిద్దాం అన్నారు. భోగాపురం విమానాశ్రయం కేవలం ఒక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మాత్రమే కాదు. ఇది ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపునిచ్చే పవర్‌హౌస్. పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, లాజిస్టిక్స్, సేవారంగాల విస్తరణకు ఇది ప్రధాన వేదికగా మారనుంది. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం భోగాపురం-విశాఖపట్నం ప్రాంతం రాబోయే దశాబ్దంలో తూర్పు తీరంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అగ్రగామి వాణిజ్య కేంద్రంగా అవతరించనుంది. ఐటీ ఐటీఈఎస్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్స్, కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు..వసతి ఆతిథ్యానికి స్టార్ హోటళ్లు, కార్పొరేట్ ఆసుపత్రులు, కన్వెన్షన్ సెంటర్లు, రిటైల్ హబ్‌లు ఉన్నాయన్నారు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు.ఈ మౌలిక వసతుల కారణంగా రానున్న పదేళ్లలో వేల కోట్ల రూపాయల ప్రైవేటు పెట్టుబడులు ఈ ప్రాంతానికి తరలివస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విశాఖపట్నం, గంగవరం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్‌తో భోగాపురం విమానాశ్రయం అనుసంధానం కావడం వల్ల సముద్ర, రోడ్డు, వైమానిక రవాణా ఒకే వేదికపైకి రానుంది. ఎగుమతి కానున్న ప్రధాన వస్తువులు.ఫార్మా ఉత్పత్తులు, సముద్ర ఆహారాలు, వ్యవసాయఉద్యాన పంటలు, తాజా పండ్లు, పూలు, హస్తకళలు మరియు ఎలక్ట్రానిక్ వస్తువులు ఇకపై దేశవిదేశాలకు మరింత వేగంగా ఎగుమతి కానున్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశీయ, విదేశీ పర్యాటకుల రాకపోకలు విపరీతంగా పెరుగుతాయి. విశాఖ బీచ్‌లు, అరకు లోయ, బొర్రా గుహలు, భీమిలి, యారాడ బీచ్, కైలాసగిరి, తోటలకొండ, బావికొండ, సింహాచలం తదితర ప్రాంతాలకు పర్యాటక తాకిడి మరింత పెరుగుతుంది. దీనివల్ల హోటళ్లు, రిసార్టులు, హోమ్‌స్టేలు, ట్రావెల్ ఏజెన్సీలు, క్యాబ్ సర్వీసులు మరియు స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా

>>2



## అన్ని శాఖలకు 1తేదీనే జీతాలు

### ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబరు

**విజయవాడ.జులై 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉద్యోగుల జీతాల చెల్లింపు విషయంలో ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పలు విభాగాల్లో ఉద్యోగులకు సకాలంలో ఒకటో తేదీన జీతాలు జమ కావడ లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్థికశాఖ ఇతర అన్నిశాఖలకూ కీలక ఆదేశాలుజారీ చేసింది. ఇకపై ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగుల జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తమకు సహకరించాలని ప్రభుత్వ విభాగాల

>>2

## గ్లోబల్ ఇన్వెస్టర్లకు వేదిక ఏపి

### త్వరలో రాష్ట్రం నుంచి క్లీన్ ఎనర్జీ ఎగుమతులు..

### పరిశ్రమలు తేవడం మా బాధ్యత కష్టపడటం మీ వంతు

### 800 మె.వా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్




గురువారం 800 మె.వా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేష్

**పత్తికొండ,జులై 30ప్రభాతవార్త:** టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్పత్తికొండ: ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్,వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (ఆధ్వర్యంలో రూ. 5,350కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే, ఈ ఒక్క సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400% పెరిగిందని, ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైందన్నారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం :** రాష్ట్రంలో 2024 జూన్‌లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా,

>>2

# వాయు'గండం'

### పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

**విజయవాడ.జులై30.ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్ పై స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం పలు జిల్లారాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ, గుంటూరు, కాకినాడ, ఉత్తరాంధ్ర. కోస్తాంధ్రాల్లో వాన ముసురు కమ్మింది. ఈదురు గాలులు వీచాయి.పలు చోట్ల సాధారణ జల్లులు పడ్డాయి. రాబోయే 24 గంటల్లో వాయుగుండం విదర్భ, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ మధ్యప్రదేశ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ప్రకటించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు. వాయుగుండం ప్రభావంతో శుక్రవారం మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ విభాగం తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాబట్టి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల సమయంలో చెట్లు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదని ప్రజలకు సూచిస్తోంది. ఇప్పటికే వర్షాల కారణంగా పలు చోట్ల జనజీవనానికి అంతరాయం కలుగుతోంది. వర్షాలతో పాటు పిడుగులు పడే ముప్పు కూడా పొంచి ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్ల కిందకు చేరవద్దని విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని అన్నారు. రోడ్లపై నీరు నిలిచే అవకాశం ఉన్నందున వాహనాలను నెమ్మదిగా నడపాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తొన్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ ఆకస్మిక మార్పుల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం కూడా ఉంది. ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీటిని తాగాలని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.



## నేటి నుంచి జూ.డాల సమ్మె

### అత్యవసర వైద్యసేవలకు మినహాయింపు

**గుంటూరు మెడికల్, జులై30 ప్రభాత వార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ప్రకటించింది. జూనియర్ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం

>>2

# రైతులతో సమావేశాలు జరపండి



### సూపర్ ఎల్ నినో, సాగునీటి సంక్షోభంపై వారికి వివరించండి

### మంత్రి నిమ్మలకు సూచించిన డి.సిఎం పవన్

**విజయవాడ.జులై 30,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న పవన్ కళ్యాణ్ సాగునీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు సూచించారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని సాగునీటి ఎద్దడిపై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు కూడా తీసుకుంటే ఫలితం ఉంటుందని స్పష్టం చేశారు. సూపర్ ఎల్ నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం మంగళగిరిలోని

>>2



## సిట్ కస్టడీకి నాగరాజు

### సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ,జులై30,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక నిందితుడు సస్పెండయిన సీఐ నాగరాజును సిట్ కస్టడీలోకి తీసుకుంది.రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న సస్పెండయిన సీఐ నాగరాజును సిట్ అధికారులు వారం రోజులపాటు విచారించేందుకు

>>2




అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఆంధ్రా రుచుల రెస్టారెంట్

# భోగాపురం వైమానిక తలమానికం

మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటైన కార్గో టెర్మినల్ ద్వారా వార్షికంగా 25,000 టన్నుల వస్తువులను నిర్వహించవచ్చు.

**అత్యాధునిక సౌకర్యాలు:** సులభతర ప్రయాణం కోసం 40 చెక్ఇన్ కౌంటర్లు, 12 డిగ్రీ యాత్ర పాడ్స్, సెల్ఫ్సర్వీస్ బ్యాగేజ్ డ్రాప్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. భద్రత కోసం అధునాతన స్క్రీనింగ్ వ్యవస్థలు, ఇమ్మిగ్రేషన్, ఎమిగ్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల షాపింగ్, వినోదం కోసం కమర్షియల్ స్పేస్‌లు, రిటైల్ స్టోర్లు, ఫుడ్ అండ్ బెవరేజ్ అవుట్‌లెట్లు కొలువు దీరన్నాయి. తుఫానులను సైతం తట్టుకునేలా గంటకు 275 కి.మీ వేగంతో వీచే ఈదురుగాలులను సైతం నిరోధించే సైక్లోన్‌రెసిస్టెంట్ డిజైన్‌తో దీన్ని నిర్మించారు.

ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్ ఆసియాలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మహా నగరం విశాఖపట్నం నుంచి, అల్లూరి విమానాశ్రయానికి అనుసంధానాన్ని మెరుగుపరచడానికి చేపట్టిన రోడ్డు ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయి. ఈ విమానాశ్రయం పర్యాటకం, రవాణా రంగాలతో పాటు వ్యవసాయ, సముద్ర ఉత్పత్తులు, పారిశ్రామిక ఎగుమతులకు ప్రధాన ఉత్ప్రేరకంగా మారుతుందని భావిస్తున్నారు.

**ఉద్యోగ, ఉపాధి రంగానికి ఊపు:** విమానాశ్రయంతో పాటు జీఎంఆర్ ఏరో సిటీ పరిధిలో హోటళ్లు, వాణిజ్య కేంద్రాలు, వినోద జోన్లు రూపుదిద్దుకుంటున్నాయి.

అలాగే ఏవియేషన్, ఏరోస్పేస్ రంగానికి ప్రత్యేకంగా 500 ఎకరాలు కేటాయించగా, భీమిలి మండలం అన్నవరంలో జీఎంఆర్ మాన్‌సాస్ ఎడ్యుసిటీ ద్వారా పైలట్లు, ఏరోస్పేస్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. స్థానిక యువత ఉపాధి కోసం వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి.

## ఆంధ్ర సంస్కృతికి ప్రతీక 'భోగాపురం'

>> లభిస్తాయన్నారు. విమానాశ్రయం నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలోనూ వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయన్నారు. భోగాపురం విమానాశ్రయం మొదటి దశ ప్రయాణికుల సామర్థ్యం యేడాదికి 60 లక్షల ఉంటుందన్నారు.

## గ్లోబల్ ఇన్వెస్టర్లకు వేదిక ఎపి

>> క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్నవిశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు:** ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్ ప్రపంచ స్థాయి తయారీ వరకు మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్‌ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్‌గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం:** టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ..5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం:** టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్ట మొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం టాటా అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనది. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు... కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ తఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



గురువారం టాటా ఎనర్జీ ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

# నేటి నుంచి జూ.డాల సమ్మె

>> పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం తెలిపింది.ఏపీ జూడా అధ్యక్షుడు డాక్టర్ యు. ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బాలగం దినకర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ఎం. రవి తేజ నాయక్, డాక్టర్ ఎస్.కె.లుక్మాన్ అలీ విడుదల చేసిన ప్రకటనలో జూనియర్ డాక్టర్లకు సంబంధించిన పలు సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగో సంవత్సరం జూనియర్ డాక్టర్లకు ఇవ్వాల్సిన స్టైపెండ్ పెంపుపై ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే జూనియర్ డాక్టర్ల భద్రత, సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బోధనాసుపత్రుల్లో నెలకొన్న ఇతర సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.సమ్మె కాలంలో అత్యవసర వైద్య సేవలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అందించే చికిత్సలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సేవలు కొనసాగిస్తామని జూడా నాయకులు స్పష్టం చేశారు. అయితే సాధారణ ఓపీ సేవలు, విద్యా కార్యక్రమాలు, ఇతర సాధారణ వైద్య సేవలపై సమ్మె ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని అమలు చేస్తే సమ్మెను విరమించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ జూడా ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో సాధారణ వైద్య సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మంగపతిదేవిపేటలో పెద్దపులి దాడి

## రెండు ఆవులపై దాడి

## రంగంలోకి అటవీశాఖ ప్రత్యేక బృందాలు

**ఏలూరు జిల్లా బ్యూరో/ కొయ్యలగూడెం, జులై 30 ప్రభాత వార్త :** గడచిన రెండు నెలలుగా ఈదురు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో పెద్దపులి సంచారం సామాన్య ప్రజలను హడలెత్తిస్తుంది. ఈ క్రమంలో బుధవారం మరోసారి పెద్దపులి కదలికలు కనిపించడమే కాకుండా ఏకంగా ఆవులను తీసివేయడం ఆ ప్రాంతంలో సంచలనాత్మకంగా మారింది. వివరాల్లోకి వెళితే పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేట గ్రామంలో అర్ధరాత్రి వేళ పెద్దపులి దాడి చేయడంతో రెండు ఆవులు మృతి చెందాయి. స్థానిక రైతులు కొండా వీరస్వామి, తేలే వెంకటేశ్వర్లులకు చెందిన ఆవులను పొలాల్లో కట్టేయగా, అర్ధరాత్రి దాడి చేసిన పులి ఒక ఆవును భాగస్వామ్యంగా తినేసి, మరొక ఆవును చంపి అక్కడే వదిలేసింది. ఉదయాన్నే వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన రైతులు ఆవులు రక్తసిక్తమై చనిపోయి ఉండటాన్ని గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, స్పెషల్ టీమ్‌లు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని పులి అడుగుజాడలను (పగ్‌మార్క్స్) పరిశీలించారు. ఈ పులి పోలవరం నియోజకవర్గ పరిధిలోని గోదావరి అటవీ ప్రాంతం నుండి వచ్చిందని, రెండు రోజుల క్రితం కరిచర్లగూడెం ప్రాంతంలో తిరిగినట్లు గుర్తించారు. మంగపతిదేవిపేటలో దాడి అనంతరం పులి మొద్దప్పగూడెం శివారులోని జామాయిల్ తోటలు, పొదల మధ్య ఉన్నది అని అటాచ్ చేసిన ట్రాకర్ ద్వారా ఫారెస్ట్ అధికారులు సిగ్నల్స్ గ్రహించారు. తెల్లవారుజాము నుంచే ఫారెస్ట్ అధికారులు పలు బృందాలుగా విడిపోయి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వరకు వర్షం కురవడంతో డ్రోన్ కెమెరాలు, రేడియేషన్ సాంకేతికత వినియోగానికి కొంత అంతరాయం కలిగింది. వర్షం తగ్గగానే డ్రోన్ల ద్వారా గాలింపు వేగవంతం చేసినప్పటికీ, దట్టమైన పొదల చాటున పులి సమర్థవంతంగా దాక్కుంటూ తప్పించుకుంటోంది. ఈ పెద్దపులి సుమారు 4 సంవత్సరాల వయస్సు, 6 అడుగుల పొడవు ఉంటుందని, పగటిపూట పొదల్లో నక్కి రాత్రి వేళల్లో వేట సాగిస్తోందని అటవీ అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ పనులు, నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలి అని రాత్రి సమయాల్లో పరిసర గ్రామాల ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకూడదు. పాడి పశువులు, మూగజీవాలను సురక్షితమైన ప్రదేశాలకు లేదా దూర ప్రాంతాలకు తరలించాలి. అదనపు బలగాలు, ప్రత్యేక నిపుణుల బృందాలు కూడా రంగంలోకి దిగుతున్నాయని, త్వరితగతిన పులిని పట్టుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. పరిసర గ్రామాల ప్రజలందరూ అటవీశాఖ సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# రైతులతో సమావేశాలు జరపండి

>> క్యాంపు కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర నియోజకవర్గాల రైతుల కోసం అడిగిన వెంటనే ఏలేరు ప్రాజెక్టు నుంచి వెంటనే 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించినందుకు మంత్రి నిమ్మల రామానాయుడు ఉప ముఖ్యమంత్రిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జిల్లా, పిఠాపురం పరిసర ప్రాంతాల్లో నెలకొన్న నీటి కొరత పరిస్థితులను పరిశీలించేందుకు ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్నట్టు రామానాయుడు వివరించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడుతున్న నీటి కొరత పరిస్థితులపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని, ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు నష్టపోకుండా ప్రతి రైతు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అవకాశం ఉన్న చోట రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని సూచించారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, కాలువల్లో పూడిక తీయడం, గట్లు లీకేజీలు లేకుండా మరమ్మత్తులు చేయడం వంటి చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా మరియు పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.అంతకు ముందు భుజం గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న పవన్ కళ్యాణ్ రామానాయుడు పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన కోలుకుని తిరిగి ప్రజా సేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# భద్రత,సరఫరా వ్యవస్థలపై ప్రధాని మోడీ సుదీర్ఘ సమీక్ష

## అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు ఆదేశాలు

**న్యూఢిల్లీ,జులై 30:** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో భారత్‌కు అవసరమైన కీలక వస్తువుల సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని నరేంద్ర మోడీ గురువారం సీనియర్ మంత్రులతో విస్తృత సమీక్ష నిర్వహించారు. హార్ముజ్ జలసంధి, బ్లాక్ సీ, రెడ్ సీ, ఏడెన్ గల్ఫ్ వంటి వ్యూహాత్మక సముద్ర మార్గాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన విస్తృత కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, నౌకాశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పాల్గొన్నారు.దాదాపు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో ప్రపంచంలోని వివిధ ఘర్షణ ప్రాంతాల భద్రతా పరిస్థితులు, వాటి ప్రభావం భారత్ దిగుమతులపై, అంతర్జాతీయ సరఫరా గొలుసులపై చూపిస్తున్న ప్రభావంపై సమగ్రంగా సమీక్షచేసారు. ముఖ్యంగా ఘర్షణ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రత, సముద్ర మార్గాల్లో ప్రయాణించే భారతీయ నావికుల రక్షణపై కూడా సవివరంగా చర్చించారు.పెట్రోలియం, సహజవాయువు, ఎరువులు సహా దేశానికి అవసరమైన అన్ని కీలక వస్తువుల దిగుమతులు నిరంతరాయంగా కొనసాగేందుకు తమ శాఖలు చేపట్టిన చర్యలను ఆయా మంత్రులు సమావేశంలో వివరించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ రాజకీయ పరిణామాలు, వాటి వల్ల భారత ఆర్థిక ప్రయోజనాలపై ఏర్పడుతున్న ప్రభావం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది.దేశ పౌరుల భద్రత, భారత ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణతో పాటు సరఫరా వ్యవస్థలో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రధాని సంబంధిత మంత్రులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధానికి ముందు భారత్ దిగుమతి చేసుకునే ఇంధనంలో సుమారు 40 శాతం హార్ముజ్ జలసంధి ద్వారానే వచ్చేది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గకపోవడంతో పశ్చిమాసియా నుంచి ఇంధన దిగుమతులు గణనీయంగా దెబ్బతిన్నాయి. హార్ముజ్ మార్గంలో చమురు, సరకు నౌకలపై జరుగుతున్న అడపాదడపా దాడుల కారణంగా ఆ మార్గంలో రవాణా ఇంకా పరిమితంగానే కొనసాగుతోంది.ఇటీవల యెమెన్‌కు చెందిన హౌతీ మిలీషియా, బాబ్ అల్ మండబ్ జలసంధి గుండా ప్రయాణించే సౌదీ అరేబియా చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించింది. అనంతరం కొన్ని నౌకలపై దాడులు కూడా నిర్వహించింది. రెడ్ సీని ఏడెన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో అనుసంధానించే బాబ్ అల్‌మండబ్ ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలకు అత్యంత కీలకమైన సముద్ర మార్గంగా గుర్తింపు పొందింది.తాజా గణాంకాల ప్రకారం, గత మూడు రోజులుగా ఈ మార్గంలో రోజుకు సగటున 31 నౌకలే ప్రయాణించగా, జులై తొలిపక్షంలో ఈ సంఖ్య రోజుకు 43గా నమోదైంది. దీంతో ఆ మార్గంలో రవాణా గణనీయంగా తగ్గినట్లు స్పష్టమవుతోంది.మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో బ్లాక్ సీ మార్గంలో రష్యా నుంచి జరుగుతున్న చమురు సరఫరాపైనా ఒత్తిడి పెరిగింది.

## వారం - వర్జ్యం

31-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
విదియ రా.10.29, ధనిష్ఠ రా.7.24
వర్జ్యం : రా.2.59-తె.4.41
దు.ఉ.8.22-ఉ.9.14, 2) మ.12.29-మ.1.31
శుభసమయం : ఉ.9.30-10.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృషభం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** సహోద్యోగులతో మెలుకువతో మెలగడం చెప్పదగినది. నూతన పెట్టుబడులకు అనుకూల కాలం.

**కర్కాటకం:** దూరప్రాంతం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. విమర్శలను లెక్కచేయరు. బంధువుల సమాగమనం.

**సింహం:** సంతాన విద్యాభివృద్ధి బాగుంటుంది. జీవిత భాగస్వామి నుండి సలహాలు స్వీకరిస్తారు. వస్త్రలాభం.

**కన్య :** వ్యాపార విస్తరణకు తగినంత ఆర్థిక వనరులు సమకూరడం కష్టమవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల:** బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. భూ వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**వృశ్చికం:** అధిక ప్రయోజనాలు కలిగి చౌకగా వచ్చే వస్తువులను కొనుగోలు చేస్తారు. లలిత కళలు అభ్యసిస్తారు.

**ధనుస్సు:** ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతారు. గృహ నిర్మాణయత్నాలు సాగిస్తారు. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీ మూలంగా ధన లాభం పొందుతారు. వాహన సౌలభ్యం కలదు.

**కుంభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీరు బయట పడవారు.

**మీనం:** అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్ధతగా వుంటాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిట్ కస్టడీకి నాగరాజు

>> కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం సిట్ కార్యాలయానికి తరలించారు. అంతకుముందు నాగరాజును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి నాగరాజును కస్టడీకి తీసుకున్నారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు మాజీ సీఐ నాగరాజును గురువారం ఉదయం విజయవాడ కోర్టుకు తీసుకువచ్చారు. అయితే న్యాయమూర్తి సెలవులో ఉండటంతో ఇంఛార్జి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. ఎన్ని గంటల వరకు విచారణ చేయాలన్న దానిపై న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఉదయం పది నుంచి సాయంత్రం 5 వరకు విచారణ చేయాలని కోర్టు ఈ సందర్భంగా ఆదేశించింది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నాగరాజుకు భద్రత కల్పించాలని సూచించింది. దీంతో నాగరాజును కస్టడీలోకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించారు.

# 'పరీక్షల' బిల్లుకు 'పెద్దలు' సై

>> సవరణ బిల్లును తీసుకొచ్చిందని, ప్రశ్నపత్రాల లీకేజీలకు దారితీసే మూల కారణాలను పరిష్కరించేలా ఇందులో ఎలాంటి స్పష్టమైన చర్యలు లేవని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా నివారించే విధంగా పరీక్షల నిర్వహణ ఎలా ఉంటుందనే అంశాన్ని బిల్లు స్పష్టంగా వివరించలేదని ఆయన అభిప్రాయపడ్డారు.మరోవైపు లోక్‌సభలో కూడా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలు, అలాగే అయోధ్య లోని రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలకు దిగడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. ఆందోళనల మధ్యనే లోక్‌సభ జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ) బిల్లు-2026ను, సాధారణంగా వందేమాతరం బిల్లుగాపిలిచే ఈ బిల్లును, మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం సభను శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు.

## లొంగిపోతానంటూ సైఫ్ కోర్టులో పిటిషన్

## లిక్కర్ స్కాంలో కీలకపరిణామం

**విజయవాడ.జులై30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసు విచారణలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు నమోదు అయిన తర్వాత విదేశాలకు పరారైన పదో నిందితుడు (ఏ10) సైఫ్ అహ్మద్ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన రాజ్ కెసిరెడ్డికి సైఫ్ అహ్మద్ అత్యంత కీలక అనుచరుడిగా ఉన్నట్లు సమాచారం. లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కోట్ల రూపాయల అక్రమ నగదు లావాదేవీలు, హవాలా వ్యవహారాల్లో సైఫ్ కీలక పాత్ర పోషించాడని సిట్ అధికారులు తమ దర్యాప్తులో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు కాగానే విదేశాలకు పారిపోయిన సైఫ్ అహ్మద్ కోసం పోలీసులు, సిట్ అధికారులు విస్తృతంగా గాలిస్తున్న తరుణంలో... ఆయనే స్వయంగా ఏసీబీ కోర్టులో లొంగిపోతానంటూ పిటిషన్ వేయడం ఈ కేసు విచారణలో ప్రాధాన్యత సంతరించుకుంది. సైఫ్ లొంగిపోతే ఈ స్కామ్ వెనుక ఉన్న మరికొందరి పాత్ర, నగదు మళ్లింపు వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## పేపర్‌లీక్ మాఫియాకు ఇక కష్టకాలమే..

**న్యూఢిల్లీ,జులై 30:** పరీక్షల్లో అక్రమాల కట్టడికి నిర్దేశించిన బిల్లునుపార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోడీ నాలుగోసారి ఒక ఇన్‌స్టా విడియో విడుదలచేసారు.

గురువారం రాత్రి పొద్దుపోయాక విడుదలచేసిన ఈ విడియోలో పేపర్ లీక్ మాఫియా, గాంగులను ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించబోమని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా సవరణలతో తీసుకువచ్చిన పబ్లిక్ పరీక్షల (అక్రమాల నియంత్రణ) సవరణ బిల్లు 2026ను గురువారం పార్లమెంటు ఆమోదించడం చారిత్రక సందర్భంగా మోడీ అభివర్ణించారు. ఇకపై అక్రమార్కులకు కఠిన దండన తప్పదని కూడా మోడీ ఇన ఇన్‌స్టాలో హెచ్చరించారు.కాగా ప్రధానిమోడీ ఇన్‌స్టాలో రిజిస్టరు అయిన తర్వాత వారం రోజుల వ్యవధిలోనే నాలుగో విడియోను విడుదలచేసారు. విడుదలయిన వెనువెంటనే ఈ విడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## రాజ్యసభలో పరీక్షల బిల్లుపై వాడివేడి చర్చ

**న్యూఢిల్లీ, జులై 30:** లోక్‌సభ ఆమోదం పొందిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఏమాత్రం సహించబోమని, పేపర్ లీకేజీల పట్ల తమ ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లు ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడంలో ప్రధానమంత్రి ఏమాత్రం జాప్యం చేయలేదని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ సవరణ బిల్లు నిబంధనల ప్రకారం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే, కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడంతో పాటు జరిమానాను రూ. 10 కోట్ల వరకు విధించేలా ప్రతిపాదించారు. దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేసి, ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల లోపు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ముగించాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్ అనంతరం ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, తద్వారా ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు.

## అన్ని శాఖలకు 1 తేదీనే జీతాలు

>>ను ఆర్థికశాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో అన్ని కార్యాలయాలు జీతాల బిల్లులను వెంటనే ఐఎఫ్ఎంఎస్ వెబ్ సైట్‌లో అప్‌డేట్ చేయాలని ఆర్థికశాఖ ఆదేశించింది. జీతాల బిల్లులు సమయానికి అప్‌డేట్ చేయకపోతే సంబంధిత డీడీవో పై చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులకు సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3,900మంది ఉద్యోగుల ఆధార్ వివరాలు ఐఎఫ్ఎంఎస్‌లో అప్‌డేట్ కాలేదని గుర్తించారు. వీరిలో సుమారు 1,900మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని తేలింది. ఆధార్ అప్‌డేట్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు సచివాలయంలోని ఆర్థికశాఖను సంప్రదించాలని కోరుతోంది. గతంలో డిప్యుటేషన్‌లో పనిచేసి బదిలీపై కొత్తచోట చేరిన ఉద్యోగులకు కూడా ఆధార్ అప్‌డేట్ సమస్యలు ఎదురవుతున్నట్లు గుర్తించారు. అలాగే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సేవా కాలాన్ని కూడా ఈ నెల కూడా పొడిగించినట్లు ఆర్థికశాఖ తెలిపింది. కాబట్టి అన్ని శాఖలు వారి జీతాల బిల్లులను వెంటనే పంపించాలని మరోసారి కోరింది. ఈ ప్రక్రియకు ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌ను రాష్ట్ర నోడల్ అధికారిగా నియమించింది.జీతాల బిల్లులు పెండింగ్‌లో ఉంటే ముందే ఆర్థికశాఖకు తెలియజేయాలని శాఖాధిపతులను ఆదేశించారు.

# దేశంలోనే తొలిసారి పోలవరం జిల్లాలో ఆర్‌బిఎస్‌కె 2.0కు శ్రీకారం

- 62.65 లక్షల మంది పిల్లలకు 38 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణ
- రంపచోడవరం ముసురుమిల్లి పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్
- బిపి, షుగర్, ఇతర పరీక్షలతో పాటు సెల్‌ఫోన్ వినియోగ వివరాల సేకరిస్తున్నామని వెల్లడి
- పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టీకరణ
- 43.30 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు... 2.50 లక్షల మందికి ఉచిత కళ్లజోళ్లు



**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా ముసురుమిల్లిలో ఎపి ప్రభుత్వం ఆర్‌బిఎస్‌కె 2.0 కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. దేశ చరిత్రలోనే ఈ కార్యక్రమం తొలిసారి కావటం విశేషం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలు కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు సుమారు 62.65 లక్షల మంది పిల్లలకు 38రకాల ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్టు ఆయన తెలిపారు. తొలిసారిగా బిపి, షుగర్, ఇతర పరీక్షలతో పాటు సెల్‌ఫోన్ వినియోగ వివరాల సేకరిస్తున్నామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చిన్నారులకు ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టీకరణ చేశారు. 43.30 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు కూడా జరుగుతున్నాయని, 2.50 లక్షల మందికి ఉచిత కళ్లజోళ్లు అందజేస్తామని వెల్లడించారు. చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను ఉచితంగా అందించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం క్రింద సమగ్ర ఆరోగ్య పరీక్షలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు.

పోలవరం జిల్లా రంపచోడవరంలోని ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య పరీక్షల ప్రారంభ కార్యక్రమములో గురువారం పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. అందుకే పిల్లలకు అనారోగ్యం వచ్చిన తర్వాత వైద్యం చేయడం మాత్రమే కాకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మారిన జీవనశైలికి అనుగుణంగా చిన్నారులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అని, పుట్టుకతో వచ్చే లోపాలు, వివిధ వ్యాధులు, పోషకాహార లోపాలు, శారీరక-మానసిక ఎదుగుదలలో ఆలస్యం సహా 38 రకాల ఆరోగ్య సమస్యలను ఈ పరీక్షల్లో గుర్తిస్తామన్నారు. జీవనశైలి విధానంలో వస్తున్న మార్పులకు తగ్గట్లు గతంలో ఉన్న పరీక్షలకు ఆదనంగా చిన్నారులకు అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, మూత్రపిండాలు-మూత్రనాళ సమస్యలు, మానసిక ఇబ్బందులు, అధిక చరవాణి (సెల్) వినియోగం, నిద్రకు సంబంధించిన సమస్యలపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సమస్యను ఎంత త్వరగా గుర్తిస్తే అంత సులభంగా చికిత్స చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్య పరీక్షల్లో సమస్య బయట పడిన చిన్నారులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థలకు పంపించి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

పిల్లల్లో చూపు సమస్యలను కూడా ముందుగానే గుర్తించేందుకు ఈ ఏడాది ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 43.30లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వారిలో చూపు సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన చికిత్సతో పాటు 2.50లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయించిందన్నారు.

**పిల్లల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తు:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'పిల్లల ఆరోగ్యమే వారి చదువుకు, కుటుంబాల ఆనందానికి, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. ఏ చిన్నారి కూడా ఆరోగ్య సమస్య కారణంగా చదువుకు, ఎదుగుదలకు దూరం కాకూడదు. పరీక్షలో సమస్య గుర్తించిన ప్రతి చిన్నారికి పూర్తిస్థాయి వైద్యం అందే వరకు ఆరోగ్య శాఖ బాధ్యత తీసుకోవాలి' అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ పాలసీ వల్ల పోలవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులోకి వచ్చారని చెప్పారు. గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం యం ఎల్ ఏ మిరియాల శిరీష దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సోళ్ల బొజ్జిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ జె.విజయలక్ష్మి, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.సరిత, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

- ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను సమీక్షించి, పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్



**భోగాపురం (విజయనగరం జిల్లా), జులై 30 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత రాజకీయ, ఆర్థిక, పర్యాటక వృద్ధికి ప్రధాన చిరునామాగా మారనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ్ణ ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన సహచర మంత్రులతో, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ లోపల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కట్టడాలు, కళాకృతులను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించగా సంబంధిత వివరాలను సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు వివరించారు.

అనంతరం టెర్మినల్ భవనంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం ప్రస్ఫుటించేలా చేసిన ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అభివృద్ధికి రెక్కలు వచ్చినట్లుగా, ఉత్తరాంధ్రకు గ్లోబల్ లుక్ వచ్చేలా దర్శనమిస్తున్న ఈ ఎయిర్ పోర్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణలు, కూచిపూడి నృత్య భంగిమలు, ఏటికొప్పాక బొమ్మలు, తోలుబొమ్మలాట చిత్రాలు, కలంకారీ పెయింటింగ్స్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి అద్దంపట్టేలా ఉంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, తిరుమల, లేపాక్షి నంది వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, మన్యం అందాలను చాటిచెప్పే డిజిటల్ స్క్రీన్‌లు, వాల్ పెయింటింగ్స్‌తో ఆంధ్రా వైభవం ప్రతిఒక్కరినీ ఆకట్టుకునేలా ఉందని అభినందించారు. 'ఫ్లైయింగ్ ఫిష్' ఆకారంలో రూపొందించిన టెర్మినల్ డిజైన్, విద్యుద్దీపాలంకరణతో అత్యంత సుందరంగా ఉందన్నారు. అంతేగాక ఎయిర్‌పోర్టులోని ఏరో బ్రిడ్జ్, ఏరో ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే, టాక్సీవేలు, ఏప్రాన్ ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లను మంత్రి దుర్గేష్ నిశితంగా పరిశీలించారు. హైస్పీడ్ సెక్యూరిటీ స్కానింగ్, ఫాస్ట్ డిజిటల్ చెక్‌ఇన్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ ఇగేట్స్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఎస్కలేటర్లు, ఎలివేటర్లు వంటి ఆధునిక వసతులు ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందిస్తాయని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నమూనాను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ రైల్వే జోన్‌తో పాటు భోగాపురం ఎయిర్‌పోర్టు ద్వారా కేంద్ర సహకారంతో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, పెట్టుబడులు తరలివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకం, విమానయాన, పారిశ్రామిక రంగాలలో విపరీతమైన అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే గేమ్ చేంజర్ ఈ ఎయిర్ పోర్ట్ అని చెబుతూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో ఇది కీలక భూమిక పోషిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ ఇమేజ్ తీసుకొస్తుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని, అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.

ప్రధాని పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న థింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని వెల్లడించారు. ఆగస్టు 1న జరగనున్న ఈ చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## పకడ్బందీగా భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లు



**విజయనగరం (భోగాపురం), జులై 30 ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రవాణా, రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం విమానాశ్రయ ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్, విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, జిల్లా ఎస్‌పి దామోదర్, జిల్లా అధికారులు, విమానాశ్రయ నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర భవితకు గగనద్వారం భోగాపురం

- ఉపాధికి కొత్త ఊపు.. కలలకు కొత్త రన్‌వే..

### అభివృద్ధికి గగనమార్గం: మంత్రి పార్థసారధి

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎయిర్‌పోర్టులు కేవలం విమానాల రాకపోకల కేంద్రాలు కావు. అవి దూరాలను దగ్గర చేసే అద్భుత వారధులు అని మంత్రి కొలుసు పార్థసారధి వ్యాఖ్యానించారు. అవకాశాలను ప్రపంచంతో అనుసంధానించే అభివృద్ధి ద్వారాలు. ప్రతి టేకాఫ్ ఒక కొత్త ఆశయానికి శ్రీకారం చుడితే, ప్రతి ల్యాండింగ్ సొంత నేలను చేరుకున్న ఆనందాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక ప్రాంతాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే శక్తి ఉన్న ఈ వైమానిక సౌకర్యం, ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సాకారమవుతోంది. భవిష్యత్ అవసరాలను వర్తమానంలోనే గుర్తించి, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేయడం దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. అదే దూరదృష్టితో ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, దశాబ్దం క్రితమే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆలోచనకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆనాడు వేసిన బలమైన పునాదుల ఫలితంగానే, నేడు ఈ బృహత్ ప్రాజెక్టు రూపం దాల్చింది. విశాఖపట్నానికి సమీపంలోని భోగాపురంలో అద్భుతంగా నిర్మితమైన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. దీంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలుకానుంది.



**ఉత్తరాంధ్రలో తొలి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం:** "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం విమానాల రాకపోకల కేంద్రం కాదు. ఇది ఉత్తరాంధ్రను ప్రపంచంతో అనుసంధానించే గగనద్వారం. పెట్టుబడులకు ఆహ్వానం, పారిశ్రామికీకరణకు పునాది, పర్యాటక రంగానికి కొత్త శక్తి, యువతకు ఉపాధి వేదిక. రాబోయే కాలంలో ఉత్తరాంధ్ర ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చివేయనున్న ఈ బృహత్ ప్రాజెక్టు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయమైన స్వర్ణాంధ్రఖి నిర్మాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేద్ణు అని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి భారీ బందోబస్తు



**విజయనగరం, జులై 30 ప్రభాత వార్త:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో, అత్యంత ప్రశాంతంగా జరిగేలా దాదాపు 7వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఏఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ విమానాశ్రయ ప్రాంతాన్ని ప్రధానంగా 13 విభాగాలుగా విభజించాలని, వాటిని 89 సెక్టార్లుగా చేసి, ప్రతి సెక్టార్‌కూ 80 నుంచి 100 మంది సిబ్బందిని కేటాయించారు. ఈ బందోబస్తు విధుల కోసం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బలగాలను రప్పించగా, వారిలో 30 మంది ఐపిఎస్ అధికారులతో పాటు డిజి, ఎడిజి, ఐజి, డిఐజి, ఎస్పీ, ఎఎస్పీ, డిఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారన్నారు. సభా ప్రాంగణం, ఎయిర్‌పోర్ట్ జోన్, రూట్ బందోబస్తు, పార్కింగ్ ప్రాంతాలను ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయని, ఔటర్ పెరిఫెరల్ ప్రాంతాల్లో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు, మెటల్ డిటెక్టర్లతో కూడిన క్రైమ్ టీమ్స్ వారం రోజుల నుంచే తనిఖీలు చేపట్టాయని జిల్లా ఎస్పీ తెలిపారు. నేరాలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించామని, డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు ఇప్పటికే సభ, ఎయిర్ పోర్ట్ ప్రాంగణంను క్షుణ్ణంగా తనిఖీలు చేశాయన్నారు. ప్రధాని సభలో ప్రముఖులు పాల్గొననున్న కారణంగా భద్రత కట్టుదిట్టం చేసి, నాలుగంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు. ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మంది ప్రజలు, 5,000 బస్సులు, ద్విచక్ర వాహనాలతో సహా 7,000 వరకు విఐపి, ఇతర ప్రైవేటు వాహనాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లుగా ఎస్పీ తెలిపారు.

**నో ఫ్లైయింగ్ జోన్:** ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల పరిధిలో 48 గంటల పాటు 'నో ఫ్లైయింగ్ జోన్ణ ప్రకటించారు. డిజిసిఎ అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ డ్రోన్లు ఎగరవేస్తే వాటిని జప్తు చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

**అత్యవసర ప్రయాణాలు వాయిదా:** ఆ రోజు జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుందున, అత్యవసరం అయితే తప్ప సాధారణ ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలు జీవితంలో ముందుకెళ్లాలి

- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



**కుప్పం, జులై 30 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని 29 ఏళ్ల క్రితం స్థాపించిన ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలు వారి జీవితాల్లో ముందుకెళ్లి ఆర్థికాభివృద్ధి సాధించాలని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా గురువారం కుప్పం టిటిడి కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు, చిరువ్యాపారులకు తోపుడుబళ్లు, వినికిడి సమస్య ఉన్న వారికి మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేసే సాయంతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. తన ప్రయాణం ప్రజాసేవకే అంకితమైందన్నారు. మహిళలకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచన కుప్పంలోనే పుట్టిందన్నారు. కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే తమ కుటుంబానికి బలం అన్నారు.

**దాతల సహకారం మరువం:** ఎన్టీఆర్ ట్రస్ట్‌కు దాతలు అందిస్తున్న సహకారం మరువమని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. దాతలు ఎంతో నమ్మకంతో సాయం అందిస్తున్నారని వారి సాయాన్ని ప్రజలకే మరలా అందిస్తున్నట్లు చెప్పారు. దాతలు ఇచ్చే విరాళాలకు రిసిప్ట్‌లు సైతం ఇస్తున్నామన్నారు. ట్రస్ట్ వివరాలను ఆడిట్ చేస్తామని ట్రస్ట్ వివరాలు తెరచిన పుస్తకం అని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. తన హృదయానికి దగ్గరైంది చల్లపల్లి ఎన్టీఆర్ స్కూల్ అన్నారు. అక్కడి పిల్లలను చూస్తే ఎంతో సంతోష ం కలుగుతుందన్నారు.

**మహిళలు తలెత్తుకుని తిరగాలి:** సమాజంలో మహిళలు తలెత్తుకుని తిరగాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. మహిళలు ఎవరిపై ఆధారపడరాదన్నారు. తమ తల్లిదండ్రుల్ని బాగా చూసుకోవాలని సూచించారు. కడుపునిండా తిండిపెట్టేది స్త్రీయేనన్నారు. మహిళలతోనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. మహిళలు వివిధ రకాల శిక్షణల్లో నైపుణ్యం పొంది తమ కాళ్లపై తాము నిలబడాలన్నారు. నాకు తెలుసు అనే అహ ం కారం ఉండరాదన్నారు. తనను సిఎం చంద్రబాబు ప్రోత్సహించారని హెరిటేజ్ సంస్థకు ఇడిని చేశారన్నారు. మహిళలు నాకు తెలియదు, నేను చేయలేను అని మహిళలు అనుకోరాదని సూచించారు. మహిళలు గొప్ప శక్తి కలిగి ఉంటారని మగవారి కంటే అధికంగా పనిచేస్తారని పేర్కొన్నారు. మహిళలకు చేయూత అందించాలనే లక్ష్యంతో కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించామన్నారు. కుప్పం మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించేందుకు హైదరాబాద్‌లోని స్త్రీ శక్తి హస్తకళా స్టోర్‌ను ప్రారంభించామన్నారు. అక్కడ విక్రయాలతో వచ్చే లాభాలు తిరిగి మహిళలకే అందిస్తున్నామన్నారు. ఏ రంగంలో అయినా విజయాన్ని సాధించాలంటే సమిష్టి కృషి, టీం వర్క్ ఎంతో ముఖ్యమన్నారు. తాను కూడా తన బృందంతో కలిసి పనిచేస్తామన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సిఇఒ రాజేంద్రకుమార్, సిఒఒ రాజీవ్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు, సిఎం పిఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల రాష్ట్ర అవార్డుల ఎంపికకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం 2026 సంవత్సరానికి ప్రదానం చేయనున్న "రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్ణు ఎంపిక కోసం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, పాఠశాల విద్యా సంచాలకులు - కన్వీనరుగా ఉంటారు. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, రాము సూర్యారావు (ఆర్‌ఎస్‌ఆర్‌మాస్టర్) సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ 2026 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, ప్రభుత్వం నిర్దేశించిన కోటా మేరకు అవార్డు గ్రహీతలను ఖరారు చేయనుంది.

## పరీక్షల బిల్లు ఆమోదంపై డి.సిఎం పవన్ హర్షం

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. పరీక్షల అక్రమాల నిరోధక బిల్లుకు లోక్‌సభ ఆమోదం స్వాగతించదగిన అంశమన్నారు. ఇది ప్రధాని మోడీ దూరదృష్టికి నిదర్శనమన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: మంత్రి లోకేశ్

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్, ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.

## విద్యార్థులకు పండుగే.. 10 రోజులు హాలిడేస్!

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలోని స్కూల్స్, కాలేజీల విద్యార్థులకు ఆగస్ట్ నెల సంతోషాన్ని పంచనున్నది. ఎందుకంటే ఆగస్ట్ నెలలో ఆదివారాలు, రెండో శనివారం, జాతీయ మతరపరమైన పండుగలు కలిపి దాదాపు 10 రోజులు సెలవులు రానున్నాయి. ఆగస్ట్ నెలలో మొత్తం 31 రోజులు ఉండగా, అందులో 10 రోజులు సెలవులు రానున్నాయి. ఎపిలో ఆగస్ట్ నెలలో స్కూల్స్ కేవలం 21 రోజులు మాత్రమే కొనసాగనున్నాయి.

## అపర్ణ మృతి కేసులో ఏడుగురిపై చర్యలు

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** నందిగామ గురుకుల పాఠశాల బాలిక అపర్ణ మృతి కేసులో ఏపీ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అపర్ణ ఇటీవల అస్వస్థతకు గురైంది. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా తగిన వైద్యసాయం అందలేదనేది అభియోగం. ఆమెను కనీసం పరీక్షించని క్రమంలో మృతి చెందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు బాధ్యులైన ఏడుగురిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ముగ్గురు డాక్టర్లు, నలుగురు సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ అధికారిగా డాక్టర్ శేష కుమార్ నియామించారు. రెండు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఎం.వేణుగోపాల్ రెడ్డికి అదనపు బాధ్యతలు

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి డెయిరీ డెవలప్‌మెంట్, అనుబంధ సంస్థ (ఎపిడిఎస్‌సిఎసి) బాధ్యతలను మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి అదనపు బాధ్యతలుగా అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిఒఆర్‌టి నం.128ను జారీ చేసింది. ఎపిడిఎస్‌సిఎసి మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయ బాధ్యతలను కూడా ఎం.వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించనున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన పరిపాలనా, అధికారిక వ్యవహారాలతోపాటు అన్ని ఆర్థిక వ్యవహారాల నిర్వహణ బాధ్యతలనూ వేణుగోపాల్ రెడ్డి చేపట్టనున్నారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వెలువడే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బంది అంతా వేణుగోపాల్ రెడ్డితో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా తన బాధ్యతలతో పాటు ఈ అదనపు బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇటీవల పదవీ విరమణ చేసిన అధికారి బి.రవిప్రకాష్ రెడ్డి స్థానంలో తాత్కాలికంగా ఈ బాధ్యతలను ఎం.వేణుగోపాల్ రెడ్డికి అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఇసుక అక్రమాలపై సుప్రీంలో విచారణ, వాయిదా

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇసుక అక్రమాలపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎజి మషీహ్ ధర్మాసనం ఎదుట ప్రభుత్వ తరపు న్యాయవాది, జెపి పవర్ వెంచర్స్ న్యాయవాదులు తమ వాదనలు విన్పించారు. ఇసుక అక్రమాలకు బాధ్యులు ఎవరన్నది ఎన్‌జిటినే తేల్చాలని జేపీ పవర్ వెంచర్స్ తరఫు న్యాయవాది వాదించారు. తమ పేరుపై ఉన్నవి ఏడు లైసెన్సులు మాత్రమేనని తెలిపారు. అందుకే రూ.7 కోట్ల జరిమానాను కోర్టులో జమ చేశామని చెప్పారు. ఎన్‌జిటి జరిమానా విధించిన మిగతా ఇసుక క్వారీల లైసెన్సులన్నీ ప్రభుత్వం పేరుపైనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇసుక క్వారీల అసలు యజమానులు ఎవరన్నది ఎన్‌జిటియే తేల్చాలని జేపీ పవర్ వెంచర్స్ తరఫు న్యాయవాది కోరారు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో తమ వాదనలను బలంగా వినిపించింది. గతంలో క్వారీలలో మైనింగ్ చేసింది జెపి పవర్ వెంచర్సే అని ఎన్‌జిటి నిర్ధారించిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసును మళ్లీ ఎన్‌జిటికి పంపాలా, లేదా? అనే విషయంపై తదుపరి విచారణ సందర్భంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది.

## ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి బెయిల్‌కు సుప్రీం నో

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు త్రిసభ్య ధర్మాసనం నిరాకరించింది. వెంటనే దర్యాప్తు సంస్థ ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఇతర నిందితులకు ఇచ్చిన ఉత్తర్వులు వర్తింపజేయలేమని తేల్చి చెప్పింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
నెం. 09 / 2026-27, ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 27.07.2026
కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలంలో మల్లంపేట గ్రామంలో 2000 LPH R.O Plant ఏర్పాటు చేయుటకు DMF నిధులతో రూ.10.00 లక్షల వ్యయం గల పనికి ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.in నుండి తేది: 01.08.2026 నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, RWS & S డివిజన్, కాకినాడ
DIPR.No.21065/CL/Advt/1/1/2022-23, తేది: 30.07.2026


మనిషి ఆకలితో ఉన్నప్పుడు అభిమానం, కులం, విద్య, జ్ఞానం, హోదా, అనురాగం అన్నీ మరిచిపోతాడు.

-అవ్వైయార్

# 'గిరి' బాధలు పట్టించుకోండి!

గిరిజన సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించామని ఒకపక్క నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా మరొకపక్క కనీస వైద్యసదుపాయాలు లేక, అర్థాకలితో అల్లాడిపోతున్న కోట్లాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వైద్యసదుపాయాల మాట అటుంచి కడుపునిండా తిండిలేక పౌష్టికాహారం లోపించి లక్షలాది మంది గిరిజనులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సిన గిరిజన బాలబాలికలు రేచీకటి, గ్లోకోమా, కాటరాక్ట్, విటమిన్ ఎ తదితర లోపాలతో అంధులుగా మారుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్వేంద్రియాల్లో కళ్లుఅత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోతే అంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. అవిద్య,అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం, ప్రకృతితోపాటు తోటిమానవుడుచేస్తున్న దోపిడీలతో గిరిజన ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కోట్లాది నిధుల్లో అధిక శాతం వారికి చేరడం లేదనే మాట కాదనలేదనే వాస్తవం. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా వాటి కోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజన అభి వృద్ధి సంస్థలు ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికీ వేలాది గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. నడవడానికి సరైన బాటలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. వర్షాకాలంలో బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే తండాలు, గూడెలు ఎన్నో ఉన్నాయి. వేదికలెక్కి ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ఓట్ల కోసం పాకులాడుతున్నారే తప్ప గిరిజనాభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేయడం లేదనే ఆరోపణలను కొట్టివేయలేం. వైద్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎండాకాలం పోయి, వర్షాకాలం ఆరంభమయ్యే సమయంలో పాతనీరు కొత్తనీరు కలయికతోపాటు వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మలేరియా, డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభించడం వందలాది మంది అసువులు బాయడం మరెందరో రోగ పీడితులు కావడం యేటా సర్వసాధారణమైపోయింది. ఈసారి కూడా అనేక గిరిజన ప్రాంతాలు విషజ్వరాల ముట్టడితో వణికిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇతర విషయాలు ఎలా ఉన్నా గిరిజనుల విషయంలో వైద్య సేవలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం క్షమార్హం కాదు. వైద్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి కేటా యించిన నిధులు వారికే అందేలా చూడడంలో పాల కులు విఫలమవుతున్నారని చెప్పకతప్పదు. భారత రాష్ట్రపతిగా గిరిజన తెగకు చెందిన ద్రౌపతి ముర్ము బాధ్యతలు చేపట్టిన తర్వాత వారి పరిస్థితులు కొంతలో కొంత మెరుగవుతాయని ఆశించారు. ఆ విష యంలో చర్చలు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు యథాతథంగానే ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో పదకొండు కోట్ల మంది గిరిజనులు ఉన్నారు. అది భారతదేశ జనాభాలో 8.6 శాతం.అయినా నిధుల కేటాయింపులు మాత్రం ఆ మేరకు జరగడం లేదు. చివరకు కేటాయించిన నిధుల్లో కూడా అవి వారికి చేరడం లేదనేది కాదనలేని వాస్తవం. ఆదివాసుల ఆరోగ్య పరిస్థితి అధ్యయనం చేయడానికి దాదాపు ఒకటిన్నర దశాబ్దం క్రితం ప్రముఖ గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు డాక్టర్ అభయ్‌బంగ్ నేతృత్వంలో కేంద్రం ఒక కమిటీని నియమించింది.ఆ కమిటీ క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేసి 2018లో ఒక నివేదికను సమర్పించింది.మలేరియా వ్యాధిబారిన పడుతున్న వారిలో అత్యధికంగా ముప్పై శాతం ఆదివాసులే ఉన్నారని స్పష్టం చేసింది. ప్రతి నలు గురు గిరిజనుల్లో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతు న్నారని వెల్లడించింది. అలాగే దేశంలో ఇతరులతో పోలిస్తే 15-54 ఏళ్ల ఆదివాసుల్లో పొగాకు వినియోగం ఎక్కువగా ఉండి క్షయబారిన పడుతున్నట్లు తెలిపింది. ఇంకొకవైపు ఐదేళ్లలోపు ఆదివాసి చిన్నారుల్లో నలభై శాతం సరైన పౌష్టికాహారం కొరవడి గిడుగుబారి పోతున్నారని ఆ నివేదిక తెలిపింది. భారత్‌లో మొత్తం గిరిజనులు 83 శాతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నారు. మరో పదిహేను శాతం ఈశాన్య రాష్ట్రాలతోపాటు బీహార్, జమ్మూకాశ్మీర్, తమిళనాడులో ఉన్నారు. అయితే వారికి ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు చికిత్స అందించేందుకు అవసరమైన స్థాయిలో ఆయా ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు అవసరం మేరకు లేవనే చెప్పొచ్చు. చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత కూడా తీవ్రంగానే ఉంది. డాక్టర్లను కిందిస్థాయి ఉద్యోగులను కొంతమేరకు నియమిస్తున్నా వారిని అక్కడికి పంపడంలో విఫలమవుతున్నారు. దీనికితోడు సరఫరా అవుతున్న మందులు నాసిరకం కావడంతో రోగాలు తగ్గక నమ్మకం సన్నగిల్లి గిరిజనులు నాటువైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. పసర్లు, వేర్లు, ఆకులతో వచ్చీరాని వైద్యం చేసుకొని ప్రాణాల మీద తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు గిరిజన సంక్షేమం మాటల్లో కాకుండా చేతల్లో చూపాల్సిన అవసరం ఉంది. రాజకీయాలకు అతీతంగా వారి అభ్యున్నతికి పాటుపడాలి. ప్రధానంగా విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీన్ని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.

ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతుల నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులుగాని అవుతారు.



వి. జాన్సన్

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గాని భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## సోషల్ మీడియాతో జాగ్రత్త!

సోషల్ మీడియానే జీవితం అనుకుంటే పప్పులో కాలేసినట్లే! ఎందుకంటే స్వార్థ ప్రయోజనాలకోసం బాధ్యతను విస్మరించే వ్యక్తులు, అక్రమాలకు సహకరించే సామాజిక ధోరణి ఎక్కువైంది. సమాజంలో మాట్లాడలేని బూతు పదాలు సోషల్ మీడియాలో విరివిగా దొరుకుతున్నాయి. వ్యక్తులను మార్చివేసేసోషల్ మీడియా మత్తులోపడి వ్యక్తిగత సంబంధాలకు దూరంఅవుతున్నారు.కుటుంబ సభ్యులతో సమయం గడపటానికి తీరిక లేనంతగా సెల్‌ఫోన్‌లో బిజీగా ఉంటున్నారు. ఇంటికొచ్చిన అతిథులను పలకరించేందుకు తీరికలేనంతగా ఫోన్‌కు అతుక్కుపోతున్నారు. గోప్యంగా ఉంచాల్సిన వ్యక్తిగత విషయాలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు.అంతేకకాకుండా ఒకడుగు ముందుకేసిఉన్నది లేనట్టు,లేనిది ఉన్నట్టు కల్పిత వార్తలను సృష్టించి ఎందరో అమాయకుల జీవితాలతో ఆడుకుంటున్నారు.ఇటువంటి వారిపైన ప్రభుత్వాలు దృష్టిపెట్టి కఠిన చర్యలుతీసుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## బ్రాహ్మణ ఆధిపత్యమే సనాతనమా?

ఈమధ్య సనాతనం అనే పదం ఎక్కువగా ఉపయోగించబడుతుంది. పాపం సనాతనాన్ని రూపుమాపాలి అన్న స్టాలిన్ కొడుకు మీద కొంతమంది ఇరుచుకపడ్డారు. సనాతనం అంటే ఇది అనిమాత్రం ఖచ్చితంగా చెప్పటంలేదు? సాక్షాత్తు ప్రధాని అంతటి వాడికి సనాతనం అంటే తెలియక మాట్లాడుతున్నారని, పవన్ కళ్యాణ్ లాంటివారికి కూడా తెలియదు అని అనుకోలేం. మరిసనాతనం అంటే ఏమిటి?మహాచార్యులు అని పెరుగాంచిన ఆది శంకరుల వారు తన గీతాభాష్యంలో 'బ్రాహ్మణత్వన్యహి రక్షణే రక్షితశ్యాత్ వైదికోధర్మ:తదదీనత్వాత్ వర్ణాశ్రమ భేదానామ్:" అనగా వర్ణాశ్రమ వ్యవస్త అంతా బ్రహణత్వం మీదనే ఆధారపడి ఉన్నది. అభ్యుదయవాదులు ఇంతటి అశాస్త్రీయమన సనాతనాన్ని పాతరి పెట్టాలని కోరుకుంటారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఆరుబయట జాగ్రత్త

**వర్షాకాల** నేపథ్యంలో బోరు బావుల వద్ద కరెంటు, ట్రాన్స్ఫార్మర్ పోల్‌ల వద్ద రైతులు, చిన్న పిల్లలు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదు. వీలైనంత వరకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## మొబైల్ ఫోన్ల వ్యసనాన్ని నివారించలేమా?

'స్మార్ట్‌ఫోన్‌లు'నేటిజీవితంలో మానవుని అంతర్భాగమైనప్పటికీ, వాటి మితిమీరిన వాడకం యువతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం విద్యార్థుల ఏకాగ్రతను తగ్గిస్తోంది. ఇది వారి చదువు, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.మొబైల్ వాడకంలో ఆత్మ నియంత్రణను పెంపొందించడం నేడు అత్యవసరం.తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపడమే కాకుండా, ఉపాధ్యాయులు కూడా డిజిటల్ క్రమశిక్షణపై అవగాహన కల్పించాలి. యువతను క్రీడలు,పఠనం, సృజనాత్మక కార్యకలాపాలలో నిమగ్నం చేయడం ద్వారా మొబైల్ వ్యసనాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చు. ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పొదుపు నేర్పాలి

ఆరు దశాబ్దాల క్రిత పైసా, రెండు, మూడు, ఐదు, పది, ఇరవయి పైసలు పావలాచేతికందగానే చిరుతిళ్లకైబాలబాలికలు చిల్లర దుకాణంవైపు పరుగులూ పడుతుంటారు. డబ్బులు కూడాపెట్టాలి. మున్ముందు చాలా అవసరం అవుతాయన్న అవగాహన, అంతగా లేని రోజులు. చేతిలో ఎన్ని పైసలున్నా ఖర్చు చేయడానికి వెనుకాడము. ఇక పిల్లలకు పొదుపు మంత్రం పాటించడానికి కుదరని పరిస్థితులు. అప్పట్లో చాలా కుటుంబాలు రాబడి తక్కువగా, వెచ్చాలు ఎక్కువగా ఉండేవి. చారాన కోడికి బారానా మసాలాగా ఉందంటే అతిశయోక్తి కాదు. అయినా కూడా చాలా ఫ్యామిలీలు కష్టపడి కీర్తి, కనకం సంపాదించుకున్న సందర్భాలు కోకొల్లలు. తల్లిదండ్రులు బాల్యం నుంచే పిల్లలకు పొదుపు నేర్పించాలి.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

## అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి

మార్కెటింగ్ వ్యవస్థలో అడ్వర్టైజింగ్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రతిరోజు ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును వినియోగిస్తూనే ఉంటాడు. ప్రతిమానవుడు వినియోగదారుడే. కనుక విద్యార్థులకు ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, విద్యార్థులకు అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి. పూర్వం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు కలిగిన వారికి బోధన రంగంలో అవకాశాలు కల్పించాలి.అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టుమీద అవగాహనకల్పించాలి.2026- 2027 విద్యా సంవత్సరం నుండి ఈ సబ్జెక్టు ప్రారంభించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన విఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సైబర్ నేరాల కట్టడికి అవగాహనే ఆయుధం

సైబర్ నేరాలను పూర్తిగా నిర్మూలించడం కష్టమైనప్పటికీ, వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యమే. ఇందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ,బ్యాంకులు,సాంకేతికసంస్థలు, విద్యాసంస్థలు, మీడియా, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. చట్టాల అమలుతోపాటు వేగవంతమైన దర్యాప్తు, నేరస్థులకు కఠినశిక్షలు, అంతర్రాష్ట్ర- అంతర్జాతీయ సహ కారం కూడా అత్యంత కీలకం. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, ప్రజల అవగాహన కూడా అంతే వేగంగా పెరగాలి. తెలంగాణ డిజిటల్ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో సైబర్ భద్రతను కూడా అదేస్థాయిలో బలోపేతం చేయడం కాలానుగుణ అవసరం. ప్రతి పౌరుడు 'అనుమానం వస్తే ఆగు – ధృవీకరించు – తరువాతే చర్య తీసుకో' అనే సూత్రాన్ని పాటిస్తే సైబర్ నేరగాళ్లకు అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే అత్యంత విలువైన రక్షణ కవచం. సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియో గం చేసుకుంటూ భద్రతా నియమాలను పాటించడం ద్వారానే సురక్షితమైన డిజిటల్ తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల

డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారింది. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్‌వాలెట్లు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయి. తెలంగాణ రాష్ట్రం సమాచార సాంకేతిక రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నప్పటికీ, అదే స్థాయిలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుండటం ప్రజలను, ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి ఐటీ మహానగరంతో పాటు జిల్లాలకూ సైబర్ మోసాల విస్తరణ జరగడం ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. కొన్ని సంవత్సరాలక్రితం వరకు సైబర్ నేరాలు ప్రధానంగా ఈమెయిల్ మోసాలు, ఏటీఎం కార్డుల క్లోనింగ్, క్రెడిట్ కార్డు మోసాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, డీప్‌ఫేక్ సాంకేతికత, నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయి. నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోంది.తెలంగాణలో ప్రతి నెల వేల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయి. కోట్ల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, చిన్న వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ నిపుణులు సైతం ఈమోసాల బారినపడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోంది. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు, న్యాయస్థానాల పేర్లు చెప్పి వీడియో కాల్‌ల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్‌లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు దేశవ్యాప్తంగా వెలుగు చూశాయి. అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయి. సైబర్ నేరాల పెరుగుదలకు ప్రజల





నిర్లక్ష్యం కూడా కొంత కారణమవుతోంది. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను తెరవడం, అపరిచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్‌లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయి.సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా వినియోగదారుడి అప్రమత్తతే మొదటి రక్షణగా నిలుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ సవాలును ఎదుర్కొనేందుకు అనేక చర్యలు చేపడుతోంది. రాష్ట్ర పోలీసుశాఖ ప్రత్యేక సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్లు, సైబర్ సెక్యూరిటీ విభాగాలను బలోపేతం చేసింది. సాంకేతిక నిపుణుల సహకారంతో నేరాల దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, నిధుల ట్రాకింగ్ వంటి చర్యలు వేగవంతమవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, ప్రజా వేదికలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సైబర్ భద్రతపై ప్రజలకు సూచనలుఅందిస్తున్నారు. సైబర్ నేరాలపై తక్షణ ఫిర్యాదుల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిన జాతీయ సైబర్ హెల్ప్‌లైన్1930కు వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే జాతీయ సైబర్ క్రైమ్ ఫిర్యాదు వేదిక ద్వారా కూడా బాధితులు ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. మోసంజరిగిన వెంటనే సమాచారం అందిస్తే నిధులను నిలిపివేసేఅవకాశం పెరుగుతుంది. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదు. తెలియని లింక్‌లను నొక్కకూడదు. అధికారిక యాప్‌లను మాత్రమే డౌన్‌లోడ్ చేయాలి. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలి. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడుపరిశీలించాలి. అనుమానాస్పద కాల్‌లువస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలి. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతసమాచారం, కుటుంబవివరాలు, ప్రయాణ వివరాలు బహిరంగంగా పంచుకోవడాన్ని తగ్గించాలి. విద్యార్థులు, యువత, వృద్ధులు, మహిళలు వంటి వర్గాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంతఅవసరం. విద్యాసంస్థలలో డిజిటల్ భద్రతపై పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేటు సంస్థల సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, బ్యాంకులు తమ వినియోగదారులకు తరచూ హెచ్చరిక సందేశాలు పంపించడం, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడం వంటిచర్యలు సైబర్ నేరాల నియంత్రణకు దోహదపడతాయి. అలాగే కృత్రిమ మేధస్సును ఉపయోగించి అనుమానాస్పద లావాదేవీలను ముందుగానే గుర్తించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. సైబర్ నేరాలను పూర్తిగా నిర్మూలించడం కష్టమైనప్పటికీ, వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యమే. ఇందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ,బ్యాంకులు,సాంకేతికసంస్థలు, విద్యాసంస్థలు, మీడియా, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. చట్టాల అమలుతోపాటు వేగవంతమైన దర్యాప్తు, నేరస్థులకు కఠినశిక్షలు, అంతర్రాష్ట్ర- అంతర్జాతీయ సహకారం కూడా అత్యంత కీలకం. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, ప్రజల అవగాహన కూడా అంతే వేగంగా పెరగాలి. తెలంగాణ డిజిటల్ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో సైబర్ భద్రతను కూడా అదేస్థాయిలో బలోపేతం చేయడం కాలానుగుణ అవసరం. ప్రతి పౌరుడు'అనుమానం వస్తే ఆగు – ధృవీకరించు – తరువాతే చర్య తీసుకో' అనే సూత్రాన్ని పాటిస్తే సైబర్ నేరగాళ్లకు అవకాశాలు గణనీయం గా తగ్గుతాయి. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే అత్యంత విలువైన రక్షణ కవచం. సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భద్రతా నియమాలను పాటించడం ద్వారానే సురక్షితమైన డిజిటల్ తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుంది. ●

# ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా శ్రామికుల జీవితాల్లో మార్పు రాదా?



ఫిరోజ్ ఖాన్

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం 2026లో భారత నామమాత్రపు ఆర్థిక వ్యవస్థ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరువలో ఉండొచ్చని, ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే వాస్తవ జీడీపీ వృద్ధి కూడా అధిక స్థాయిలో కొనసాగుతుందని అంచనా. ఈ గణాంకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశ ఆర్థికాభివృద్ధిఫలాలు శ్రమించే వ్యక్తి జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయన్న ప్రశ్న సహజంగానే ముందుకు వస్తోంది. వివిధ అధికారిక అంచనాలు, అధ్యయనాల ప్రకారం భారత ఉపాధిలో సుమారు 80-90 శాతం అసంఘటిత రంగానికి సంబంధించినదిగా పేర్కొనబడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చట్టాలు, సంక్షేమ పథకాలు, డిజిటల్ వేదికల ద్వారా కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుండగా, అమలు స్థాయిలో ఇంకాసవాళ్లు ఉన్నాయని కార్మిక సంఘాలు, పరిశోధకులు ప్రస్తావిస్తున్నారు. అందువల్ల ఆర్థిక వృద్ధితో పాటు గౌరవప్రదమైన ఉపాధి, న్యాయమైన వేతనం, సామాజిక భద్రత కూడా సమానంగా ప్రాధాన్యం పొందాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగంలోని అధికరణలు 14, 21సమానత్వం, గౌరవప్రదమైన జీవన హక్కులను పరిరక్షిస్తాయి. అలాగే రాష్ట్ర విధాన మార్గదర్శక సూత్రాలలోని అధికరణలు 39, 41, 43 పనికి తగిన వేతనం, జీవనోపాధి, సామాజిక భద్రత వంటి లక్ష్యాలను సూచిస్తాయి. ఈ దిశగా పార్లమెంట్ వేతనాల సంహిత, 2019ను ఆమోదించింది. ఇతర కార్మిక సంహితల అమలు కూడా సంబంధిత నోటిఫికేషన్లు, నియమాల ప్రకారం దశలవారీగా కొనసాగుతోంది. పరిశ్రమల ప్రతినిధులు పెట్టుబడులు, ఉత్పాదకత, పోటీతత్వం, ఉపాధి సృష్టిని సమతుల్యంగా పరిగణించాల



లని సూచిస్తుండగా, కార్మిక సంఘాలు కనీస వేతనాల సమర్థ అమలు, అసంఘటిత రంగంలో పర్యవేక్షణ బలోపేతాన్ని కోరుతున్నాయి. రాష్ట్రాల మధ్య వేతన విధానాల్లో వ్యత్యాసాలు, అమలు సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో చట్టం శ్రామికుడి జీవితంలో ప్రత్యక్ష ఫలితాలుగా కనిపించడమే అసలు లక్ష్యం.తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలుకూడా నిత్యావసర వినియోగంద్వారా పరోక్ష పన్నుల వ్యవస్థలో భాగస్వాములవుతాయి. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈశ్రమ్, ఆయుష్మాన్ భారత్, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఈశ్రమ్ పోర్టల్‌లో 31 కోట్లకు పైగా కార్మికులు నమోదు కావడం ఈ రంగాన్ని అధికారిక వ్యవస్థతో అనుసంధానించే ప్రయత్నాలకు సూచికగా భావించవచ్చు. అదే సమయంలో గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులు సహాకొన్ని వర్గాలకు సంక్షేమ పథకాల పూర్తి ప్రయోజనాలు సమానంగా చేరేవిషయంలో ఇంకా మెరుగుదలకు అవకాశంఉందని స్వతంత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి. డిజిటల్ సేవల విస్తరణతో హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెరుగుతున్నా, సమర్థవంతమైన అమలు, పారదర్శక పరిపాలనే వాటి విజయాన్ని నిర్ణయిస్తుంది. ఆర్థిక వృద్ధి,పెట్టుబడులు, పరిశ్రమలు, ఎగుమతులు దేశాభివృద్ధికి కీలకం. అయితే ఆ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా శ్రమించే కార్మికులకు చేరినప్పుడే అది సమగ్ర అభివృద్ధిగా నిలుస్తుంది. అంతర్జాతీయ కార్మికసంస్థ గౌరవప్రదమైన పని, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలను స్థిరమైన అభివృద్ధికి కీలక అంశాలుగా పేర్కొంటోంది. అందువల్ల ఒక దేశ విజయాన్ని కేవలం జీడీపీ లేదా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు, ఉపాధి నాణ్యత, సామాజిక భద్రత, అవకాశాల సమానత్వంతో కూడా కొలవాలి. ప్రభుత్వాలు విధానాలు రూపొందించడం, పరిశ్రమలు ఉపాధి సృష్టించడం, కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవడం, ఈ మూడు అంశాలు సమన్వయంతోముందుకు సాగినప్పుడే ఆర్థికాభివృద్ధి సామాజిక న్యాయంగా మారుతుంది. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఒక ముఖ్యమైన ఆర్థిక మైలురాయి కావచ్చు. అయితే ఆ అభివృద్ధి ఫలాలు చివరి శ్రామికకుటుంబం జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచినప్పుడే ఆ విజయానికి పూర్తి అర్థం వస్తుంది. ●

# బనకచర్ల పేరుతో విభేదాలు అవసరమా?



అన్నవరపు బ్రహ్మయ్య

బనకచర్ల జలాశయ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ల మధ్య అనవసరమైన రాజకీయ చర్చకు దారితీస్తోంది. నిజానికి ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగా గోదావరి నదికి, తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేదు. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే ఒక సాగు నీరు తాగునీరుకు సంబంధించినది. గోదావరికి వరదలు వచ్చే సమయంలోవృథాగా సముద్రంలో కలిసిపోయే నీళ్లను ఒడిసి పట్టుకొనే పథకం పోలవరం. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి విభజన చట్టంలో కేంద్రప్రభుత్వం కూడా అంగీకరించింది. ఆ పోలవరం ప్రాజెక్ట్ నుంచి కృష్ణానది ద్వారా కరవు పీడిత రాయలసీమ ప్రాంతాన్ని సారవంతమైన భూమిగా మార్చేందుకు రూపొందించిన పథకం ఈ బనకచర్ల జలాశయ ప్రాజెక్టు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ నేత మాజీమంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. బనకచర్ల ప్రాజెక్ట్ అనేది వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని పట్టుకొనే పథకం మాత్రమేనని దీనికి తెలంగాణ రాష్ట్రానికి ఎటువుంటి సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ విద్యా ఐటి శాఖామాత్యులు నారా లోకేష్ వివరించారు. తెలంగాణ పరిధిలో గోదావరి నదిపై ఎన్ని పథకాలు కట్టుకున్న మాకు అభ్యంతరం లేదు, ఎందుకంటే బనకచర్ల వృథాగాపోయే వరద నీటినిమాత్రమే ఒడిసి పట్టుకుంటుందని మంత్రి లోకేష్ ఇచ్చిన వివరణపై ఆలోచించాలి. అందుబాటులో వున్న సమాచారం ప్రకారం 2016 నుంచి 2024 సంవత్సరాల మధ్య కాలంలో దాదాపు 28,500 టిఎంసిల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయింది. ఒక్క 2024 సంవత్సరం లోనే 2,828టి. ఎం.సి. నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. ఈ నేపథ్యంలో వృథాగా పోయేనీటిని ఒడిసి పట్టేందుకు రూపొందించినదే పోలవరం ప్రాజెక్ట్. పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ గోదావరి నీటిని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వద్ద వున్న ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానదిలో కలుపుతారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి గుంటూరు జిల్లాలోని బొల్లపల్లి జలాశయానికి అక్కడ నుండి నంద్యాల జిల్లా బనకచర్ల జలాశయానికి పలు ఎత్తిపోతల కేంద్రాలు, సొరంగాల ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్లలో నిర్మించే



జలాశయం సామర్థం 20వేల క్యూసెక్కు బనకచర్ల జలాశయం నుంచి ప్రవహించే నీరు శ్రీశైలం కుడికాల్వకు ఇదిఅనుసంధానం అవుతుంది. గోదావరికి వరదలు వచ్చి, ఆ నీరు కృష్ణానది ద్వారా బనకచర్లకు నీరు వస్తే రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో అదనంగా దాదాపు 7.5 లక్షల ఎకరాలకు సాగునీరు లభించడమే కాకుండా 20లక్షల మందికి దాహార్తి తీర్చుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణకు ఏ మాత్రం సంబంధంలేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్ కేవలం వరదల కారణంగా వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని దృష్టిలో పెట్టుకొని నిర్మిస్తున్నది. ఈ నేపథ్యంలో గోదావరికి వరదలు రానిపక్షంలో ఈ పథకం వల్ల ఎటువంటి ప్రయోజనం వుండదు. ఈ విషయం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవగాహన వున్నప్పటికీ ఎప్పుడు వరదలు వస్తే అప్పుడే వృథా నీటిని ఉపయోగించుకో వచ్చుననే ఉద్దేశ్యంతో బనకచర్లను రూపొందిస్తోంది. దీనిని బట్టి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన లాభనష్టాలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే చెందుతాయి. బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాకుండా తెలుగు దేశం పార్టీకి రాజకీయంగా పట్టు పెరుగుతుంది. సాఫ్ట్వేర్ వంటి అంశాలలోనే కాకుండా చంద్రబాబు నాయుడుకు నీటిపారుదల పథకాల పట్ల కూడా ముందుచూపు వుందని, అందుకు నిదర్శనమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.పోలవరంకు అనుసంధానంగా 2016న సంవత్సరంలో ప్రారంభమైన పట్టిసీమ ప్రాజెక్ట్ ఖర్చుచేసింది 1660 కోట్ల రూపాయలు. ప్రాజెక్ట్ ప్రారంభమైన నాటినుంచి నేటివరకు 442టిఎంసిల నీరు కృష్ణాడెల్టాకు అందింది. దీంతో రైతులు 10 వేల కోట్ల రూపాయల విలువైనపంటలు పండించుకోగలిగారు.ఎల్‌నినో నేపథ్యంతో వర్షాలు పడని స్థితిలో కూడా పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు అందిస్తున్నారు. పట్టిసీమ తరహాలోనే వృథాగా సముద్రంలో కలిసే నీటిని దృష్టిలో పెట్టుకొని ఈ పథకాన్ని చంద్రబాబు నాయుడు రూపొందించారు. నికర జలాలతో ఈ పథకానికి సంబంధమే లేదు.ఈస్థితిలో తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న నష్టంగానీ, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించే అంశం ఏమిటో అర్థం కావడం లేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుకు కృష్ణానదీ నిర్వహణ బోర్డు, గోదావరి నదీ నిర్వహణ బోర్డుల నుంచి అవసరమైన అనుమతులు లభించలేదని తెలంగాణ నేతలు పేర్కొంటున్నారు. నికర జలాలు వాడుకొనేటప్పుడు లేదా వాటా అడుగుతున్నప్పుడు అనుమతులుఅవసరమవుతాయి. శ్యాస్త్రీయంగా, పాలనాపరంగా ఎటువంటి ఇబ్బంది లేకపోయినా బనకచర్ల పేరుతో మరోసారి ఆంధ్ర,తెలంగాణ ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం భావ్యం కాదు. ●



# జంతర్ మంతర్ నిరసనలో 2,873మంది నేరస్తులు

## ఫేషియల్ రికగ్నిషన్‌తో గుర్తించిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ,జూలై 30: కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇటీవల జరిగిన జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు కీలక డోసియర్‌ను సిద్ధం చేశారు. ఈ డోసియర్‌లో నిరసనల్లో పాల్గొన్నట్లు గుర్తించిన నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ఫోటోలు, పోలీసు రికార్డులు, వారి నేర నేపథ్యానికి సంబంధించిన వివరాలను పొందుపరిచినట్లు సమాచారం. ఈ పత్రాలను పార్లమెంట్ ముందుంచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ పోలీసుల ప్రకారం జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో 2,800 మందికి పైగా నేర చరిత్ర కలిగిన వ్యక్తులు పాల్గొన్నట్లు గుర్తించారు. నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో వీరిలో ఎవరైనా ప్రమేయం ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.పోలీసు వర్గాల సమాచారం మేరకు, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ సాంకేతికతతో పాటు ఇతర ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 2,873 మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించారు. నిరసనల కాలంలో వీరి కదలికలు, హింసాత్మక ఘటనలతో వీరికి ఉన్న సంబంధాలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టారు. 989 మంది తీవ్రమైన నేరాల కేసుల్లో నిందితులని పోలీసుల వెల్లడిగుర్తించిన 2,873 మందిలో 989 మంది తీవ్రమైన నేరాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. వీరిలో101 మంది హత్య కేసుల్లో,62 మంది హత్యాయత్నం కేసుల్లో,284 మంది దోపిడీ, దొంగతనం కేసుల్లో,61 మంది అత్యాచార కేసుల్లో,6 మంది పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో,25 మంది మహిళలపై వేధింపుల కేసుల్లో,229 మంది ఆయుధాల చట్టం ఉల్లంఘన కేసుల్లో,135 మంది స్నాచింగ్ కేసుల్లో,19 మంది కిడ్నాప్ కేసుల్లో,67 మంది మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు డోసియర్‌లో పేర్కొన్నారు.పునరావృత నేరస్తుల సంఖ్య కూడా గణనీయమేడోసియర్ ప్రకారం, గుర్తించిన వారిలో గణనీయమైన సంఖ్యలో పునరావృత నేరస్తులు కూడా ఉన్నారు.హత్య కేసుల్లో ఉన్న 101 మందిలో 42 మందిపై రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి.వీరిలో 12 మందిపై పది లేదా అంతకంటే ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.దోపిడీ, దొంగతనం కేసుల్లో ఉన్న 284 మందిలో 155 మందిపై రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసులు, 31 మందిపై పది లేదా అంతకంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. హత్యాయత్నం కేసుల్లో ఉన్న 62 మందిలో 25 మందిపై బహుళ క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసు రికార్డులు సూచిస్తున్నాయి.దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడిపోలీసు వర్గాల ప్రకారం, నిరసనల్లో పాల్గొన్న వారిలో చాలామంది కేవలం ఒకే ఒక్క కేసులో నిందితులు కాకుండా, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, మహిళలపై నేరాలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల కేసులు, ఆయుధాల చట్టం ఉల్లంఘన వంటి తీవ్రమైన నేరాల్లో పలుమార్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులుగా గుర్తించబడ్డారు.అయితే, నేర చరిత్ర ఉన్న వ్యక్తులు నిరసనల్లో పాల్గొనడం మాత్రమే వారు నిరసనల సందర్భంగా జరిగిన హింసకు బాధ్యులని నిర్ధారించదని, ఆ అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారిని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్, ఫేషియల్ రికగ్నిషన్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## వందే మాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ

### పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 30: జాతీయ గీతం జనగణమనకు ప్రస్తుతం ఉన్న చట్టబద్ధ రక్షణను జాతీయ గేయం వందే మాతరంకు కూడా కల్పించేప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (సవరణ) బిల్లు–2026 పార్లమెంట్ గురువారం ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం వందే మాతరాన్ని అవమానించే చర్యలకు గరిష్ఠంగా మూడుసంవత్సరాల జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ ఇది కేవలం చట్ట సవరణ మాత్రమే కాదని, భారత సాంస్కృతిక వారసత్వం, జాతీయ గుర్తింపు, స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని ప్రతిబింబించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. వందే మాతరం కేవలం ఒక పాట కాదని, దేశ ఆత్మకు ప్రతీకగా నిలిచిందని, స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు ఇది ప్రేరణగా నిలిచిందని ఆయన అన్నారు.చారిత్రక సంఘటనను ప్రస్తావించిన నిత్యానంద్ రాయ్ దేశ తొలి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1947 ఆగస్టు 15 ఉదయం 6.30గంటలకు ఆకాశవాణిలో పూర్తి స్థాయిలో వందే మాతరం ఆలపించాలని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, ప్రముఖగాయకుడు పండిట్ ఓంకార్‌నాథ్ ఠాకూర్‌ను కోరిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ సవరణతో దేశభక్తి, జాతీయగౌరవం, స్వాతంత్ర్య సమర వారసత్వానికి మరింత బలం చేకూరుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చర్చలో పాల్గొన్న డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ, ఈ చట్టం దేశ ప్రజల మధ్య విభేదాలను పెంచే అవకాశముందని విమర్శించారు.మరోవైపు బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా, వందే మాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత ఏడాది నవంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సవరణతో జాతీయ గేయమైన వందే మాతరంకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## బిజెపిలో చేరకపోతే చంపేస్తామంటున్నారు

### సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు





ముంబయి,జూలై 30: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను భారతీయ జనతా పార్టీలో చేరాలని కొందరు బెదిరిస్తున్నారని ఆరోపించారాయన. కాషాయం పార్టీలో చేరకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారన్నారు. తన కుటుంబ సభ్యులను చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ బెదిరింపులపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు దీప్కే తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారిపై ఇలా బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెల్లెట్ గన్స్ వినియోగంపై కూడా స్పందించారు దీప్కే. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ ప్రయోగానికి సంబంధించిన విధానంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీనా పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యత తను మరో నాయ కుడికి అప్పగించాల న్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపా లని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యా రంగంలో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువ తలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థంచేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమ వుతుందని అభిజీత్ హెచ్చరించారు.



## ఎన్నిక కాని వ్యక్తికి 7 నెలలైనా మంత్రి పదవి ఎలా?

### బీహార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 30: ఆరు నెలలకు పైగా బీహార్ శాసనసభలోని ఏ సభకు కూడా ఎన్నిక కానప్పటికీ, దీపక్ ప్రకాష్‌ను రాష్ట్ర మంత్రిగా ఎందుకు కొనసాగిస్తున్నారో వివరించాలని సుప్రీంకోర్టు గురువారం బీహార్ ప్రభుత్వాన్ని కోరింది. శాసనసభ లేదా శాసన మండలిలో సభ్యుడు కానప్పటికీ, ప్రకాష్‌ను బీహార్ పంచాయతీరాజ్ మంత్రిగా తిరిగి నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 'ఏ సభకు ఎన్నిక కాని మంత్రి ఆరు నెలలకు మించి ఎలా కొనసాగుతారు?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని వచ్చే మంగళవారం విచారణకు జాబితా చేయాలని ధర్మాసనం ఆదేశించింది.రాకేష్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో, ప్రకాష్‌ను మొదట నవంబర్ 20, 2025న మంత్రిగా నియమించారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(4) ప్రకారం ఆయన ఆరు నెల్లలోగా శాసనసభ సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉందని, అలా చేయడంలో విఫలమైతే మే 20, 2026 న ఆయన పదవిలో ఉండరని వాదించారు. మొదట ఎన్నిక కాకుండానే ఆయనను తిరిగి నియమించారని, తద్వారా ఆరు నెలల కాలపరిమితిని మళ్లీ ప్రారంభించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి, దీపక్ ప్రకాష్‌కు నోటీసులు జారీ చేసి, పిటిషన్‌పై వారి స్పందనను కోరింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రకాష్ తమ సమాధానాలను దాఖలు చేసిన తర్వాత ఈ పిటిషనను ముందుకు కొనసాగించవచ్చని భావిస్తున్నారు. అటు వంటి పునర్నియామకానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(4) అనుమతిస్తుందా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది.



## వదిన తలనరికి హత్యచేసిన మరిది

పాట్నా,జూలై 30: బీహార్‌లో దారుణ ఘటన జరిగింది. వదిన వంట ఆలస్యం చేసిందని ఏకంగా ఆమె తల నరికి చంపాడు మరిది. ఈ ఘటన బీహార్, జెహనాబాద్ జిల్లా, పార్సా బిఘా పోలీస్ స్టేషన్ పరిధి లోని ఇమాద్‌పూర్ గ్రామంలో జరిగింది. మృతురాలిని అన్నదేవి (25)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధర్మేంద్ర కుమార్ భార్య అన్న దేవి. ఘటన జరిగిన సమయంలో అన్న భర్త ధర్మేంద్రతోపాటు కుటుంబంలోని మగవారు పనుల కోసం పొలానికి వెళ్లింది. ఆమె మరిది కునాల్ కుమార్ పని చేసి, ఇంటి వచ్చి త్వరగా వంటచేసి, ఆహారం వడ్డించాలని వదిన అన్నదేవిని కోరాడు. ఈ క్రమంలో వంట ఆలస్యం చేయడంపై కునాల్ తన వదినపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఇద్దరిమధ్యా కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆవేశానికి లోనైన కునాల్ కుమార్ తన వదినపై దాడి చేసి గొడ్డలితో నరికి చంపాడు. ఆమె తలను వేరు చేసి ఇంటి సమీపంలో ఉన్న మర్రిచెట్టుకు వేలాడదీశాడు. ఆ ఇంట్లో ఏదో గొడవ జరుగుతోందని గమనించిన చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూశారు. అదే సమయంలో అక్కడ కొద్ది దూరంలో ఉన్న మర్రిచెట్టుకు అన్నదేవి తల వేలాడుతూ కనిపించింది. దీంతో ఆ దృశ్యం చూసి షాక్‌కు గురైన వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు కునాల్ కుమార్‌ను అరెస్టు చేశారు.

## పాకిస్థాన్ కాశ్మీర్ అంటూ ఏమీలేదు..ఆక్రమిత కాశ్మీర్ మాత్రమే: భారత్

వాషింగ్టన్, జూలై 30: పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతోన్న ఘర్షణలను ప్రస్తావిస్తూ అమెరికా మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' రాసిన కథనం వివాదానికి దారితీసింది. 'స్థానిక ఎన్నికలు ప్రారంభం కాగానే పాకిస్తాన్ కాశ్మీర్‌లో ఘర్షణలు చెలరేగాయి' అంటూ ఆ కథనానికి శీర్షిక పెట్టింది. దీనిపై అమెరికాలోని భారత రాయబార కార్యాలయం తీవ్రంగా స్పందించింది. అందులో ప్రస్తావించిన పేర్లను ఖండించింది. 'అది తప్పుదోవ పట్టించే శీర్షిక. పాకిస్తాన్ కాశ్మీర్ అంటూ ఏది లేదు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ మాత్రమే. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకాశ్మీర్, లద్దాఖ్, ఎల్లప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. వీటిలోని కొన్ని భాగాలను పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. ఇప్పుడు అక్కడి ప్రజలపై హింసకు పాల్పడుతోంది' అని భారత ఎంబసీ మండిపడింది.పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిర్వహిస్తోన్న ఎన్నికల సందర్భంగా నిరసనకారులు, భద్రతాదళాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులపై పాకిస్తాన్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పలు ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడాన్ని నిషేధించారు. మరోవైపు ఆందోళనల్లో చనిపోయిన తమ వారి మృతదేహాలను భద్రతా దళాలు ఇవ్వడం లేదని పలు కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.

## కుంభకోణంలో నిందితుడు 3 ప్రభుత్వ రంగ సంస్థలకు ఎలా అధిపతి?

### కేరళ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు




కొచ్చి, జూలై 30: రూ.600 కోట్ల జిడిసిఎ (కాష్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కుంభకోణంలో విచారణ ఎదుర్కొంటున్న ఒక సీనియర్ అధికారిని కీలక ప్రభుత్వ రంగ పదవులలో కొనసాగించినందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా విమర్శించింది. సామాజిక కార్యకర్త కెపి పాఠూస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుపుతూ, ఒక పెద్ద అవినీతి కేసులో నిందితుడిగా ఉన్న అధికారిని కీలక ప్రభుత్వ సంస్థల బాధ్యతలను ఎలా అప్పగించారని జస్టిస్ ఎ. బదర్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. సిబిఐ కేసులో ప్రధాన నిందితుడైన డాక్టర్ కెఎ రతీష్, కేరళ ఖాదీ బోర్డు కార్యదర్శిగా, కేరళ స్టేట్ రుద్రాన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కేరళ ఖాదీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా కొనసాగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు, నాలుగు వారాల్లోగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణ కోరింది. "ఇంతటి ప్రధాన అవినీతి నిందితుడిని మూడు ముఖ్యమైన సంస్థలకు అధిపతులుగా ప్రభుత్వం నియమించిందా? అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ పదవులే అవినీతికి విస్తృత అవకాశం కల్పిస్తున్నాయని కూడా అది పేర్కొంది. రతీష్‌పై ఆరోపణలు తీవ్రమైనవని గమనించిన కేరళ హైకోర్టు, క్రిమినల్ విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ అటువంటి నియామకాలను ఎలా సమర్థించుకున్నారో వివరణ కోరింది.

## వాస్తవికంగా ఆలోచించండి

### ఎఫ్‌డిఎకు బాంబే హైకోర్టు సూచన

### హోటల్ లైసెన్స్ సస్పెన్షన్ కొట్టివేత

ముంబై, జూలై 30: 'మనం భారతదేశంలో ఉన్నాం' అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, వాస్తవిక దృక్పథాన్ని అవలంబించాలని మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ)కు బాంబే హైకోర్టు సూచించింది. పరిశుభ్రత విషయంలో నవీ ముంబైలోని ఒక ఫోర్‌స్టార్ హోటల్ లైసెన్సును సస్పెండ్ చేస్తూ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) జారీ చేసిన ఉత్తర్వును కూడా కోర్టు కొట్టివేసింది. హోటల్‌కు ఊరటనిస్తూ, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఎసిజె) రవీంద్రఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. 'పరిశుభ్రత, నిర్వహణ, కార్యకలాపాలపై ఉన్న మొత్తం 'సంతృప్తికరమైన' సమ్మతి నివేదికతో పోల్చి చూసినప్పుడు, 'రెండు కీటకాలు ఉన్నట్లు తేలిన ఏకైక అంశం' లైసెన్సును నిలిపివేయడాన్ని సమర్థించదని కోర్టు పేర్కొంది. ఆహార భద్రతా చట్టం ప్రకారం, ఆహార భద్రతా కమిషనర్ ముందు అప్పీల్ చేసుకునేందుకు చట్టబద్ధమైన మార్గం ఉందని ఆమె తెలిపారు.అయితే, ఆ సంస్థ నిర్దేశించిన నిబంధనలను గణనీయంగా పాటించినప్పుడు, కేవలం అటువంటి లోపం కారణంగానే సస్పెన్షన్ వంటి తీవ్రమైన చర్య తీసుకోవడం సమర్థనీయమా అని ధర్మాసనం ప్రశ్నించింది. సస్పెన్షన్ ఉత్తర్వును రద్దు చేస్తూ, హోటల్ ఎఫ్ఎస్ఎస్ఎ లైసె న్సును తక్షణమే పునరుద్ధరించి, దాని ఆహార వ్యాపార కార్యకలా పాలను తిరిగి ప్రారంభించడానికి అనుమతించాలని అధికారులను ధర్మాసనం ఆదేశించింది. మంత్రాలయం, హైకోర్టులోని క్యాంటీన్లతో సహా అన్ని ప్రభుత్వ భోజనశాలలను తనిఖీ చేసి, వీడియో రికార్డింగ్‌తో పాటు తనిఖీల స్థితిని సమర్పించాలని ఎఫ్‌డిఎ ఆదేశించింది.

## నన్ను యంగ్ హృతిక్‌రోషన్ అంటారు తెలుసా..

### కంగనా రనౌత్ వ్యాఖ్యలపై సిజెపి సౌరవ్‌దాస్ కౌంటర్



న్యూఢిల్లీ,జూలై 30: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మధ్య మాటల యుద్ధం కొన సాగుతోంది. జెన్‌జీ విద్యార్థుల నిరసనలతో మొదలైన ఈ వివాదం వ్యక్తిగత విమర్శల వరకు వెళ్లింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కంగనాకు సౌరవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గతంలో హృతిక్ రోషన్, కంగనా మధ్య జరిగిన వివాదాన్ని గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కంగనా తనను లక్ష్యంగా చేసుకోవడంపై స్పందించిన సౌరవ్ తన స్నేహితులు కూడా అదే విషయాన్ని ప్రశ్నించారని చెప్పారు. వారిలో ఒకరు తను యంగ్ హృతిక్ రోషన్‌లా కనిపిస్తానని చెప్పారని, అందుకే కంగనా తన్నపై ఎక్కువగా స్పందిస్తోందేమోనని సరదాగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా కంగనా మాట్లాడే తీరు నిరాశతో నిండినట్లుగా ఉందని, ఆమె మాటలు మానసికంగా స్థిరంగా ఉన్న వ్యక్తి మాట్లాడినట్లుగా లేవని పేర్కొన్నారు. దేశ యువతను అవమానించేలా మాట్లాడ కూడదని, ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కంగనాపై తనకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని తెలిపిన సౌరవ్ ఆమె మాత్రం వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నా రని ఆరోపించారు.కంగనాతో కాఫీకి వెళ్లేందుకు కూడా తనకు ఎలా టి అభ్యంతరం లేదని, ఎవరి పట్ల వ్యక్తిగత వైరం లేదని చెప్పారు. ఈవివాదం జెన్‌జీ నిరసనలపై కంగనాచేసిన వ్యాఖ్యలతో ప్రారంభమైంది.

## జెర్సీ రంగు మారిస్తే సరిపోతుందా?

### దేశ ఆత్మను ఎవ్వరూ మార్చలేరు: ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ,జూలై 30: భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రయోగాత్మకంగా కొత్త కాషాయం రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ వీరేన్ రస్క్వినా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, పరిశీలిస్తే మార్పే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో పరిశీలన తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. దేశం రెడ్డొగ్గినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రచారం కోసం ప్రకటించిన కొత్త జెర్సీపై భారత హాకీమాజీకెప్టెన్ వీరేన్ రస్క్వినా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత హాకీ అంటే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది నీలం జెర్సీయేనని చెప్పారు. తాను ఎన్నో ఏళ్ల దాన్నే ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించానని గుర్తుచేశారు. అభిమానుల మనసుల్లో ఆ రంగుకే ప్రత్యేక స్థానం ఉందని, అలాంటప్పుడు కాషాయ రంగును ఎందుకు ఎంచుకున్నారో అర్థం కావడంలేదని ప్రశ్నించారు. రస్క్వినా వ్యాఖ్యల తర్వాత హాకీ ఇండియా కొత్త జెర్సీ రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా ఎంచుకున్నట్లు తెలిపింది. భారత జాతీయ పతాకం, ఉదయించే సూర్యుడి స్ఫూర్తితో ఈ రంగును తీసుకున్నామని పేర్కొంది. ఆశోక చక్రాన్ని గుర్తు చేసే నేవీ బ్లూ అంచులు, మండల కళారూపాలు,సుదర్శన చక్రం స్ఫూర్తితో రూపొందించిన డిజైన్ భారతసంస్కృతి, ఐక్యత, పురోగతిని ప్రతి బింబిస్తుందని వెల్లడించింది.ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌భావనకు అను గుణంగానే ఈ జెర్సీని రూపొందించినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

## 35 సంచుల్లో నోట్ల కట్టలు.. లెక్కగట్టలేక మొరాయించిన మెషీన్లు

కోల్‌కతా, జూలై 30: పశ్చిమ బెంగాల్‌లో ఓ మాజీ బస్సు డ్రైవర్ ఇంట్లో భారీగా నగదు, బంగారం బయటపడటం రాజకీయ, అధికారవర్గాల్లో కలకలం రేపింది. బీర్భూమ్ జిల్లాలని దేవ్‌చా గ్రామానికి చెందిన మినార్ మొండల్ ఇంటిపై రాష్ట్ర పోలీసులు బుధవారంరాత్రి ఆకస్మికంగా సోదాలు నిర్వహించగా, 35 సంచుల్లో దాచిపెట్టిన రూ. 28 కోట్లకుపైగా నగదు, సుమారు రూ. 21.5 కోట్ల విలువైన 15 కిలోల బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. నగదును లెక్కించేందుకు ఐదు కౌంటింగ్ మెషీన్లు వినియోగించినప్పటికీ అవి వరుసగా పనిచేయకపోవడంతో అధికారులు మరోసారి యంత్రాలను మార్చాల్సి వచ్చింది.

## ఆ రికార్డులను భద్రపర్చండి

### కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

### గాయపడిన వారికి వైద్యమందించండి: ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 30: నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్స్ వినియోగంపై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో నిరసన చేపట్టిన విద్యార్థులపైకి భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ వినియోగించిన ఘటనకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడకాన్ని పోలీసు నిబంధనలు అనుమతిస్తున్నాయని పేర్కొన్నది. పెల్లెట్ గన్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్‌ను వినియోగించే అధికారాలు పోలీసులకు ఉన్నాయని తెలిపింది.అయితే, ఈ కేసులో వాటి వినియోగం ఎలా జరిగిందనే అంశాన్ని పరిశీలన చేయడం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది.

గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందించాలి

ఆ నిరసనల్లో పెల్లెట్ గాయాలు పొందిన వారికి అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఢిల్లీప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించింది.

# సంక్షిప్త వార్తలు

## చల్లారుతున్న కార్చిచ్చు..ఇంటిబాట పట్టిన 84వేల మంది



మాడ్రిడ్, జూలై 30 : ఫ్రాన్స్,స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చు క్రమంగా అదుపులోకి వస్తోంది. వారం రోజులు ఐదుదేశాల ప్రభుత్వాలకు కంటిమీద కునుకులేకుండా చేసిన అగ్నికీలలు చల్లారుతున్నాయి.కార్చిచ్చు ముప్పుతో వారంరోజుల వ్యవధిలో 2 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఫ్రాన్స్ ఇప్పుడు 84వేలమంది తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు తాజాగా అనుమతిచ్చింది. గత శుక్రవారం ప్రారంభమైన ఈ కార్చిచ్చు కారణంగా దాదాపు 42 వేల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. అంటే ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగర విస్తీర్ణం కంటే నాలుగు రెట్లు ఎక్కువ.

## మెటాకు మరోసారి కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ,జూలై 30: ప్రధాని నరేంద్ర మోదీఫేస్‌బుక్ పోస్టుపై తాత్కాలికంగా ఆంక్షలు విధించిన ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ)ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇందుకోసం మెటా సీనియర్ అధికారులను రానున్న ఏడు నుంచి పది రోజుల్లో హాజరు కావాలని కోరింది. ఘటన ఎలా జరిగింది, భవిష్యత్తులో మళ్లీ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

## ఇండో పాక్ యుద్ధయోధుడు బసంత్‌కుమార్ పొన్వార్ కన్నుమూత




రాయ్‌పూర్, జూలై 30: భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన 1971 నాటి యుద్ధంలో విశేష సేవలు అందించిన అనుభవజ్ఞుడు, మావోయిస్టుల తిరుగుబాటుకు వ్యతిరేకంగా దేశంలో ఆధునిక అటవీ యుద్ధ తంత్రానికి రూపకర్త అయిన రిటైర్డ్ బ్రిగేడియర్ బసంత్‌కుమార్ పొన్వార్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయస్సు 77ఏళ్లు. బుధవారం కుటుంబసభ్యులు ఈ విషయాన్ని ప్రకటించారు. బసంత్ కుమార్ కుమారులు ఇద్దరూ సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తున్నారు.

## ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి నిరసన ప్రదర్శన




న్యూఢిల్లీ,జూలై 30: నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా సీజేపీ చేపట్టిన నిరసనలకు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పోరాటంలో మంత్రి ధర్మేంద్ర రాజీనామాతో ఆందోళనలు ఉన్నాయని సందిగ్ధం. ఇప్పుడు ఈ అంశం పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వానికి చుట్టుకుంది. అక్కడ ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన చేస్తోంది. ఎందుకంటే పంజాబ్‌లో కూడా ఇటీవల వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి. ఈ నేప థ్యంలో పేపర్ లీకేజీలను వ్యతిరేకిస్తూ ఇప్పుడు బిజెపి ఆందోళనకు దిగింది.

## పోలీస్‌స్టేషన్ వద్ద ప్రశాంత్‌కిశోర్ నిరసన



పాట్నా,జూలై 30: బీహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గం ఉపఎన్నిక కోసం గురువారం ఓటింగ్ ప్రారంభమైంది. అయితే తన మద్దతుదారులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినట్లు తెలిసిన ఎన్నికల్లో పోటీ చేస్తున్న జన్ సూరజ్ పార్టీ (జేఎస్‌పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. ఉపఎన్నికల్లో ఓటమి భయంతో అధికార బీజేపీ ఆదేశాల మేరకు పోలీసులు తన మద్దతు దారులలో చాలా మందిని అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. పాట్నాలోని జక్కన్‌పూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

## నిర్భయంగా పనిచేయండి: జవాన్లకు సిఆర్‌పిఎఫ్ చీఫ్ భరోసా



న్యూఢిల్లీ, జూలై 30: విధి నిర్వహణలో నిష్పక్షికంగా, నిజాయితీతో తీసుకునే ఏ నిర్ణయానికైనా, చర్య లకైనా తాను పూర్తి బాధ్యత వహిస్తానని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ (డైరెక్టర్ జనరల్) ప్రతాప్ సింగ్ తన సిబ్బందికి స్పష్టం చేశారు. ఎలాంటి భయం లేకుండా జవాన్లు, అధికారులు తమ విధులను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. జనరల్ ఆపరేషనల్ బెటాలియన్ అయినా లేదా శాంతిభద్రతల రక్షణ విభాగాలు (లా అండ్ ఆర్డర్ యూనిట్) అయినా దేశ ప్రయోజనాలు, ప్రజారక్షణలో విధి నిర్వహణలో భాగంగా మీరు తీసుకునే ప్రతి నిర్ణయానికి, చేసే ప్రతి చర్యకు డైరెక్టర్ జనరల్‌గా పూర్తి బాధ్యత, జవాబుదారీతనం నేనే వహిస్తానన్నారు.

# మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**• రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు**



మానవ అక్రమ రవాణాపై రూపొందించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ అక్రమ రవాణా అనేది ఇక సరిహద్దులు దాటి జరిగే నేరం మాత్రమే కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. మన ఇళ్లలోని మొబైల్ ఫోన్లలోకి, సోషల్ మీడియా ఖాతాల్లోకి, ఉద్యోగ ప్రకటనల రూపంలోకి చొరబడుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన సంఘటిత నేరం అన్నారు. మన పిల్లల కలలు, యువత భవిష్యత్తు, కుటుంబాల విశ్వాసాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఒక చిన్నారిని లేదా యువకుడిని అక్రమ రవాణా నుంచి రక్షిచడం అంటే ఒక జీవితాన్ని, ఒక కుటుంబాన్ని, ఒక భవిష్యత్తును కాపాడినట్టే అన్నారు. పపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణాపై రూపొందించిన వాల్ పోస్టర్స్‌ను కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యులతో పాటు హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎవిఎస్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ అక్రమ రవాణా పద్ధతులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఒకప్పుడు ప్రత్యక్షంగా జరిగే అక్రమ రవాణా ఇప్పుడు నకిలీ ఉద్యోగ ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సోషల్ మీడియా పరిచయాలు, ఆన్‌లైన్ ప్రేమ ఉచ్చులు, విదేశీ ఉద్యోగ అవకాశాల పేరుతో జరిగే సైబర్ ఆధారిత నేరంగా మారిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయుధంగా మార్చుకున్న అక్రమ రవాణా ముఠాలను ఎదుర్కోవాలంటే డిజిటల్ అవగాహన, సైబర్ భద్రతపై ప్రజల్లో చైతన్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, శ్రీవెంకట పద్మలత, చల్లా మధుసూదన రావు, హెల్ప్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి. భాస్కర రావు, కమ్యునికేషన్ ఆఫీసర్ అనురాధ, యువత, మహిళలు, విముక్తి సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూఫ్ టాప్ సోలార్ వినియోగదారుల బిల్లుల సెటిల్మెంట్ వేగవంతం

**• వినియోగదారులకు పారదర్శక, సత్వర సేవలే లక్ష్యం**

**• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి**



**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్‌లో గ్రిడ్‌కు అనుసంధానమైన రూఫ్ టాప్ సోలార్ వినియోగదారుల విద్యుత్ బిల్లుల సెటిల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సోలార్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యంగా ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. రూఫ్ టాప్ సోలార్ వినియోగదారులు ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్తును గ్రిడ్‌కు అందించడం ద్వారా రాష్ట్ర ఇంధనరంగ అభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందిస్తున్నారన్నారు. వినియోగదారులకు బిల్లుల సెటిల్మెంట్‌ను సకాలంలో, పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ఎస్‌పిడిసిఎల్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సోలార్ మిగులు యూనిట్లకు సెటిల్మెంట్ ప్రక్రియ జరిగేదని, ప్రస్తుతం ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ దిగుమతి, ఎగుమతి విద్యుత్తు యూనిట్ల ఆధారంగా ఖచ్చితమైన విధానంతో బిల్లులను రూపొందించి, నిబంధనల మేరకు సెటిల్మెంట్ చేస్తున్నామని వివరించారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అంనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 128 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో 36,963 మంది వినియోగదారులు స్వయంగా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. విద్యుత్ వినియోగం, విద్యుత్ ఉత్పత్తి మిగులు ఆధారంగా వారికి ఈ యేడాది జూన్‌లో రూ.83.88 లక్షలు, అలాగే జులైలో రూ.68.40 లక్షల మేరకు విద్యుత్తు మిగులు యూనిట్ల బిల్లులను నేరుగా వినియోగదారుల బ్యాంక్ అకౌంట్లకు జమ చేయడం జరిగిందని తెలియజేశారు. సోలార్ విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులకు మార్గదర్శకాలను జారీ చేశామని తెలిపారు. బిల్లింగ్‌కు సంబంధించిన అంశాల్లో సందేహాలు ఉత్పన్నమైతే తమకు సమీపంలోని అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయాన్ని గానీ లేదా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని గానీ సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవడం లేదా సమస్యకు పరిష్కారం పొందవచ్చని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ 1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు : 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

**సోలార్ వ్యవస్థకు పెరుగుతున్న ఆదరణ:** సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు వినియోగదారుల నుండి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో బిల్లింగ్, నెట్ మీటరింగ్, నెలవారీ సెటిల్మెంట్ ప్రక్రియలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలియజేశారు. సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలనుకుంటున్న అర్హులైన గృహ వినియోగదారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత వివరాలకు సమీప విద్యుత్ కార్యాలయంగానీ ఎస్‌పిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా సిఎండి లోతేటి సూచించారు.

# కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**• లోక్‌సభలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్**



**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఇంద్రకీలాద్రి దేవస్థాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో బలంగా కోరారు. తిరుపతి తరువాత అత్యంత ప్రాధాన్యత, భక్తుల తాకిడి కలిగిన విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంపై లోక్‌సభ సమావేశంలో నియమం 377 కింద ప్రత్యేక అంశాన్ని ఎంపి చిన్ని ప్రతిపాదించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాలు, యాత్రికుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది తీరాన ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగిన పవిత్ర శక్తి పీఠమని ఎంపి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కోట్లాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్న ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీదేవి అలంకారాలు, తెప్పోత్సవం, భవానీ దీక్షల సందర్భంగా దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 50వేల మంది, పండుగల సమయంలో రెండు లక్షలకు పైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో శాశ్వత మౌలిక వసతులు కూడా కల్పించాలి అని కేంద్రానికి సూచన చేసారు. ప్రసాద్ పథకం కింద భారీ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలన్నారు. ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పర్వతమాల పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కేశినేని శివనాథ్ డిమాండ్ చేశారు.

**పర్వతమాల పథకం కింద రోప్‌వే - భక్తులకు వరం:** వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు కొండపై ఉన్న ఆలయానికి సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఆధునిక రోప్‌వే వ్యవస్థను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపి కోరారు. రోప్‌వే ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు భక్తుల ప్రయాణం వేగవంతం, సురక్షితంగా మారుతుందని తెలిపారు. కనకదుర్గ అమ్మవారి ఆలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రసాద్ పథకం కింద ప్రత్యేక నిధులు, పర్వతమాల పథకం కింద రోప్‌వేకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా తక్షణమే నిర్ణయం తీసుకున్నారని ఎంపి చిన్ని తెలిపారు.

# వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తు విజయానికి బలమైన పునాది



**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'వ్యక్తిత్వ వికాసం' అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు, మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ ఇ.కోనప్రభ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలంటే ముందస్తు ప్రణాళిక, క్రమశిక్షణ, నిరంతర కృషి అత్యంత అవసరమని పేర్కొన్నారు. జీవితంలో విజయాన్ని సాధించాలంటే స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి దిశగా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ బండి రుక్మిణి 'భవిష్యత్తు విజయానికి బ్లూ ప్రింట్ నిర్మించుకోవడం' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తు ప్రణాళిక ప్రాధాన్యతను వివరిస్తూ స్పష్టమైన లక్ష్యం, సమయపాలన, నైపుణ్యాల అభివృద్ధి, సానుకూల దృక్పథం, క్రమశిక్షణ విజయానికి బలమైన పునాదులని తెలిపారు. విద్యార్థులు తమ బలాలు, బలహీనతలను గుర్తించి వాటిని మెరుగుపరుచుకోవడంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలు, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి జీవన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలని సూచించారు. అపజయాలను విజయానికి మెట్టుగా భావించి నిరంతర ప్రయత్నముతో ముందుకు సాగాలని సైకాలజిస్ట్ బండి రుక్మిణి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.భద్రమణి, డాక్టర్ జి.నిర్మల, డాక్టర్ వాణి ప్రశాంతి, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్స్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, వి.ప్రీతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో తగ్గని భక్తజనసందోహం

**• సర్వదర్శనానికి 18గంటలు**

**తిరుమల, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సాధారణ రోజుల్లోనూ భక్తజనసందోహం తగ్గలేదు. గురువారం కూడా తిరుమలలో భక్తులు భారీగా వున్నారు. ఉదయానికి తిరుమలలో చాంతాండంత క్యూలు బారులు తీరాయి. పెరిగిన భక్తుల రద్దీతో తిరుమలేశుని సర్వదర్శనానికి 18గంటలు సమయం పడుతోంది. సర్వదర్శనానికి సామాన్యభక్తులు మాత్రం కొండపై తగ్గలేదు. మూడుకిలోమీటర్ల దూరం క్యూలైన్లలోనే వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించినా భక్తుల రద్దీని నియంత్రించలేని దమనీయస్థితి. ఎప్పటికప్పుడు టిటిడి ప్రసారసాధనాల ద్వారా దర్శనసమయం తెలియజేస్తున్నా భక్తులు మాత్రం వెనుకడుగు వేయలేదు. స్వామి వారిని దర్శించుకుని ముక్తిని పొందాలని పట్టుదటలతో వున్నారు. క్యూలైన్లలో అవస్థలన్నీ ఆలయంలోనికి చేరుకుని ఆ వెంకన్నను దర్శించుకుంటే తమ కష్టాలు తీరుతాయనే విశ్వాసం భక్తులు వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రానికి సర్వదర్శనం కోసం భక్తులు బారులుతీరారు. వైకుంఠం-2లో 32 కంపార్టుమెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. సాయంత్రం వరకు 47వేల మంది భక్తులు మహా లఘులో దర్శనం చేసుకున్నారు. ఈ రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశముందని టిటిడి అంచనావేస్తోంది. అందుకు తగ్గట్లు ఏరా ్పట్లు చేపట్టింది.



## 7 నుండి కోదండరామస్వామి పవిత్రోత్సవాలు

**తిరుమల, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఆగస్టు 7 నుండి 10వ తేదీ వరకు వైభవంగా పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల గోడ పత్రికలు, బుక్‌లెట్లను గురువారం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పద్మావతి అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఆగస్టు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. మేదినీ పూజ, మృత్సంగ్రహాణం, అంకురార్పణ వంటి వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) రూ.500లు చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికెతో పాటు చివరి రోజు ఒక పవిత్రం ప్రసాదంగా అందజేస్తారు. పవిత్రోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్, డిప్యూటీ ఇఒ బి.నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎ.ఎం. సురేశ్ బాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఎఇఇ పోస్టులకు లక్షకు పైగా దరఖాస్తులు

**• పూర్తిగా మెరిట్ ఆధారంగానే నియామకాలు • అభ్యర్థులు అపోహలు, దళారుల మాయమాటలు నమ్మొద్దు • ఎపి ట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడి**

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో ఎపి ట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం 639 పోస్టుల కోసం లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయని ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్ హెచ్‌ఆర్‌డి) సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఇఇ పోస్టుల భర్తీకి సంబంధించి జూన్ 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, మెరిట్ ఆధారంగానే నిర్వహించబడుతుందని జెఎండి మరోసారి స్పష్టం చేశారు. ఎఇఇ నియామకాలకు సంబంధించి సోషల్ మీడియా, ఇతర వేదికల్లో కొందరు వ్యక్తులు రాత పరీక్షలు వాయిదా పడతాయని, సిలబస్‌లో మార్పులు చేశారని, డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఇలాంటి వదంతులను, అసత్య ప్రచారాలను అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూర్యసాయి ప్రవీణ్ చంద్ హెచ్చరించారు.

ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని, 2026 ఆగస్టు 22 నుంచి 29 వరకు నిర్ణయించిన తేదీల్లోనే కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలు నిర్వహించబడతాయని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా పడతాయనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల, మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల సందేహాలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ఎపి విద్యుత్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌లో 24 గంటల ఆన్‌లైన్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. అభ్యర్థులు అధికారికంగా విడుదలయ్యే సమాచారాన్ని మాత్రమే విశ్వసిస్తూ, ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ సూచించారు.

# అప్పలరాజు కుటుంబీకులకు జగన్ పరామర్శ

**• సమయం దాటిపోవడంతో ములాఖత్ రద్దు • మీడియాతో మాట్లాడి వెనుతిరిగిన జగన్మోహన్ రెడ్డి**



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 30 ప్రభాతవార్త:** మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం అంపోలు జైలు వద్ద పరామర్శించారు. అప్పలరాజు సతీమణి శ్రీదేవి తనయులు ఆరవ్ వర్మలతో ఆయన మాట్లాడారు. జైలు నుంచి ఇటీవల విడుదలైన అప్పలరాజు తనయుడు ఆరవ్ వర్మతో మాట్లాడి ప్రమాద వివరాలు తదనంతరం చోటు చేసుకున్న పరిణామాల కోసం అడిగి తెలుసుకున్నారు. సీదిరి సతీమణి శ్రీదేవి, తనయులకు ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంపోలు జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ములాఖత్ ద్వారా జగన్మోహన్ రెడ్డి కలుసుకోవాల్సి ఉండగా సమయం మించిపోవడంతో అవకాశం లేకుండా పోయింది. ములాఖత్ రద్దయిపోయింది. అంపోలు జైలుకి జగన్మోహన్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 2గంటలకి చేరుకోవాల్సి ఉండగా ఆయన రాక మూడు గంటలు ఆలస్యమైంది. విశాఖపట్నం ఎయిర్ పోర్టు నుంచి జైలు వరకూ దారిపొడవునా జనం ఆతడికి జేజేలు పలుకుతూ కాన్వాయ్‌ను ముందుకు సాగనివ్వకపోవడంతో నిర్ణీత సమయానికి ఆయన అంపోలు జిల్లా జైలుకి చేరుకోలేకపోయారు. అంపోలు జైలు వద్దకు ఆయన చేరుకున్నప్పటికీ జైలు నిబంధనల మేరకు సమయం దాటిన తర్వాత ములాఖత్‌కి అనుమతించే అవకాశం లేదని జైలు అధికారులు చెప్పారు. దీంతో ఆయన అంపోలు జైలు బయట సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడి తిరిగి విశాఖపట్నం ప్రయాణమయ్యారు. జగన్ వెంట వైకాపా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ ఉత్తరాంధ్రకి చెందిన ముఖ్యనేతలు అంతా ఉన్నారు.

**అడుగడుగునా జన నీరాజనాలు:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించడంతో ఆయనకు జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు. పైడిభీమవరం వద్ద వైకాపా నాయకులు, కార్యకర్తలు జగన్‌కి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి అంపోలు వరకూ జగన్ కాన్వాయ్ కొనసాగింది. ప్రజలకి అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగగా ఆయనకి ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు గజమాలలు, పూలమాలలతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పైడిభీమవరం, రణస్థలం, బుడమూరు, ఎచ్చెర్ల, నవభారత్ జంక్షన్, కొత్త రోడ్డు జంక్షన్, పెద్దపాడు జంక్షన్, అంపోలు జంక్షన్ ఇలా అన్ని చోట్ల కూడా వైసీపీ శ్రేణులు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు గొర్లె కిరణ్ కుమార్, చింతాడ రవికుమార్‌లతో పాటు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు. డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఇతర ముఖ్యనాయకులు అంతా కూడా స్వాగతం పలికారు. కాన్వాయ్ వెంట యువకులు జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పైడి భీమవరం నుంచి అంపోలు వరకూ జగన్ పర్యటన విజయవంతంగా సాగింది.

# 'మచిలీపట్నం' నౌకపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం పేరుతో జలాంతర్గామి విధ్వంసక నౌక నిర్మాణంపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేసారు. బందరు ప్రజల ఆత్మగౌరవాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చినందుకు ప్రధాని నరేంద్రమోడీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గేట్ వే ఆఫ్ అమరావతిగా నిర్మితమవుతున్న మచిలీపట్నం పోర్టు పేరుతో కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సంస్థ ఓ భారీ జలాంతర్గామి విధ్వంసక నౌకను నిర్మించడం హర్షణీయం అన్నారు. భారత నౌకాదళం కోసం కేంద్రం నిర్మిస్తున్న ఎనిమిది జలాంతర్గామి విధ్వంసక నౌకలలో ఒకటి మచిలీపట్నం పేరుతో నిర్మించడం ఎంతో సంతోషకరం అన్నారు. ఈ నౌకను తూర్పు తీరంలో సముద్ర అంతర్భాగంలో నిఘా ఉంచేందుకు, జలాంతర్గాముల విధ్వంసానికి, తక్కువ శ్రేణి సముద్ర కార్యకలాపాలకు వినియోగించనున్నారు. మచిలీపట్నం పేరును జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే విధంగా భారీ యుద్ధ నౌకను నిర్మించడం బందరు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# వ్యాసాశ్రమం ఏ ఒక్కరి సొంత ఆస్తి కాదు

**• బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్**



**శ్రీకాళహస్తి, జులై 30 ప్రభతవార్త:** ఏర్పేడు మండల కేంద్రంలో సుమారు వందేళ్ళ క్రితం మలయాళ యతీంద్రులచే ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఆశ్రమం నేడు ఒక కుటుంబానికి చెందిన సొంత ఆస్తిగా మారిందని, ఆశ్రమం భక్తుల భాగస్వామ్యంతో ఎంతో అభివృద్ధి చెందిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం పార్టీ కార్యలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాసాశ్రమం నిర్వహణకు ప్రభుత్వం తరఫున కమిటీ నియామకం చేయాలని కోరారు. దీనిపై పీఠాధిపతులతో సిఎం చంద్రబాబును కలుస్తామని కోలా ఆనంద్ వెల్లడించారు. ఏర్పేడులో ఈ నెల 25న మఠాధిపతులు పీఠాధిపతులతో పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపమన్నారు. ఆశ్రమం ఏ ఒక్కరి సొత్తు కాదని మలయాళ స్వామి స్థాపించిన ఆశ్రమం పై దాతలకు భక్తులకు సన్యాసులకు హక్కు ఉంటుందన్నారు. దీనిపై దేవాదాయ శాఖ అజమాయిషి ఉంటుందనేది ప్రస్తుత ఆశ్రమ నిర్వాహకులు మర్చిపోతున్నారన్నారు. ఆశ్రమాన్ని ప్రస్తుత పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి, ఆయన తమ్ముడు శివరామిరెడ్డి, బంధువు అమర్నాథ్‌రెడ్డి ఇష్టానుసారంగా నిర్వహిస్తూ ఆశ్రమ కీర్తి ప్రతిష్టలు పాతాళానికి తొక్కారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు

**• ఉత్తరాంధ్రలో పంపిణీ: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు విడుదల చేయగా 62 లక్షల మందికి లబ్ది చేకూరనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో మీడియాతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టుకు సంబంధించి 62,07,573 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించనున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో 11,98,044 మంది లబ్ధిదారులకు గురువారమే రూ.514.42 కోట్ల పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న రూ.2,198.31 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విడతలో 50,09,529 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ పెన్షన్ల కోసం రూ.70,907.41 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

**తిరుపతి, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2017 కేసులో తమిళనాడు సేలం జిల్లా పట్టనాగి పాళయం తాలూకా పట్టి వెలవు గ్రామానికి చెందిన అన్నామలై మురుగేషన్ ముద్దాయి. భీమవరం ఫారెస్ట్ బీట్ పుల్లయ్య గారి గుట్ట ప్రాంతంలో ఎర్రచందనం దుంగలతో అరెస్టయ్యాడు. ఇతను కోర్టుకు హాజరుకాకపోవడంతో ఎన్‌బిబ్ల్యు జారీ చేసి పట్టుకొచ్చారు. ఇతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# నిందితులను కాపాడటమే జగన్ రాజకీయమా?

## • పరామర్శ పేరుతో బలప్రదర్శనలేంటి?: మంత్రి అచ్చెన్నాయుడు మండిపాటు



**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పరామర్శ పేరుతో రాజకీయ డ్రామాలు, బలప్రదర్శనలు చేయడం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నైజంగా మారిపోయిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. నేరస్తులను పరామర్శించేందుకు యాత్రలు చేస్తూ, అదే సమయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీలు నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమని అన్నారు. గొడ్డలి పార్టీ వ్యవహారం రోజురోజుకూ దిగజారుతోందని, వారి బరితెగింపు, డ్రామాలు, పోకడలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఈరోజు ఒక నేరస్తుడిని పరామర్శించేందుకు మరో నేరస్తుడు చేపట్టిన డ్రామా యాత్ర ప్రజల్లో వెగటు పుట్టించిందన్నారు. ఒక తప్పును సమర్థించేందుకు వెళ్లి, అదే దారిలో తన సైకో మూకతో మరిన్ని తప్పులు చేయించడం జగన్ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా పోలీసులపై వైసిపి నాయకులు ప్రవర్తించిన తీరు చూస్తే అది రాజకీయ పార్టీనా లేక రౌడీ మూకనా అనే సందేహం కలుగుతోందన్నారు. మహిళా పోలీసులను తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించడం, దూషించడం, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై రాళ్ల దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యలని ఖండించారు. జైలు నిబంధనల గురించి బాగా తెలిసి ఉండాల్సిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డేనని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. 18 నెలలు జైలులో ఉన్న వ్యక్తికి ములాఖత్‌కు నిర్ణీత సమయాలు ఉంటాయన్న కనీస అవగాహన కూడా లేదా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. నిజంగా పరామర్శించాలనే చిత్తశుద్ధి ఉంటే సరైన సమయంలో వెళ్లి ములాఖత్ చేసి మాజీ మంత్రిని కలిసేవారని అన్నారు. కావాలనే ఆలస్యంగా వెళ్లి ములాఖత్ జరగకుండా చేసి, దాన్నే రాజకీయంగా మలచుకోవడానికి ప్రయత్నించడం జగన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి తప్పు చేసి జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించేందుకు వెళ్లడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. నిజంగా పరామర్శించాలనే మనసుంటే మాజీ మంత్రి కుమారుడి వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయిన బిసి వర్గానికి చెందిన నిరుపేద దానయ్య కుటుంబాన్ని పరామర్శించి ఉండాల్సిందని అన్నారు. జగన్‌కు అసలు బిసిల గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో తోట చంద్రయ్య యాదవ్, రామయ్యపాలెం గొర్ల గోపాల్ యాదవ్, నెల్లూరులో వెంగయ్య యాదవ్ వంటి అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు జగన్ ఒక్కసారైనా వారి కుటుంబాలను పరామర్శించారా, వారి పక్షాన మాట్లాడారా అని మంత్రి అచ్చెన్నాయుడు నిలదీశారు.

పోలీసు దర్యాప్తు పూర్తికాకముందే 'కుట్ర కాదు, 'అమాయకుడు' అంటూ నిందితులకు క్లీన్ చిట్ ఇవ్వడం ఎందుకని ప్రశ్నించిన మంత్రి, కోర్టులు, దర్యాప్తు సంస్థల కంటే జగన్ పెద్ద న్యాయమూర్తా అని నిలదీశారు. దేశంలో బాధితుడిని వదిలేసి నిందితుడిని పరామర్శించే ఏకైక నేతగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోతారు. బాధితుల కన్నీళ్ల కంటే నిందితుల రాజకీయాలకే విలువ ఇచ్చే పార్టీగా గొడ్డలి పార్టీ చరిత్రలో మిగిలిపోతుంది అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు.





భక్తులు తెచ్చిన ఆషాఢం సారెకు పూజాదికాలు, అనుగ్రహిస్తున్న దుర్గమ్మ

# దుర్గమ్మ ఆలయంలో భక్తులకు ప్రత్యేక క్యూలైన్... కొత్త ర్యాంప్ ఏర్పాటు

**ఇంద్రకీలాద్రి, జులై 30 ప్రభాతవార్త:** దుర్గమ్మ భక్తులకు పూజా కార్యక్రమాలలో సౌకర్యం పెంచడానికి లక్ష్మీగణపతి ఆలయం నుండి సుబ్రమ్మణ్య స్వామి ఆలయం మీదుగా నేరుగా పూజా కార్యక్రమాలకు వెళ్లేలా ప్రత్యేక మార్గాన్ని కేటాయించామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. కొత్త ర్యాంప్ నిర్మాణం చేయాలని, ఎగ్జిట్ లైన్ విస్తరణ చేయాలని ఆదేశాలిచ్చారు. గురువారం ఆయన భక్తులందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఆలయంలో భద్రత, మర్యాద వందశాతం అమలు:** దుర్గమ్మని దర్శించుకోడానికి వచ్చే భక్తుల భద్రత, వారిపట్ల 100శాతం మర్యాదతో మెలగాలని ఇఒ వికె శీనా నాయక్ ఆదేశాలిచ్చారు. గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సెల్‌ఫోన్ల నిషేధాన్ని సిబ్బంది వంద శాతం అమలు చేయడం లేదని ఆయన గమనించి, ఆలయ నిబంధనల ప్రకారం లోపలికి ఎలాంటి సెల్ ఫోన్లను అనుమతించకూడదని, ఈ విషయంలో భద్రతా సిబ్బంది అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. లయానికి వచ్చే భక్తుల పట్ల సిబ్బంది ఎంతో మర్యాదగా, వినయంగా నడుచుకోవాలనిచ 'జై భవాని' సంబోధనతో భక్తులను పలకరించాలన్నారు.

**ఆషాఢం సారె భక్తులతో రద్దీ:** దుర్గమ్మవారికి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో గురువారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 17వ రోజు సాయంత్రం 5గంటల వరకు 39 సారె బృందాలకు చెందిన 16976 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. వారు దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**భక్తుల విరాళం :** దుర్గమ్మవారి ఆలయం అభివృద్ధి విభాగమునకు, ఉచిత ప్రసాదం నిమిత్తము భీమవరంకు చెందిన వెంకటదుర్గాశిరీష రూ.2,25,000/ విరాళము గురువారం సమర్పించారు. వారికి వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

**ఆగస్టు 13నుండి శ్రావణమాసం ఉత్సవాలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 13 నుండి శ్రావణమాసం ఉత్సవాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఆగస్టు 27 నుండి 29వరకు పవిత్రోత్సవాలు, ఆగస్టు 21న శ్రీవరలక్ష్మి వ్రతం, ఆగస్టు 9న శ్రీకృష్ణ జన్మాష్టమి, 4వ శుక్రవారం సామూహిక శ్రీవరలక్ష్మి వ్రతాలు (ఉచితం, ఆర్జితం సేవలుగా) నిర్వహిస్తామన్నారు.



దుర్గమ్మకు ఆషాఢం సారెను తీసుకొచ్చిన భక్తులు



# మండలి వెంకటకృష్ణారావు జయంతికి రాష్ట్ర ఉత్సవ హోదా

## సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన జాస్తి

**విజయవాడ, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మండలి వెంకటకృష్ణారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా ప్రకటిస్తూ జిఒ ఎంఎస్ నెం.131 ఇటీవల జారీ చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపినట్లు అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, దివిసీమ అభ్యుదయానికి మార్గదర్శి, ప్రపంచ తెలుగు మహాసభల రూపశిల్పి మండలి వెంకటకృష్ణారావు సేవలను గుర్తించి ఆయన జయంతికి రాష్ట్ర ఉత్సవ హోదా కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు. ఈ మహోన్నత నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సహకరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు సేవలను భావితరాలకు పరిచయం చేయడంలో ఈ నిర్ణయం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు.

# భారత్‌లో ఆరు శాతం తగ్గిన పసిడి డిమాండ్




**ముంబయి, జులై 30:** భారత్‌లో పెరిగిన ధరలు, దిగుమతి సుంకం పెంపు వంటి కారణాలతో పసిడి డిమాండ్ గణనీయంగా తగ్గింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికం లో బంగారం గిరాకీ గత ఏడాదితో పోలిస్తే 6 శాతం క్షీణించి 131.4 టన్నులకు పరిమితమైంది. అనవసర కొనుగోళ్లకు స్వస్తి పలకాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో పాటు, సీజనల్‌గా అమ్మకాలు మందగించడం కూడా ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2025 ఇదే కాలంలో ఈ డిమాండ్ 139.7 టన్నులుగా నమోదైంది. కొనుగోళ్ల పరిమాణం తగ్గినప్పటికీ, విలువపరంగా మాత్రం డిమాండ్ సరికొత్త రికార్డును సృష్టించింది. గతేడాది రూ.1,32,500 కోట్లుగా ఉన్న డిమాండ్ విలువ, ఈసారి 50శాతం వృద్ధి చెంది రూ.1,98,100 కోట్లకు చేరుకుంది. పసిడి ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా సీఈవో సచిన్ జైన్ తెలిపారు. అధిక ధరలు కొనసాగుతున్నప్పటికీ, వినియోగదారులు ఇప్పటికీ స్వర్ణానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. మొత్తం డిమాండ్‌లో కీలకమైన ఆభరణాల విక్రయాలు 15 శాతం తగ్గి 75.1 టన్నులకు పడిపోయాయి. కాగా, సురక్షిత పెట్టుబడిగా భావించే గోల్డ్ బిస్కెట్లు, నాణేల డిమాండ్ మాత్రం 9శాతం పెరిగి 50.3 టన్నులకు చేరడం విశేషం. మరోవైపు, బంగారం దిగుమతులు 23శాతం తగ్గి 98.1 టన్నులకు, రీసైక్లింగ్ ప్రక్రియ 17శాతం క్షీణించి 19.2 టన్నులకు పరిమితమైంది. మే 2026లో కేంద్రం బంగారంపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచిన విషయం విదితమే.

# జీవ సాంకేతిక ఆవిష్కరణలకు ఎస్వియు వేదిక

## • స్టార్టప్‌లు, వ్యవస్థాపకతపై జాతీయ సదస్సు ప్రారంభం



**తిరుపతి(విద్య), జులై 30 ప్రభాతవార్త:** జీవ సాంకేతిక ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రోత్సహించడంతో పాటు విశ్వవిద్యాలయ పరిశోధనలను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేసే లక్ష్యంతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గురువారం ద్విదిన జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఎస్వీయూ జీవరసాయన శాస్త్ర విభాగం, రూసా-2 ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెర్బల్ అండ్ సింథటిక్ డ్రగ్ డెవలప్‌మెంట్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ఏఎస్‌పైర్-బయోనెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ఎస్వీయూ రెక్టర్ ఆచార్య సీహెచ్. అప్పారావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ఆచార్య యోగేశ్వరరావు, జీవరసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఓ.వి.ఎస్. రెడ్డి, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం. బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య యోగేశ్వరరావు మాట్లాడుతూ జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పరిశోధనలను ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులుగా మలచాలని సూచించారు. స్టార్టప్‌లకు అందుబాటులో ఉన్న నిధులు, అవకాశాలు, ప్రపంచవ్యాప్తంగా వాటి ప్రభావంపై వివరించారు. బెంగళూరుకు చెందిన డా.చంద్రశేఖర్ నాయర్ ఆవిష్కరణలను ప్రపంచ స్థాయి సంస్థలుగా తీర్చిదిద్దే అవకాశాలను వివరించగా, ఎక్సైటాన్ డయాగ్నస్టిక్స్‌కు చెందిన డా. బి.వి. రవికుమార్ పరిశోధనలను వినియోగదారులకు చేరే ఉత్పత్తులుగా మార్చే విధానాన్ని వివరించారు. ఏఎస్‌పైర్- బయోనెస్ట్‌కు చెందిన ఆచార్య రాజగోపాల్ విద్యా రంగంలో ఆవిష్కరణల సంస్కృతి, స్టార్టప్‌ల ద్వారా ఉపాధి అవకాశాల విస్తరణపై ప్రసంగించారు. జాతీయ సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.బాలాజీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని పరిశోధక విద్యార్థులకు ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, పరిశ్రమ- విశ్వవిద్యాలయ భాగస్వామ్యంపై నిపుణుల సూచనలు పరిశోధకులకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూసా-2.0 కోఆర్డినేటర్ డా. కె.వి. సుచరిత, వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టిటిడి కేటరింగ్ అధికారిగా విజయభాస్కర్



**తిరుమల, జులై 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో భక్తులకు నిత్యం రుచిగా శుచిగా అన్నప్రసాదాలు తయారుచేసి అందించడానికి అవసరమైన కేటరింగ్ అధికారిని టిటిడి నియమించింది. ఇదివరకు తిరుమల అన్నదానంలో కేటరింగ్ ప్రత్యేక అధికారిగా జిఎల్ఎన్ శాస్త్రి బాధ్యతలు నిర్వహించాడు. ఆయన స్థానంలో అనుభవజ్ఞులైన, నిపుణుడు విజయభాస్కర్‌ను గురువారం నియమిస్తూ టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు జారీచేశారు. ఎంతో అనుభవం ఉన్న ఈయన నిమాకం పట్ల పలువురు టిటిడి ఉద్యోగులు అభినందనలు తెలిపారు. నిత్యం లక్షలామంది భక్తులకు రుచిగా శుచిగా అన్నప్రసాదాలు తయారుచేయించడమేగాక విఐపిలకు ప్రముఖులకు కూడా అవసరమైన రీతిలో భోజనం ఫలాహారాలు తయారీలో కేటరింగ్ అధికారిదే కీలక పాత్ర.

# ఎపి సిఎం కాన్వాయ్‌లోకి దూసుకెళ్లిన వాహనం

## దాడిలో విరిగిన కాన్వాయ్ డ్రైవర్ పళ్లు

## పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 30, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోకి ఓ కారు దూసుకురావడంతో చోటుచేసుకున్న ప్రమాదం అనంతరం జరిగిన ఘర్షణలో ప్రోటోకాల్ వాహనం డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 25న పంజాగుట్ట పరిధిలోని గ్రీన్‌ల్యాండ్స్ వద్ద ఐటీసీ కాకతీయ హోటల్ సమీపంలో చోటుచేసుకున్న ఘటన వివరాల్లోకి వెళితే.. ఏపీ సీఎం చంద్రబాబు కాన్వాయ్ బేగంపేట విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తుండగా, మూడు వాహనాలు కాన్వాయ్‌లో ఉన్నాయి. మూడో ప్రోటోకాల్ వాహనాన్ని హెండరీ జోసెఫ్(64) నడుపుతున్నారు. కాన్వాయ్ ఐటీసీ కాకతీయ హోటల్ సమీపంలోకి రాగానే ఎంజీ విండ్సర్ ఈవీ కారు అకస్మాత్తుగా కాన్వాయ్ మధ్యలోకి రావడంతో స్వల్పంగా ఢీకొంది. దీంతో ఆ కారు డ్రైవర్, అతని తండ్రి వాహనం నుంచి దిగి జోసెఫ్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దాడిలో తన నాలుగు పళ్లు విరిగిపోగా, మరో పన్ను వదులై తీవ్ర నొప్పి, గాయాలయ్యాయని బాధితుడు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం డ్రైవర్ తండ్రి కాన్వాయ్ వాహనం తాళాలను బలవంతంగా తీసుకుని జోసెఫ్‌ను కారులో కూర్చోబెట్టి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఓ స్వీట్ షాప్ సమీపానికి తీసుకెళ్లాడు. అక్కడ కారు తాళాలను లోపల పడేసి వెళ్లిపోయినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై పంజాగుట్ట పోలీసులు బీఎన్ఎస్ 117(2), 126(2), 352 సెక్షన్లతో పాటు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అసోంలో వరద బీభత్సం.. 78 మంది మృతి

**గువాహతి, జులై 30:** అసోంలో భారీ వర్షాలతో వరదలు భీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలకు రాష్ట్రంలోని ఏడు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయి మూడు లక్షల మందికి పైగా ప్రజల జీవితం అస్తవ్యస్తమైంది. గడిచిన 24 గంటల వ్యవధిలో వరదలకు మరో ముగ్గురు మృతిచెందగా మొత్తం మరణాల సంఖ్య 78కి చేరింది. వేల సంఖ్యలో పశువులు గల్లంతయ్యాయి. లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ మేరకు భారీ వర్షాలు, వరదలపై అస్సాం ప్రభుత్వం బులెటిన్ విడుదల చేసింది. భారీ వర్షాలకు శివసాగర్, చరాయిదేవ్, గోలాఘాట్, జోర్హాట్, నాగావ్, విశ్వనాథ్, కామరూప్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ బులెటిన్ వెల్లడించింది. ఆయా జిల్లాల్లో 551 గ్రామాలు నీట మునిగాయని తెలిపింది. దీంతో మొత్తం 3,00,031 మంది ప్రజలు ప్రభావితమయ్యారని పేర్కొంది. గత 24 గంటల వ్యవధిలో ముగ్గురు మృతిచెందారని ఏఎస్డీఎమ్ఏ అధికారులు తెలిపారు.

# పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలి

## • అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి




**అనంతపురం, జులై 30 ప్రభాతవార్త బ్యూరో:** పంటల బీమా ప్రభుత్వమే చెల్లించి, రైతులపై భారం తగ్గించాలని అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతాంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని రైతులను ఆదుకునే దిశగా జిల్లాలోని మంత్రులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని వెంకటరామిరెడ్డి సూచించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంపైనే ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారని, కరువుకు నిలయమైనప్పటికీ ఎంత నష్టం వచ్చినా రైతులు వ్యవసాయాన్ని వదలడం లేదన్నారు. పది మందికి అన్నం పెట్టేందుకు రైతులు వ్యవసాయాన్ని చేస్తుంటే అలాంటి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం, పాలకులు ముందుకు రావాలని ఆయన సూచించారు. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకునే వారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెండేళ్లుగా అతి వృష్టి అనావృష్టితో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు ప్రీమియం చెల్లించినా గత ఖరీఫ్, రబిలో పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడి కూడా ప్రభుత్వం అందించ లేదని విమర్శించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 8.48లక్షల ఎకరాలు ఉంటే ఇప్పటి వరకు దాదాపు 2.59 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారని, అధికార యంత్రాంగం గణాంకాలు చెబుతున్నారన్నారు. ఇంకా ఆరు లక్షల ఎకరాల్లో పంటల సాగు చేయలేదని పేర్కొన్నారు. జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయితే పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి జులై 6న ప్రభుత్వం బీమా విడుదల చేసిందన్నారు. అయితే అప్పటికే రైతులు రెన్యూవల్‌తోపాటు కొత్త రుణాలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా జులై 31కే గడువు ముగుస్తున్నా ఇంకా 1.90 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించలేదని, సిఎం చంద్రబాబు మాత్రం ప్రతి పంటకు బీమా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారన్నారు. ప్రభుత్వమే రైతుల బీమా ప్రీమియం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉంటుందని ప్రభుత్వంతోపాటు అధికారులు కూడా చెబుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలతోపాటు పశుగ్రాసాన్ని రైతులకు అందుబాటులో ఉంచే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివారెడ్డి, నగర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైసిపి సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

# అనంత రైతులకు నీళ్లు ఇచ్చాకే కుప్పంకు నీళ్లు తీసుకెళ్లాలి

## • పాదయాత్రలో శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి నేతల ధ్వజం

**అనంతపురం, జులై 30 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా వివిధ నియోజక వర్గాల వైసిపి సమన్వయకర్తలు ఇతర నాయకులు, కార్యకర్తలు హంద్రీనీవా కాలువ గట్లపై గురువారం నిర్వహించిన పాదయాత్రకు మంచి స్పందన లభించింది. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల నుంచి హంద్రీనీవా కాలవ వరకు నిర్వహించిన పాదయాత్రలో జిల్లా నలుమూలల నుంచి రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టాలని, హంద్రీనీవా ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటర్లు, పిల్ల కాలువలు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని తదితర డిమాండ్లతో శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి నేతలు చేపట్టిన పాదయాత్రకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్, రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రి డా.శైలజానాథ్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక, కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త మక్బుల్, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో వైసిపి జిల్లా నేతలు మాట్లాడుతూ.. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 40 టిఎంసిల సామర్థ్యంతో చేపడితే వైసిపి ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ ప్రాజెక్టును 83 టిఎంసిలకు విస్తరించారన్నారు. అయితే 83టిఎంసిల ప్రాజెక్టును ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ 43 టిఎంసిలకే హంద్రీనీవా ప్రాజెక్టును కుదించారని ఆరోపించారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలవల లైనింగ్ పనుల వల్ల నిధులు పారుతున్నాయి కానీ నీరు పారడం లేదని, వైసిపి నేతలు విమర్శించారు. హంద్రీనీవా లైనింగ్ పనుల వల్ల టీడీపి ఎమ్మెల్యేలకు డబ్బులు వచ్చాయి కానీ రైతులకు మాత్రం ఎండిపోయిన పొర్లే మిగిలాయన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు నిర్మించే వరకు ఉద్యమం ఆగదని రాప్తాడు వైసిపి సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు.

# రామమందిరం విరాళాలపై పారదర్శకత, విద్యార్థులపై జవాబుదారీతనం ఉండాలి

## పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త:** రామమందిర విరాళాలపై పారదర్శ కత ఉండాలని విద్యార్థుల ఆందో ళన విషయంలో పోలీసులతో లాఠీచార్జ్ చేయించిన అంశాలో జవాబుదారీతనం ఉండాలని లోక సభ సభ్యులు మల్లు రవి అన్నా రు. గురువారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఆయన ఇండి గ్రూప్ ఎంపిలతో కలిసి నిరసన తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ అరుదైన రికార్డ్

**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్లు ముఖ్యంగా మహిళా బాక్సర్లు అదరగొడుతున్నారు. తమ పంచులతో భారత బాక్సర్లు ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ ఏకంగా 10 పతకాలను ఖాయం చేసుకుని చరిత్ర సృష్టించారు. 1934లో తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్నప్పటి నుంచి బాక్సింగ్‌లో భారత్ ఇన్ని పతకాలు నెగ్గడం ఇదే తొలిసారి. ఈ గేమ్స్‌లో ఇప్పటికే భారత్ 22 పతకాలను ఖాయం చేసుకోగా, అందులో 10 పతకాలు బాక్సింగ్ విభాగం నుంచే వచ్చాయి. ఏకంగా పది మంది బాక్సర్లు సెమీఫైనల్స్‌కు చేరుకోవడంతో ఒక్కొక్కరికి కనీసం కాంస్య పతకం వస్తుంది. ముందుగా లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీలు) బై ద్వారా నేరుగా సెమీస్‌కు అర్హత సాధించి భారత్‌కు తొలి పతకాన్ని ఖాయం చేసింది. ఆ తర్వాత 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన ప్రత్యర్థిని తన కళ్లు చెదిరే పంచులతో మట్టికరిపించి రెండో పతకం ఖాయం చేసింది. 60 కేజీల విభాగంలో ప్రియా ఘంఘాస్ కూడా అద్భుతంగా ఆడి సెమీస్‌కు చేరింది. ఈ నెల 29వ తేదీ ఒక్కరోజే ఆరుగురు భారత బాక్సర్లు సెమీస్ చేరి అదుర్స్ అనిపించారు. 51 కేజీల విభాగంలో బరిలోకి దిగిన సాక్షి




## బాక్సింగ్‌లో 10 పతకాలు ఖాయం

చౌదరి నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్స్‌పై 5-0 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి న్యూజిలాండ్‌కు చెందిన మోర్గాన్ హెండర్సన్‌పై 3-1తో నెగ్గి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. మరో సంచలనం జాస్మిన్ లాంబోరియా 57 కేజీల విభాగంలో ఇంగ్లాండ్ కి చెందిన ఎలీస్ గ్లిన్‌ను 4-1తో చిత్తు చేసి పతకాన్ని ఖాయం చేసుకుంది. పురుషుల 55 కేజీల విభాగంలో జాదుమణి సింగ్ నైపుణ్యంతో కూడిన ఆట ఆడి జాంబియా బాక్సర్‌ను ఓడించి ముందుగానే సెమీస్ చేరాడు. ఇక 60 కేజీల విభాగంలో సచిన్ సివాచ్ 5-0 తేడాతో బోట్స్వానా బాక్సర్‌ను చిత్తు చేశాడు. 80 కేజీల విభాగంలో అంకుష్ పంఘాల్ సెషెల్స్‌కు చెందిన జేడ్ మైకాక్‌ను 5-0 తో ఓడించాడు. చివరగా నరేందర్ బెర్వాల్ (+90 కేజీలు) చాలా నాటకీయంగా సాగిన పోరులో సమోవా బాక్సర్‌పై 3-2 తో ఉత్కంఠ విజయం సాధించి 10వ పతకాన్ని ఖాయం చేశాడు.





## కామన్వెల్త్ గేమ్స్.. దిలీప్‌కు స్వర్ణం
### బాసిల్, మురళికి రజతం

**న్యూఢిల్లీ:** 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ పతకాల వర్షం కురిపించడం కొనసాగించింది. గ్లాస్గోలో గురువారం జరిగిన పురుషుల 100 మీటర్ల టి47 విభాగంలో దిలీప్ గావిత్. మహమ్మద్ బాసిల్ కూడా నిలవడంతో, భారతదేశానికి డబుల్ పోడియం పూర్తయింది. గావిట్ 10.71 సెకన్లలో స్వర్ణ పతకం సాధించగా, బాసిల్ 10.83 సెకన్లలో రేసును పూర్తి చేసి దేశ చరిత్రలోనే తొలి రికార్డును నమోదు చేసి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 2022 ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల 400 మీటర్ల టి47 ఈవెంట్‌లో గావిత్ స్వర్ణం గెలుచుకొని, ఆ గేమ్స్‌లో భారతదేశానికి చారిత్రాత్మక 100వ పతకాన్ని అందించాడు. దిలీప్ పారిస్ 2024 పారాలింపిక్స్‌లో పురుషుల 400 మీటర్ల టి47 ఈవెంట్ ఫైనల్‌కు కూడా చేరుకున్నాడు. అంతకు ముందు మురళీ శ్రీశంకర్ పురుషుల లాంగ్ జంప్‌లో 8.09 మీటర్ల దూరం దూకి రజత పతకం గెలుచుకొని ఆ రోజు పట్టికను ప్రారంభించాడు. మరోవైపు, పరుల్ చౌదరి మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో 9:26.75 టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచింది. షాట్ పుట్ విభాగంలో మరోవైపు, 17.49 మీటర్ల త్రోతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న మన్‌ప్రీత్ కౌర్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. ఫైనల్ రౌండ్‌కు ముందు కాంస్య పతక స్థానంలో ఉన్న మన్‌ప్రీత్‌ను, జమైకాకు చెందిన లాయిడ్రిసియా కామెరాన్ అధిగమించింది. ఆమె చివరికి 17.89 మీటర్ల త్రోతో మూడవ స్థానంలో నిలిచింది.

## కామెన్వెల్త్ జావెలిన్ త్రో.. ఫైనల్స్ నీరజ్, రోహిత్, యశ్‌వీర్




**న్యూఢిల్లీ:** ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా, తోటి భారతీయులైన రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్‌లతో కలిసి గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో విజయవంతంగా గెలిచి 2026 కామన్వెల్త్ గేమ్స్ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు చేరుకున్నారు. ఇందులో పోటీపడిన అథ్లెట్లలో, ఎవరూ కూడా 84.00 మీటర్ల ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్కును అధిగమించలేకపోయారు. దానికి బదులుగా, 12 ఉత్తమ ప్రదర్శనల ఆధారంగా ఫైనలిస్టులను నిర్ణయించారు, ఇందులో ముగ్గురు భారతీయ త్రోయర్లు శుక్రవారం జరిగే మెడల్ ఈవెంట్‌లో తమ స్థానాలను సురక్షితం చేసుకున్నారు. గాయం కారణంగా బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు దూరమైన తర్వాత, తిరిగి ఈ గేమ్స్‌లో ఆడుతున్న నీరజ్, తన రెండవ ప్రయత్నంలో 79.61 మీటర్ల అత్యుత్తమ త్రో సాధించి క్వాలిఫికేషన్ స్టాండింగ్స్‌లో ఐదవ స్థానంలో నిలిచాడు. క్వాలిఫికేషన్ సాధించినందున, అతను తన చివరి త్రో వేయకూడదని నిర్ణయించుకున్నాడు. రోహిత్ యాదవ్ కూడా 78.37 మీటర్లు నమోదు చేసి తన చివరి ప్రయత్నాన్ని విరమించుకుని తొమ్మిదో స్థానంలో నిలవగా, యశ్ వీర్ సింగ్ 78.36 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో 10వ స్థానంలో అర్హత సాధించాడు.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్.. సెమీఫైనల్స్‌కు భారత్ పురుషుల జట్టు
### ఓటమితో మహిళల టీమ్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లలో మూడో సీడ్ ఇంగ్లాండ్‌పై 2-1 తేడాతో హోరాహోరీగా జరిగిన పోరులో విజయం సాధించిన భారత పురుషుల జట్టు సెమీ ఫైనల్స్‌కు దూసుకెళ్లగా, అమెరికా చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలైన మహిళల జట్టు ప్రయాణం క్వార్టర్ ఫైనల్స్‌తోనే ముగిసింది. గత ఎడిషన్‌లో కాంస్య పతకంతో సరిపెట్టుకున్న ఐదో సీడ్ భారత పురుషుల జట్టు గురువారం ఇంగ్లాండ్‌పై పోరాట పటిమతో కూడిన ప్రదర్శనతో తమ విజయ పరంపరను కొనసాగించింది. ఆర్యవీర్ దీవాన్ మ్యాచ్ గెలిచి భారత్‌కు ఆరంభంలోనే ఆధిక్యం అందించగా, ఇస్మాయిల్ ఖలీల్‌తో ఐదు గేమ్‌ల పోరాటం తర్వాత యుషా నఫీస్ టైని ముగించలేకపోయాడు. ఆ తర్వాత నిర్ణయాత్మక మ్యాచ్‌లో గుర్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శన చేసి, జార్జ్ గ్రిఫిత్స్‌ను వరుస గేమ్‌లలో ఓడించి భారత్‌ను చివరి నాలుగు స్థానాల్లో నిలిపాడు. మరోవైపు, ఆశాజనకమైన ఆరంభం చేసినప్పటికీ భారత మహిళల జట్టు మూడో సీడ్ టీమ్ యూఎస్‌ఏ చేతిలో 1-2 తేడాతో ఓటమి చవిచూసింది. ప్రస్తుత ప్రపంచ జూనియర్ ఛాంపియన్ అనాహత్ సింగ్, దియా యాదవ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకువచ్చింది. అయితే, అమెరికాకు చెందిన షార్లెట్ స్జే, రుద్ర సింగ్‌ను 11-6, 11-4, 11-8 తేడాతో ఓడించి మ్యాచ్‌ను సమం చేసింది. ఆ తర్వాత లిల్లీ బౌరెల్, అనైకా దుబేను వరుస గేమ్‌లలో ఓడించి యుఎస్‌ఎ తరఫున తన జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చింది.




## క్యాప్ నంబర్ 278కి గుడ్‌బై
### చరిత్రలో నిలిచిన అజింక్య రహానే

**న్యూఢిల్లీ:** టీమిండియా సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. దీంతో భారత క్రికెట్‌లో ఓ స్వర్ణ యుగానికి ముగింపు పలికినట్లైంది. ఆస్ట్రేలియాపై 2021లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని టీమిండియాకు అందించిన కెప్టెన్‌గా రహానే భారత చరిత్రలో నిలిచిపోయాడు. అజింక్య విదేశీ గడ్డపై క్లిష్టమైన పిచ్‌లపై అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ టీమిండియాకు ఎన్నో కీలక విజయాలు అందించాడు. అజింక్స్ ఆడిన టెస్టుల్లో సగానికి పైగా విదేశాల్లోనే ఉండటం అతని ప్రత్యేకత. రహానే కెరీర్‌లో అత్యంత చిరస్మరణీయ ఘట్టం 2020-21 ఆస్ట్రేలియా పర్యటన.

అడిలైడ్ టెస్టులో భారత్ 36 పరుగులకే ఆలౌట్ కావడంతో పాటు తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లీ సెలవుతో రహానే తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. మెల్‌బోర్న్ టెస్టులో భారత్‌ను 8 వికెట్ల తేడాతో గెలిపించి సిరీస్‌ను సమం చేశాడు. అనంతరం సిడ్నీ టెస్టును డ్రా చేయించడంతో పాటు, గబ్బా వేదికగా 328 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి భారత్‌కు చారిత్రాత్మక 2-1 సిరీస్ విజయాన్ని అందించాడు. రహానే తన కెరీర్‌లో భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 5,077 పరుగులు చేసి 12 సెంచరీలు, వన్డేల్లో 2,962 పరుగులు చేయగా, అందులో మూడు సెంచరీలు, 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 20 టీ20ల్లో 375 పరుగులు చేయగా, ఒకే ఒక్క హాఫ్ సెంచరీ బాదాడు. ఇక ఐపిఎల్‌లో 212 మ్యాచులో 5,367 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

# రెండోరోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
### ఐపిఒలు, కొత్త లిస్టింగ్స్‌పై ఇన్వెస్టర్లఫోకస్




**ముంబై,జులై 30:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం ఒడిదుడుకుల మధ్య ట్రేడింగ్ సాగించినప్పటికీ చివరికి స్వల్ప లాభాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ మార్కెట్లు పాజిటివ్ ముగింపును నమోదు చేశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 273.55 పాయింట్లు పెరిగి 77,928.15 వద్ద ముగియగా, ఎన్ఎస్‌ఇ నిఫ్టీ50 సూచీ 66.95 పాయింట్లు లాభపడి 24,317.15 వద్ద స్థిరపడింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.51 శాతం, నిఫ్టీ 1.38 శాతం మేర లాభపడ్డాయి.మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లలో నమోదైన కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధాన బలంగా నిలిచాయి. ఎం అండ్ ఎం షేరు 2.26 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.06 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 0.70 శాతం చొప్పున లాభపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.29 శాతం తగ్గగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.83 శాతం క్షీణించింది. బిఎస్ఇలో మొత్తం 1,690 షేర్లు లాభపడగా, 2,527 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 200 షేర్లలో ఎలాంటి మార్పు నమోదుకాలేదు.విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.6250 వద్ద ట్రేడవగా, అంతకుముందు 95.7625 వద్ద ముగిసింది. భారత 10 యేళ్ల కమోడిటీ మార్కెట్‌లో ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 0.72 శాతం పెరిగి రూ.1,42,801కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ సెప్టెంబర్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 13 సెంట్లు పెరిగి 90.87 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. ఎక్స్‌ట్రానెట్ టెక్నాలజీస్ షేరు తొలి ట్రేడింగ్ రోజును రూ.124.80 వద్ద ముగించి, ఇష్యూ ధర రూ.127తో పోలిస్తే 1.73 శాతం డిస్కౌంట్‌లో నిలిచింది. షేరు రూ.130.10 వద్ద లిస్టై, రోజులో రూ.123.60 నుంచి రూ.136.60 మధ్య ట్రేడైంది. లోహియా కార్ప్ షేరు మాత్రం ఇష్యూ ధరపై 16.39 శాతం ప్రీమియంతో రూ.494.65 వద్ద ముగిసింది. రోజంతా 15.38 లక్షలకు పైగా షేర్లు ట్రేడయ్యాయి. ఇండోఎంఎం షేరు ఇష్యూ ధరపై 52.95 శాతం ప్రీమియంతో రూ.741.80 వద్ద ముగిసి ఇన్వెస్టర్లకు భారీ లాభాలను అందించింది. రోజు ట్రేడింగ్‌లో ఎస్ఎంఎల్ మహీంద్రా షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకగా, రెడింగ్టన్ 7.84 శాతం, విగార్డ్ ఇండస్ట్రీస్ 4.88 శాతం, బాలకృష్ణ ఇండస్ట్రీస్ 11.06 శాతం లాభపడ్డాయి. ఎంటిఎఆర్ టెక్నాలజీస్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకగా, సింజీన్ ఇంటర్నేషనల్ షేరు 3.44 శాతం నష్టపోయింది.ఐపిఒలకు మిశ్రమ స్పందనమణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓకు 4.04 కోట్ల షేర్లకు బిడ్లు రాగా, విక్రయానికి 9 కోట్లకు పైగా షేర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఇష్యూ ధర శ్రేణిని రూ.560-590గా నిర్ణయించారు. ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ ఐపిఒకు 1.40 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. విక్రయానికి ఉంచిన షేర్లతో పోలిస్తే ఈ ఇష్యూ 3.52 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. దీని ధర శ్రేణి రూ.400-425గా ఉంది.జునిపర్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు మాత్రం ఆశించిన స్పందన లభించలేదు. 2.10 కోట్ల షేర్లకు మాత్రమే బిడ్లు రాగా, ఈ ఇష్యూ 0.36 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధర శ్రేణిని రూ.214-225గా నిర్ణయించారు.

# 27.4% వృద్ధితో బజాజ్ ఫైనాన్స్ రూ.5,986 కోట్ల నికర లాభం



**ముంబయి,జులై 30:** భారత్‌లో అతిపెద్ద ఎన్‌బిఎఫ్‌సి కంపెనీ బజాజ్ ఫైనాన్స్ నికర లాభం, నికర వడ్డీ ఆదాయం గణనీయంగా పెరగడంతో పాటు లోన్‌బుక్ కూడా వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది.కంపెనీ గురువారం విడుదల చేసిన ఫలితాల ప్రకారం, సమీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 27.4 శాతం పెరిగి రూ.5,986 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.4,700 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం 23 శాతం పెరిగి రూ.12,571 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.10,288 కోట్లుగా ఉండగా, మార్కెట్ అంచనా రూ.12,408 కోట్లుగా ఉంది. కేటాయింపులకు ముందు నిర్వహణ లాభం 22 శాతం పెరిగి రూ.10,137 కోట్లకు చేరుకుంది. కంపెనీ ఆస్తుల నాణ్యత మరింత బలపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.03 శాతం నుంచి 0.96 శాతానికి తగ్గింది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.41 శాతం నుంచి 0.39 శాతానికి తగ్గి అంచనాల కంటే మెరుగైన స్థాయిలో నిలిచింది. రుణ నష్టాలు, ప్రొవిజన్లు స్వల్పంగా పెరిగి రూ.1,993 కోట్లకు చేరాయి.

గత యేడాది ఇదేకాలంలో ఇవి రూ.1,969 కోట్లుగా నమోదయ్యాయి. నిర్వహణలో ఉన్న ఆస్తులు రూ.5.46 లక్షల కోట్లుజూన్ చివరి నాటికి కంపెనీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు 24 శాతం పెరిగి రూ.5.46 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ముఖ్యంగా గోల్డ్ లోన్లు, కమర్షియల్ వాహనాలు, ట్రాక్టర్ ఫైనాన్సింగ్ విభాగాల్లో నమోదైన వృద్ధి ప్రధాన కారణమైంది. తొలి త్రైమాసికంలో కంపెనీ 1.613 కోట్ల కొత్త రుణాలను మంజూరు చేసింది. వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ త్రైమాసిక ఫలితాలు మార్కెట్ ముగిసిన తర్వాత ప్రకటించగా, గురువారం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్ షేరు 0.09 శాతం తగ్గి రూ.1,053.50 వద్ద ముగిసింది. గత వారం రోజుల్లో షేరు 1.75 శాతం, నెల రోజుల్లో 5.3 శాతం, ఈ ఏడాది ఇప్పటివరకు 8.72 శాతం, గత యేడాది కాలంలో 19.57 శాతం లాభాన్ని నమోదు చేసింది.

## 10 లక్షల ఉత్పత్తి సామర్థ్యంతో మారుతి ప్లాంట్ సిద్ధం




**అహ్మదాబాద్,జులై 30:** ఆటో మొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా గుజరాత్‌లోని హన్సల్ పూర్‌లో తన నాలుగో తయారీ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల వాహనాలకు చేరి, అతిపెద్ద ప్యాసింజర్ వాహన తయారీ కేంద్రంగా అవతరించింది. 7.5 లక్షల యూనిట్ల సామర్థ్యంతో ఉన్న ఈ ప్లాంట్, కొత్త ప్లాంట్‌డి ప్రారంభంతో ఇప్పుడు 10 లక్షల యూనిట్లకు విస్తరించింది. హన్సల్‌పూర్ ప్లాంట్‌పై కంపెనీ ఇప్పటివరకు రూ. 25,288.7 కోట్లు పెట్టుబడి పెట్టగా, ఇందులో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌పైనే సుమారు రూ. 3,900 కోట్లు ఖర్చు చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుజుకి తయారీ కేంద్రాల్లో ఒకేచోట 10 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి ప్లాంట్‌గా కూడా ఇది నిలిచింది. ఈ విస్తరణతో మారుతి సుజుకి మొత్తం తయారీ సామర్థ్యం యేటా 29 లక్షల యూనిట్లకు పెరిగింది. ఈ కొత్త ప్లాంట్‌లో మారుతి తన ఫ్లాగ్‌షిప్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం ఇ-విటారాను తొలుత తయారు చేయనుంది. దీని ద్వారా కంపెనీ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అధికారికంగా ప్రవేశిస్తోంది. ప్రస్తుతం హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ఫ్రాంక్స్, బాలెనో, స్విఫ్ట్ వంటి ప్రముఖ మోడళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్లాంట్ కంపెనీకి కీలకమైన ఎగుమతుల కేంద్రంగా కూడా మారింది. మారుతి మొత్తం విదేశీ ఎగుమతుల్లో దాదాపు 47 శాతం వాటాను హన్సల్‌పూర్ ప్లాంట్‌నుంచే ఉన్నాయి.

## రూ.19వేల కోట్ల రుణ సమీకరణకు యూనియన్ బ్యాంక్




**ముంబయి,జులై 30:** ప్రభుత్వ రంగ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశీ కరెన్సీ రుణసేకరణ చేస్తోంది. బ్యాంకు డైరెక్టర్ల బోర్డు విదేశీ కరెన్సీలో గరిష్ఠంగా రూ.19, 146 కోట్లు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల ప్రకారం, బ్యాంకు దుబాయ్ మరియు/లేదా సిడ్నీ శాఖల ద్వారా రుణ పత్రాలు (డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) జారీ చేసి ఈ నిధులను సమీకరించనుంది. ఇప్పటికే ఈ యేడాది మే నెలలో యూనియన్ బ్యాంక్ ఈక్విటీ, డెట్ ఇన్‌స్ట్రుమెంట్ల మిశ్రమం ద్వారా రూ.8,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు బోర్డు ఆమోదించింది. మూలధనాన్ని బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ వ్యాపార విస్తరణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ మెరుగైన పనితీరు చూపించింది. నికర లాభం 29.6 శాతం పెరిగి రూ.5,332 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.4,116 కోట్లు. నికర వడ్డీ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.10,037 కోట్లకు పెరిగింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.9,113 కోట్లు. నిర్వహణ లాభం 15.8 శాతం పెరిగి రూ.8,003 కోట్లకు చేరుకోగా, గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.6,909 కోట్లు.ఆస్తుల నాణ్యతలో మెరుగుదల బ్యాంకు ఆస్తుల నాణ్యత కూడా మరింత మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.82 శాతం నుంచి 2.65 శాతానికి తగ్గాయి.నికర నిరర్థక ఆస్తులు 0.48 శాతం నుంచి 0.47 శాతానికి స్వల్పంగా తగ్గాయి.కేటాయింపులు రూ.1,665 కోట్ల నుంచి రూ.979 కోట్లకు గణనీయంగా తగ్గాయి.

## 35% క్షీణించిన హ్యుండై మోటార్స్ నికరలాభం



**ముంబయి,జులై 30:** హ్యుందాయ్ మోటార్ ఇండియా తొలి త్రైమాసిక లాభం 35శాతంక్షీణించి రూ.889 కోట్లకుచేరింది. గత యేడాది ఇదే కాలంలో రూ.1,369 కోట్లుగా ఉన్న నికర లాభం, ఈసారి 35.1 శాతం తగ్గి రూ.889 కోట్లకు చేరింది.సంస్థ ఆదాయం దాదాపు స్థిరంగానే ఉన్నప్పటికీ, స్వల్పంగా 0.5 శాతం తగ్గి రూ.16,335 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.16,413 కోట్లుగా ఉంది.తొలి త్రైమాసిక ప్రధాన ఆర్థిక ఫలితాలు వార్షిక పద్ధతిలో నికర లాభం రూ.889 కోట్లు రాబడులు రూ.16,335 కోట్లు, ఎబిట్డా రూ.1,512 కోట్లు, ఎబిట్డా మార్జిన్: 9.3శాతంగా నమోదయింది. అంచనాల కంటే నికర లాభం, ఎబిట్డా స్వల్పంగా మెరుగ్గా నమోదైనప్పటికీ, మార్జిన్లు గణనీయంగా తగ్గాయి.అవెన్యూ అమ్మకాల్లో కొత్త రికార్డుతొలి త్రైమాసికంలో ఆల్‌న్యూ అవెన్యూ దేశీయ మార్కెట్లో ఇప్పటివరకు అత్యధిక త్రైమాసిక అమ్మకాలను నమోదు చేసింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో ఈ మోడల్‌కు పెరుగుతున్న ఆదరణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. సిఎన్‌జి వాహనాలకు పెరుగుతున్న డిమాండ్ ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల విక్రయాల్లో కూడా హ్యుందాయ్ మంచి వృద్ధిని నమోదు చేసింది. మొత్తం అమ్మకాలలో సీఎన్‌జీ వాహనాల వాటా 18 శాతానికి చేరింది.ఆరా మోడల్‌లో సిఎన్‌జీ వేరియంట్ వాటా 95 శాతానికి చేరుకుంది. ఎక్స్‌టర్ సిఎన్‌జీ వేరియంట్ వాటా 32 శాతానికి పెరిగింది. గ్రామీణ మార్కెట్‌లో విస్తర గ్రామీణ ప్రాంతాల్లో కూడా హ్యుందాయ్ తన మార్కెట్‌ను మరింత విస్తరించింది. మొత్తం అమ్మకాలలో గ్రామీణ మార్కెట్ వాటా రికార్డు స్థాయిలో 26 శాతానికి చేరిందని సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ తరుణ్ గార్గ్‌మాట్లాడుతూ, ఉత్పత్తి పూర్తి స్థాయిలో సాధారణస్థితికి చేరుకుందని తెలిపారు. దేశీయంగా డిమాండ్ అనుకూలంగా ఉండటంతోపాటు త్వరలో కొత్తఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకు రానున్నామని చెప్పారు. దీంతో రెండోత్రైమాసికంనుంచి దేశీయ, ఎగుమతి వ్యాపారాల్లో వృద్ధి వేగం పుంజుకునే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాగ్మా బీమా కొనుగోలుకు పతంజలి రెడీ




**ముంబయి, జులై 30:** యోగా గురువు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్ సంస్థ, ఫాస్ట్ మూవింగ్‌కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసిజి), ఆయుర్వేద రంగాల నుంచి ఆర్థిక సేవల రంగంలోకి అతిపెద్ద అడుగు వేసింది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలుకు పతంజలికి ఐఆర్‌డిఎఐ ఆమోదం తెలిపింది. రూ. 4,500 కోట్ల విలువైన ఈ కొనుగోలును పతంజలి ఆహార, మిఠాయి ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన డిఎస్ గ్రూప్‌తో కలిసి సంయుక్తంగా చేపడుతోంది.

ఈ ఒప్పందం ప్రకారం, మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో పతంజలి 73.56 శాతం వాటాను, డీఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను సొంతం చేసుకుంటాయి. ప్రస్తుత వాటాదారులైన అదార్ పూనావాలా గ్రూప్‌కు చెందిన సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పి నుంచి దాదాపు 98 శాతం వాటాను ఈ రెండు సంస్థలు కొనుగోలు చేయనున్నాయి. ఐఆర్‌డిఎఐ ఆమోదం మూడు నెలల పాటు చెల్లుబాటులో ఉంటుంది. ఈలోగా ఈలావాదేవీని పూర్తిచేయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమకు ఉన్న విస్తృతమైన రిటైల్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని ఇన్సూరెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని పతంజలి భావిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ గత కొన్నేళ్లుగా తన వ్యాపారాన్ని స్థిరంగా విస్తరిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ. 3,615.48 కోట్ల స్థూల ప్రీమియం ఆదాయాన్ని ఆర్జించింది. ఈ డీల్ గడువులోగా పూర్తయితే, భారత జనరల్ ఇన్సూరెన్స్ రంగంలో పతంజలి సరికొత్త సంస్థగా అవతరించనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# సంగమంలో ఉప్పొంగుతున్న గోదావరి..



**ముంపు వాసులను వెంటాడుతున్న వరద భయం**

**వి.ఆర్.పురం,జూలై30,ప్రభాతవార్త** శబరి, గోదావరి సంగమ ప్రాంతమైన వి.ఆర్.పురం వద్ద గోదావరినది ఉప్పొంగి ప్రవహిస్తుంది. శబరి, గోదావరి ఎగువ రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్ ఘడ్, తెలంగాణ ల్లో గడిచిన మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.గురువారం ఇరునదులకు అనూహ్యంగా వరద పెరిగింది. దీంతో లోతట్టు ప్రాంతంలోని వి.ఆర్.పురం వద్ద గోదావరినది పరవళ్ళు తొక్కుతు ప్రవహిస్తుంది.

**లోతట్టు వాసులను వెంటాడుతున్న వరద భయం....**

గోదావరినది చరిత్రలో చోటుచేసుకున్న అనేక వరద సంఘటనల నేపధ్యంలో శబరి,గోదావరి ఇరునదుల లోతట్టు ప్రాంతాల్లోని ముంపు వాసులను వరద భయం వెంటాడుతుంది. పోలవరం ప్రాజక్ట్ ప్రభావంతో, ఎగువ రాష్ట్రాల్లో కురిసే వర్షాల వరద నీరు ఒకప్పటిలా దిగువ తేలికగా వెళ్లే పరిస్తితి లేకుండాపోయింది. దీంతో ఈ ప్రాంతంలో వర్షాలు, వరదలు లేకున్నా ఎగువ రాష్ట్రాల నుండి వచ్చే వరదకు ఇక్కడ వరదలు సంభవించి, ముంపు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామంతో గోదావరిలో కొద్దిపాటి వరదవస్తేనే, ఇక్కడి జనం భయం గుప్పెట్లో బ్రతుకులు వెళ్లదీసే పరిస్థితితులు నెలకొన్నాయి.

**నేడు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం......**

గోదావరి ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, భద్రాచలం వద్ద గోదావరి వరద కమేపి పెరుగుతుంది. ఈ వరద నేడు మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని, రేపు రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. భద్రాచలం వద్ద రెండవ ప్రమాదహెచ్చరిక 48 అడుగులకు చేరుకుంటే, దానికి శబరినది వరద తోడైనట్లయితే, ముంపు మండలాల్లో రహదారులు నీట మునిగి, రవాణ పూర్తిగా స్తంభించే ప్రమాదం ఉంటుంది. అయితే ఈ వరద రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగుల వరకు చేరుకొని, తిరిగి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని సమాచారం. ఇదే జరిగితే ముంపు వాసులు వరద గురించి అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటున్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం | శుక్రవారం 31 జూలై 2026 | I


# సత్యదేవుని హుండీ లెక్కింపు..

**38 రోజులకు రూ 2,10 ,95,376 ఆదాయం..**



**అన్నవరం జూలై 30 (ప్రభాతవార్త),** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయ హుండీకి భక్తులు మరోసారి భారీగా కానుకలు సమర్పించారు. 38 రోజుల హుండీ ఆదాయం రెండు కోట్ల రూపాయలు దాటింది. గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో మొత్తం రూ. 2,10,95,376 నగదు లభించింది. అలాగే భక్తులు సమర్పించిన 36 గ్రాముల బంగారం, 424 గ్రాముల వెండి కూడా హుండీలో లభించాయి. దేవస్థానం ఈవో ఎన్. సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, దేవస్థాన అధికారులు, ఉద్యోగులు, సేవకులు పాల్గొన్నారు..

## ఏడువారాల వెంకన్నకు
# అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం...
## అశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులు..





**ఆత్రేయపురం, జూలై 30,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం గురువారం వేలాది మంది భక్తులతో పోటెత్తింది . ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## జిల్లా టీడీపీ సమావేశం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూలై 30 (ప్రభాతవార్త )** కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్ ,కర్రి పద్మశ్రీ హాజరయ్యారు. కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, మందు వెంకన్న చౌదరితో పాటు కార్యనిర్వాహక కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, ఆఫీస్ సెక్రెటరీ, కార్యదర్శులు తదితర జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల భవిష్యత్ కార్యాచరణపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి, వాటి అమలు తీరుపై సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని, అమలవుతున్న డెవలప్మెంట్ మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై నాయకులు, కార్యకర్తలు తమ అమూల్యమైన ప్రజాభిప్రాయాలను, సూచనలను పంచుకున్నారు. ఈ పథకాలపై ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు మరియు కార్యకర్తలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో నాయకులు ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. అనంతరం ఈ తీర్మానాలను జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ద్వారా పార్టీ అధిష్టానానికి పంపించారు. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో ప్రజల, కార్యకర్తల అభిప్రాయాలతో కూడిన ఈ తీర్మానాలను తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ లోకేష్ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లనున్నారు.

# నున్న తిరుమల రావుకి పలువురు పరామర్శ





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై30,ప్రభాతవార్త.** సోదర వియోగం తో బాధపడుతున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు ను పలువురు ప్రముఖులు పరామర్శించి ఓదార్చారు.రోడ్డు ప్రమాదంలో నున్న సురేష్ అకాల మరణం పట్ల తమ సంతాపం వ్యక్తం చేశారు. కాతేరులోని నున్న స్వగృహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న కిట్టయ్య సోదరులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోజేష్ రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, వేగుళ్ళ జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్ జీవీ హర్ష కుమార్, మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, తానేటి వనిత ,రాష్ట్ర సర్వ శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాస్ రావు, డాక్టర్ గోరంట్ల రవి రామ్ , ఆదిరెడ్డి అప్పారావు, జక్కంపూడి గణేష్ ,చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కె వి వి సత్యనారాయణ రాజు, నాయకులు గన్ని కృష్ణ ,ఎర్ర వేణుగోపాలరావు, చెరుకూరి వీర్రాజు, జీవీ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ దీపక్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ ,డాక్టర్ శ్రీలత, అనుశ్రీ సత్యనారాయణ తో పాటు పలువురు ప్రముఖులు దివంగత నున్న సురేష్ చిత్రపటం వద్ద నివాళు లర్పించారు.





# పోలవరం జిల్లాలో ఆర్బిఎస్కె.2 శీకు శ్రీకారం
## దేశ చరిత్రలో తొలిసారి : రాష్ట్ర మంత్రి సత్య కుమార్.







**పోలవరం జిల్లా ప్రతినిధి. జూలై 30 ప్రభాత వార్త.** పోలవరం జిల్లా ముసురుమిల్లిలో ఏపీ ప్రభుత్వం ఆర్ బి ఎస్ కే 2.0 కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ లాంచనంగా ప్రారంభించారు. దేశ చరిత్రలోనే ఈ కార్యక్రమం తొలిసారి కావటం విశేషం . ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలు కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు సుమారు 62.65 లక్షల మంది పిల్లలకు 38 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం క్రింద సమగ్ర ఆరోగ్య పరీక్షలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు.పోలవరం జిల్లా రంపచోడవరంలోని ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య పరీక్షల ప్రారంభ కార్యక్రమములో గురువారం ఉదయం పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేసే దిశగా కేవలం మూడు నెలల్లో 12 మంది వైద్యులను కేటాయించడం వల్ల పీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.ఆరోగ్య పరీక్షల్లో సమస్య బయటపడిన చిన్నారులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థలకు పంపించి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు. పరీక్షలో సమస్య గుర్తించిన ప్రతి చిన్నారికి పూర్తిస్థాయి వైద్యం అందే వరకు ఆరోగ్య శాఖ బాధ్యత తీసుకోవాలి” అని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.పోలవరం జిల్లా కలెక్టర్ కె . దినేష్ కుమార్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ పాలసీ వల్ల పోలవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులోకి వచ్చారని చెప్పారు. గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం యం ఎల్ ఏ మిరియాల శిరీష దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సోళ్ల బొజ్జిరెడ్డి,డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ జె.విజయలక్ష్మి, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.సరిత, ప్రజా ప్రతినిధులు, అధికారులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాలో ‘ఆశ’ ప్రాజెక్టు ప్రారంభం
## గిరిజన ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి సత్యకుమార్ యాదవ్



**రంపచోడవరం, జూలై 30 ప్రభాతవార్త.:** పోలవరం జిల్లాలోని ప్రతి గ్రామానికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా పరిపాలన రూపొందించిన ‘ఆశ’ ప్రాజెక్టును రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ప్రారంభించారు.
రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆర్డీవో కె. స్వాతి, రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మ శశిధర్ కలిసి ప్రాజెక్టు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో గర్భిణులకు రక్తహీనత నివారణ, సకాలంలో ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, ‘సఖి’ కార్యక్రమం ద్వారా గర్భిణుల నిరంతర పర్యవేక్షణ, ‘నవ జంట కానుక’ ద్వారా నూతన దంపతులకు ప్రభుత్వ సేవలు, ఆరోగ్య కిట్లు అందించడం, ‘స్వర్ణ గ్రామ ఆరోగ్య సభ’ల ద్వారా గ్రామస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పుట్టినప్పటి నుంచే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణతో పాటు రక్తహీనత నిర్మూలనకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ వినూత్న ప్రాజెక్టు ద్వారా గిరిజన ప్రాంత ప్రజలకు మరింత చేరువలో ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి. సరిత, మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ షేక్ సుభాని, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురవుతున్న పి.హెచ్.సి. స్థల పరిశీలన.



**తాళ్లరేవు, జూలై 30( ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి) స్థలం ఆక్రమణకు గురవుతుందని అందిన ఫిర్యాదు మేరకు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ గురువారం పరిశీలించారు. గతంలో పీహెచ్సీ ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి కొందరు కళ్యాణ మండపం నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణలో భాగంగా ఈ పరిశీలన చేసినట్లు తెలిసింది. పరిశీలన సందర్భంగా ఆయన స్థానికులు, స్థానిక అధికారులనుండి సమాచారాన్ని సేకరించారు. ఆ స్థలాన్ని ఆక్రమించి కళ్యాణ మండపం కడుతున్నారని స్థానికులు, అధికారులు తెలిపారు. అనంతరం డాక్టర్ ప్రభాకర్ తాసిల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట తాళ్లరేవు పి హెచ్ సీ వైద్యాధికారి ఈశ్వర్, ఎల్డిసి షర్మిల, ఏఎన్ఎం లక్ష్మీకాంతం, ఎమ్మెల్ హెచ్ పి పావని, హెల్త్ అసిస్టెంట్లు బిఎల్ శ్రీను, ఒ శ్రీను, కాలా ఆంజనేయులు, ఆశ వర్కర్లు ఉన్నారు.

# రైతులు పప్పు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



**శంఖవరం జులై 30 ప్రభాతవార్త** ప్రస్తుతం నెలకొన్నఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో ఆరుతడి పంటలైన పప్పు ధాన్యాల సాగుపై దృష్టి సారించి, పప్పు దినుసుల ఉత్పత్తిని పెంచాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సంజీవ్ కుమార్ రైతులకు సూచించారు. శంఖవరం మండలంలోని కొంతంగి గ్రామంలో వ్యవసాయ అధికారి పి గాంధీ ఆధ్వర్యంలో రైతులకు పప్పు దినుసులలో ఆత్మ నిర్భర్ మిషన్ లో భాగంగా సామర్థ్య పెంపుదల శిక్షణా కార్యక్రమశీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ పప్పు దినుసులైన మినుము, పెసర, కంది వంటి పంటల్లో అధిక దిగుబడులిచ్చే రకాలతో ఉత్పత్తిని పెంచే మార్గాలు, మద్దతు ధరలు, దిగుమతులు తగ్గించుట గూర్చి రైతులకు వివరించారు. గాంధీ మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా ప్రత్తి పంటకు భీమాలో ప్రీమియం చెల్లించి లబ్ది పొందాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గూర్చి ఎంటి సోమరాజు రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు మణికంఠ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# సోకులేరు వాగులో గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం



**మోతుగూడెం జూలై:30 ప్రభాతవార్త** చింతూరు మండలం చడలవాడ పంచాయతీ పరిధిలోని సోకులేరు వాగులో ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయి గల్లంతైన పెండెం బాబి మరియు పెండెం కళ్యాణ్ కోసం చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సీహెచ్. గోపాలకృష్ణ పర్యవేక్షణలోమోతుగూడెం ఎస్.ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ పోలీసు సిబ్బంది ఏఎన్ఎస్ పార్టీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం మరియు స్థానిక గ్రామస్తుల సహకారంతో గత రెండు రోజులుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం చడలవాడ పంచాయతీ పరిధిలోని తులసిపాక గ్రామ సమీపంలో సోకులేరు వ్యూ పాయింట్‌కు సుమారు 100 మీటర్ల దూరంలో నీటిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను ఫిర్యాదుదారుడు పెండెం బాబి మరియు పెండెం కళ్యాణ్ గా గుర్తించగా పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వర్షాకాలంలో వాగులు, నదులు జలాశయాలు వరద నీటి ప్రవాహాల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## అనంత బాబు బెయిల్ పిటిషన్‌పై
# ఆగస్టు మూడుకు వాయిదా

**రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ప్రభాతవార్త).** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. గురువారం రాజమహేంద్రవరం ఎసిబి కోర్టులో జిల్లా జడ్జి ఆగస్టు 3వ తేదీకి బెయిల్ పిటిషన్ వాయిదా పడిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు తెలిపారు. అనంతబాబును పోలీసులు భద్రత మధ్య కోర్టుకు తీసుకొచ్చారు

# రైతుల సంక్షేమమే పవన్ కళ్యాణ్ లక్ష్యం
## మాజీ ఎమ్మెల్యే దొరబాబు



**పిఠాపురం, జూలై 30 ( ప్రభాతవార్త)** రైతుల సంక్షేమమే పవన్ కళ్యాణ్ లక్ష్యమని, కాకినాడ జిల్లా రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా కీలక పాత్ర పోషించారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. పిఠాపురం ఆయకట్టుకు సాగునీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్న సందర్భంగా గురువారం గొర్రికండి కాలువ వద్ద ధన్య వాద సభ ఏర్పాటు చేసి, ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు తుమ్మల రామస్వామి బాబు,ఓదూరి కిషోర్, నీటి సంఘం అధ్యక్షులు, రైతులతో కలిసి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సాగునీటి విడుదలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గత కొన్ని రోజులుగా అధికారులతో సమీక్షలు జరిపారని, ఆయన అన్నారు. ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆరోగ్యం సహకరించకపోయినా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఏలూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావ పరిస్థితులలో ప్రాజెక్టు నుంచి 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించడం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికే సాధ్యపడుతుందన్నారు. ఏలేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ వూట నాని బాబు మాట్లాడుతూ వరుణదేవుడు కరుణించకపోయిన, పవన్ దేవుడు కరుణించారని,ఆనందం వ్యక్తం చేశారు. విరవాడ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వలనే పిఠాపురం ఆయకట్టుకు నీరు విడుదల చేశారని, లేకపోతే ఈ ప్రాంత రైతులంతా మట్టి కొట్టుకుని పోయే వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, ఈస్ట్రన్ డెల్టా చైర్మన్ మొరాలశెట్టి సునీల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్, పిఠాపురం నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు వెన్నా జగదీష్, జ్యోతుల శ్రీనివాస్, రావు అక్షయ్, పిఠాపురం, గొల్లప్రోలు పార్టీ పట్టణ అధ్యక్షులు చిక్కాల వరలక్ష్మి, మామిడాల సూరిబాబు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, నీటి సంఘాల అధ్యక్షులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై వైసిపి దుష్ప్రచారం

### -రుజువు చేయాలని ఎమ్మెల్సీ రాజశేఖర్ సవాల్



కాకినాడ రూరల్, జూలై 30 (ప్రభాతవార్త): కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, డీఎస్సీలో అక్రమాలను రుజువు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ సవాల్ విసిరారు. గురువారం ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల వ్యవహారంలో ఎలాంటి తప్పు జరగలేదని, ఒకవేళ లోపాలుంటే గాని, అక్రమాలు గాని జరిగినట్లు వైసిపి నాయకులు నిరూపిస్తే తాను తక్షణమే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని బహిరంగ సవాల్ విసిరారు. రాష్ట్రం లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని సుపరిపాలన చేస్తున్నారని ప్రజల నుండి ప్రభుత్వానికి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక వైసిపి పార్టీ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ పారదర్శకంగా జరిగిన వైసిపి బాధ్యత వహించానికి ప్రభుత్వం ఎప్పుడూ వెనుకాడదని పేర్కొన్నారు.నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రభుత్వం మర్చిపోలేదని, అయితే కేవలం భృతి ఇవ్వడం కంటే యువతకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి, పరిశ్రమల స్థాపన ద్వారా యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నట్లు,నిరుద్యోగ భృతితో పాటు వివిధ హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపడుతున్నారన్నారు.

## అడ్డతీగలలో ఆలయాలకు రహదారి సదుపాయం కల్పించాలని మంత్రికి వినతి



అడ్డతీగల, జూలై 30, ప్రభాతవార్త: పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలోని పైడిపుట్ట గ్రామంలో ఉన్న ప్రాచీన శివాలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు జాతీయ రహదారి నిర్మాణం అనంతరం సరైన రోడ్డు సదుపాయం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు బత్తుల సత్యనారాయణ తెలిపారు.ముఖ్యంగా మహాశివరాత్రి, కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు ఈ ఆలయాలను సందర్శిస్తారని, అయితే జాతీయ రహదారి కారణంగా ఆలయాలకు చేరుకునే మార్గం అనుసంధానం కోల్పోయిందని ఆయన వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి సత్య ప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి, భక్తుల సౌకర్యార్థం ఆలయాలకు అనుసంధాన రహదారి, సర్వీస్ రోడ్ లేదా తగిన ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## పాఠశాలలో విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ పై అవగాహన



అడ్డతీగల, జూలై 30, ప్రభాతవార్త: అడ్డతీగల మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'మట్టి నమూనాల సేకరణ' మరియు భూసార పరీక్షల ప్రాముఖ్యతపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.?ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి రామ్ మోహన్ రావు మాట్లాడుతూ... వివిధ రకాల నేలలు, వాటి స్వభావం మరియు వాటిలో పండించే అనువైన పంటల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేలలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత మోతాదులో ఉన్నాయో భూసార పరీక్షల ద్వారా ఖచ్చితంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. నేల స్వభావాన్ని బట్టి ఎరువులను వినియోగిస్తే అనవసరపు ఖర్చులు తగ్గి, పంటలలో అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి మాట్లాడుతూ, నేల భూసారాన్ని పెంపొందించుకోవడానికి సేంద్రియ ఎరువుల వాడకం ఎంతో అవసరమన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సిహెచ్. శివ శ్రీనివాస్ పొలాల నుండి మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ డి. ముత్యాలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బిక్కవోలు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించిన డిడిఓ వీణా దేవి



బిక్కవోలు 30 జూలై ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గురువారం రాజమహేంద్రవరం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి పి వీణా దేవి అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించారు. గ్రామంలో నీటి సమస్యలు, పారిశుధ్యం, డంపింగ్ యార్డ్, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంకుల సందర్శన, స్వర్ణ గ్రామ ఉద్యోగుల పనితీరు సందర్శించడం జరిగినది, చెత్త నుండి సంపద తయారీ కేంద్ర నిర్వాహ పురోగతి సందర్శించారు. ఈ కార్యక్రమంలో బిక్కవోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి శ్రీనివాస్, తాసిల్దార్ బీవీఎస్ రమేష్ బాబు, బలభద్రపురం గ్రామ ప్రత్యేక అధికారి బి ఎస్ వి ఎస్ కృష్ణ , డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ రాజ్ ఎస్ జాన్ మిల్టన్, మండల స్వచ్ఛ గ్రామ ఆఫీసర్ వై మునేశ్వరరావు, మండల ఇంజనీరింగ్ అధికారి పి వి రామిరెడ్డి , అసిస్టెంట్ ఇంజనీర్ పంచాయతీరాజ్ అధికారి బి సాయికుమార్ , ఏపిఎం వెలుగు టి సుప్రియ, ఏపీవో ఎన్ఆర్ఈజీఎస్ ఆగస్టీన్ కుమార్, ఏఈ హౌసింగ్ వి. వసుమతి , పంచాయతీ కార్యదర్శి జి అశోక్, బలభద్రపురం స్వచ్ఛ గ్రామ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, టిడిపి నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు చిన్నం వీర రాఘవ రెడ్డి, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు, వివో ఏలు, గ్రామ ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. తదనంతరం తోసిపూడి గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నుండి గుర్రపు డెక్క ద్వారా కంపోస్టు ఎరువు తయారీ పై చేసే ప్రక్రియను సందర్శించడం జరిగినది ఎంపీడీవో శ్రీనివాస్ తెలియజేశారు.

# దేవరపల్లిలో నేడు 'డ్రగ్స్ రహిత సమాజం'పై భారీ ర్యాలీ

### -వైద్య నిపుణులతో అవగాహన సదస్సు- సి.ఐ. ఎస్.ఐ వెల్లడి

దేవరపల్లి, జూలై 30 (ప్రభాతవార్త): మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించి, భావితరాల భవిష్యత్తును కాపాడే లక్ష్యంతో దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం (జూలై 31) భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించనున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున నాయక్ , సబ్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు చేరుకుంటుందని పేర్కొన్నారు.అనంతరం బస్ స్టాండ్ ప్రాంగణంలో వైద్య నిపుణులతో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై దాదాపు 15 నిమిషాల పాటు నిపుణులు ప్రజలకు, యువతకు దిశా నిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. మత్తు పదార్థాల నిర్మూలన అనేది ఒక్క పోలీసు శాఖ బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి కర్తవ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం కలిసి కొంత సమయాన్ని వెచ్చించి గంజాయి, డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం, మన యువతను, భావితరాలను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా ర్యాలి శ్రీ జగన్మోహనుడి మాస కళ్యాణ మహోత్సవం...



ఆత్రేయపురం, జూలై 30,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అతి పురాతన పుణ్యక్షేత్రం స్వయంభూ ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయంలో శుక్రవారం శ్రవణ నక్షత్ర మాస కళ్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది.ఆలయ అర్చకులు కంకణధారణ, మాధోపక్షాలన, కన్యాదానం, మధుపర్కప్రాశన, సూత్రధారణ, యజ్ఞోపవేతధారణ, తలంబ్రాలు, క్రతువును పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు లు స్వామి వారికి అమ్మ వాళ్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ స్వామి వారి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీ స్వామి వారి తదుపరి మాస కళ్యాణం ఆగస్టు .26. న నిర్వహించనున్నట్లు ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.కావున భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొనవలెను. కావున భక్తులు 99113 34733 నంబరునకు సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుం రూ.750/- లు చెల్లించి పూజనందు పాల్గొవాలని. ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని. ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు. తెలిపారు. అలాగే ఆత్రేయపురం లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో శ్రావణ నక్షత్ర మాస కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ తేజ దీక్షితులు, సాయి పవన్, రవికృష్ణ నేతృత్వంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి అమ్మవార్లకు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని చిలువురి రామరాజు, రామలక్ష్మి, ఆనందాచార్యులు వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయం మేనేజర్ వినయ్ కుమార్ రాజు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రాజకీయ భవిష్యత్ కోసం మరో పోరాటం..

### -ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ..-త్వరలో రాజకీయ చైతన్య వేదికలు..



అంబాజీపేట, జూలై 30,ప్రభాతవార్త): ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పోరాటం చేసి సాధించుకున్నామని, మాదిగ యువత భవిష్యత్తు,సామాజిక వర్గీయుల రాజకీయ అవకాశాల కోసం మరో పోరాటానికి సంసిద్ధం కాబోతున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జాతీయ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సూచనలతో అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని సామాజిక భవనంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి డాన్ సూరి మాదిగ అధ్యక్షతన జిల్లా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా చిన సుబ్బారావు మాట్లాడుతూ మాదిగలకు రాజకీయ వాటా కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ వెన్నంటే ఉంటూ పార్టీ అభివృద్ధితోపాటు నాయకుల గెలుపులో మాదిగల పాత్ర ఎంతో ఉందని, “కూటమికి నాలుగవ స్తంభం మాదిగలే” నని 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు మాదిగలకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా హామీ నెరవేర్చలేదన్నారు. గతంలో మాదిగలకు ఇచ్చిన మాటను ఒకసారి తప్పారని, రెండోసారి తప్పేందుకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని, చంద్రబాబు నాయుడు మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని చెప్పండని మంద కృష్ణ మాదిగకు తెలియజేశామన్నారు. కోనసీమ జిల్లాలో ఎస్సీలో ఎక్కువ మంది మాలలే ఉన్నారని తెలుగుదేశం పార్టీ భావిస్తోందని,అయితే వందమంది మాలలలో 20 మందే టీడీపీకి ఓటు వేస్తారని, 80 శాతం మంది మాదిగలు టిడిపి వైపే ఉంటారన్నారు. ఓటింగ్ నిష్పత్తి ప్రకారం చూసిన మాదిగలదే పైచేయని, కోనసీమలో అధిక శాతం ఉన్న మాదిగ వర్గీయులకు ఎమ్మెల్సీ పదవితో పాటు ఒక ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల దండోరా అధ్యక్షులు తొత్తరమూడి గోవింద్, కొమ్మర వీర రాఘవులు,గంధం యాకోబు, ముమ్మిడివరపు సోమేశ్, ఆకుమర్తి ఆశీర్వాదం,పెదపూడి శ్రీనివాసరావు, మంద రాజేష్, ఉందుర్తి నాగబాబు, దిగుమర్తి చిట్టిబాబు, నేదునూరి వెంకటరమణ,మంద నాగరాజు, తవిటికి వీరాభిమన్యుడు, నవ్వుంద్రు వెంకటరమణ, కముజు స్వామి, నేదునూరి నాని, కముజు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యానందం జయంతి



యానం, జూలై 30:ప్రభాతవార్త యానం విమోచన ఉద్యమంలో విశిష్ట సేవలు అందించిన స్వాతంత్ర్య సమరయోధుడు మద్దిమచెట్టి సత్యానందం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పోలీసు అధికారులు మరియు ప్రముఖులు పాల్గొని ఆయన దేశభక్తిని స్మరించుకున్నారు.వక్తలు మాట్లాడుతూ, ఫ్రెంచ్ పాలన నుండి యానం భారతదేశంలో విలీనమయ్యే ఉద్యమంలో మద్దిమచెట్టి సత్యానందం కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యానం అభివృద్ధికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ఆయన చేసిన సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, స్థానిక నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## నేలను కాపాడుకుందాం-విద్యార్థుల్లో మట్టి పరీక్షలపై అవగాహన



రంపచోడవరం, జూలై 30: ప్రభాతవార్త. విద్యార్థి దశ నుంచే నేల సంరక్షణపై అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన వ్యవసాయానికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఏకలవ్య మోడల్ స్కూల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమీపంలోని పొలాలకు తీసుకెళ్లి, మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో ఎలా సేకరించాలి, వాటిని పరీక్షలకు ఎలా పంపాలి, మట్టి పరీక్షల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి అనే అంశాలను ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె. లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారం పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అందుకే చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో నేల సంరక్షణపై అవగాహన పెంపొందించాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని విద్యార్థులను కోరారు.మట్టి నమూనాల పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషకాల స్థాయిని గుర్తించి, అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించడం సాధ్యమవుతుందని తెలిపారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు, రైతుల ఆదాయం కూడా పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దేవేందర్ శర్మ, బయాలజీ ఉపాధ్యాయుడు హేమంత్, కౌన్సిలర్ సోమశేఖర్, దూడ చంద్రకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజేంద్ర, హనుమంతరావు, వి.ఏ.ఏ. భాగ్యశ్రీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# తుప్పల్లో ట్రాన్స్ ఫార్మర్



పిఠాపురం, జూలై 30 (ప్రభాతవార్త ) పిఠాపురం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే సమగ్ర మంచినీటి పథకానికి ఏర్పాటుచేసిన ట్రాన్స్ ఫార్మర్ గత సంవత్సరం కాలంగా తుప్పల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. కోటగుమ్మ నుంచి మహారాజా కోటకు వెళ్లే దారిలో తుప్పలతో సహజీవనం చేస్తూ ఈ ట్రాన్స్ ఫార్మర్ కనిపిస్తోంది. మహారాజా కోట ఆవరణలో నివాస గృహాలు,కార్పొరేట్ విద్యాసంస్థల స్కూల్స్, కాలేజీలు, హోల్సేల్ వ్యాపార సంస్థలు, కళ్యాణ మండపాలు ఉండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగానే ఉంటుంది. కుడివైపు రద్దీగా ఉండే టిఫిన్ సెంటర్, ఎడమవైపు పార్కింగ్, మధ్యలో ఇటు అటు వెళ్లే ప్రజలు,స్కూల్ బస్సులు,ఆటోలు, వెళుతుంటాయి. అగ్నికి ఆజ్యం పోసినట్టు దురదృష్టవశాత్తు తుప్పల రాపిడికి ట్రాన్స్ ఫార్మర్ లో మంటలు సంభవించి ట్రాన్స్ ఫార్మర్ పేలిపోయి పెద్ద ప్రమాదం జరిగితే దీనికి ఎవరు సమాధానం చెబుతారు? సమగ్ర మంచినీటి పథకానికి కరెంటు సరఫరా నిలిచిపో వటంతో తాగటానికి గుక్కెడు నీళ్లు లేక ప్రజలు అలమటిస్తుంటే, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పదోన్నతి పొందిన ఎంపిడిఓ, వెంకట్ రామన్‌కు ఘన సత్కారం..



ఆత్రేయపురం, జూలై 30,(ప్రభాత వార్త) మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వెంకట్ రామన్ మండల అభివృద్ధి కి అందించిన సేవలు ఆదర్శనీయమని జడ్పీటీసీ సభ్యులు బోనం సాయిబాబా అన్నారు.ఆత్రేయపురం ఎంపిడిఓ గా విధులు నిర్వహించి నరసాపురం డివిజనల్ డెవలప్మెంట్ అధికారిగా పదోన్నతిపై బదిలి అయిన బి కె ఎస్ ఎస్ వెంకట రామన్ ను పలువురు నాయకులు , అధికారులు ఘనంగా సత్కరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్.పి.టి.సి. బోణం సాయిబాబు, వాడపల్లి దేవస్థాన కమిటీ చైర్మన్, ముదునూరి వెంకట రాజు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షులు ముదునూరి రామబద్రరాజు, తహశిల్దార్, ఆర్.డి.రామచంద్రమూర్తి పాల్గొన్నారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పి.వి.ఆర్.కె. రాజు అధ్యక్షతన జరిగిన సత్కార కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ ఆత్రేయపురం మండలానికి అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. పదోన్నతి పొంది డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజాసేవలో విశేష విజయాలు సాధించాలని జడ్పీటీసీ బోనం సాయిబాబా అన్నారు. బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ మండలంలో విధులు నిర్వహించిన కాలంలో ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమని వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన, ఉపాధి హామీ పనులు, గ్రామ సభల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రజా ప్రతినిధుల సూచనలను గౌరవించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షులు ముదునూరి రామబద్రరాజు, డిప్యూటి ఎంపిడిఓ, కె.రమేష్ బాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, మరియు వి.బి.రాంజీ, సిబ్బంది పాల్గొని శ్రీ వెంకట రామన్ గారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పదోన్నతిపై వెళుతున్న బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ మాట్లాడుతూ, ఆత్రేయపురం మండలంలో తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎపిఒ, సి.హెచ్.విజయ రెడ్డి, ఎపియం, ఆర్.యం.డి.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని

### - కొవ్వూరు ఆర్ డి ఓ కె. ఆనందరావు



దేవరపల్లి, జూలై 30( ప్రభాతవార్త ): ఎల్‌నీనో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొవ్వూరు ఆర్‌డీవో కె. ఆనందరావు సూచించారు. గురువారం మండలంలోని సంగాయిగూడెం గ్రామంలో ఎల్‌నీనో ప్రభావం--ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం, పంటల భీమాపై గురువారం నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల పంటలకు కలిగే నష్టాలను వివరించిన ఆర్‌డీవో, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించడం, నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు పంటల భీమా రక్షణ కల్పిస్తుందని, ప్రతి రైతు భీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కౌలు రైతు కార్డులు పొందడం వల్ల ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు సులభంగా అందుతాయని పేర్కొంటూ, అర్హతలు, నమోదు ప్రక్రియ, వాటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో దేవరపల్లి తహసీల్దార్ ఎ. రాజబాబు, వ్యవసాయ అధికారి కె. కమలరాజు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులు అవలంబించాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, కౌలు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ లో మన బాధ్యత ఫౌండేషన్ జట్టు ఘన విజయం



రాజమహేంద్రవరం సిటీ ,జూలై 30( ప్రభాతవార్త). రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ లో మన బాధ్యత ఫౌండేషన్ జట్టు ఘన విజయం సాధించింది . ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ మన బాధ్యత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గార అజయ్ కుమార్ మాట్లాడుతూ టోర్నీ అశాంతం జట్టు సమిష్టిగా రాణించటం ఈ విజయం సాధించామన్నారు. క్రీడలు మానసిక శారీరిక మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఫిజికల్ ఫిట్నెస్ ను ఆరోగ్యాన్ని క్రమశిక్షణను ఏకాగ్రతను ఇస్తా అన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడ పట్ల ఆసక్తి చూపాలని ముఖ్యంగా చిన్న వయసు నుండి మైదానంలో ఆడే క్రీడల పట్ల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. తమ ఫౌండేషన్ తరపున క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. టీం విజయం పట్ల క్రీడాకారుల సంతోషం వ్యక్తం చేశారు. విజేతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రమేష్, సందీప్ ,సతీష్ ,సునీల్, సోమేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ ,నాని ,సాయి, మహేష్, వీరబాబు ,గాంధీ, రాము క్రీడాకారులు పాల్గొన్నారు.

## భారీ వృక్షం కొమ్మలను తొలగించారు.. ప్రమాదాన్ని తప్పించారు..

### -ఎమ్మెల్యేకు,అధికారులకు స్థానిక నివాసితులు కృతజ్ఞతలు..



అంబాజీపేట,జూలై 30,ప్రభాతవార్త): భారీ వృక్షంతో కొర్లపాటివారిపాలెంలో పొంచి ఉన్న ప్రమాదం అంటూ.. వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించిన అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేయుచున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి సమీపంలో సుమారు వందేళ్లు వయస్సు ఉండే భారీ నిద్ర గన్నేరు చెట్టు నేల కూలేందుకు సిద్ధంగా ఉండడంతో సమీపంలోని నివాసితులు భయాందోళనకు గురయ్యారు. భారీ వృక్షాన్ని తొలగించాలంటూ మండల పరిషత్, పంచాయతీ అధికారులకు వినతి పత్రాల సమర్పించారు. ఈనెల 10న నూతన పనులకు భూమిపూజ చేసేందుకు కొర్లపాటివారిపాలెం వచ్చిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు స్థానిక నాయకులు భారీ వృక్షం సమస్యను వివరించారు.దాంతో ఆయన స్వయంగా పరిశీలించి, భారీ వృక్షం వలన ప్రమాదం పొంచి ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే వృక్షానికి ఉన్న భారీ కొమ్మలను కోసి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దాంతో భారీ వృక్షానికి ఉన్న పెద్ద పెద్ద కొమ్మలను కట్ చేసి మోడును మిగిల్చారు.దీంతో స్థానిక నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.తాము ఎదుర్కొంటున్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు,ఎంపీడీవో బి.మమత, డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్, మాచవరం పంచాయతీ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణకు కొర్లపాటివారిపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ



రావులపాలెం, జూలై 30 (ప్రభాతవార్త) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పచ్చదనం--పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా 85 వివిధ రకాల మొక్కలను నాటారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, వీబీజే రాంజీ పథకం కింద బోటనీ విభాగ అధ్యాపకుడు ఎన్. నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎస్. అరుణ్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీవరం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, చెట్లు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను అందించి జీవావరణ సమతుల్యతను కాపాడతాయని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చినబాబు, అధ్యాపకులు శ్రీనివాసరావు, దుర్గాదేవి, సౌజన్య, రాజేంద్రతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫోటో ఎక్స్పో పోస్టర్ విడుదల.....



సఖినేటిపల్లి జూలై 30, ప్రభాత వార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1,2,3 తేదీలలో విజయవాడ మన కళ్యాణమండపం లో జరగ భోవుచున్న ఫోటో ఎక్స్పో ఎక్సిబిషన్ పోస్టర్ ను రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు సివి రావ్ ఆద్యాక్షతన రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నేల శ్రీను, డి కేశవ, భాను లాబ్ రాజా, కంచి ప్రసాద్, భాను రాజా, ప్రసాద్, అజయ్, మోహన్, రూపా ప్రసాద్, మధు, మీనాన్, స్టెలిన్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## వెదిరేశ్వరం జెడ్పీ పాఠశాల పరిశీలన.. భద్రత, ఆస్తుల పరిరక్షణపై అధికారుల దృష్టి



రావులపాలెం, జూలై 30 (ప్రభాతవార్త) : వెదిరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల అభివృద్ధి అధికారి సీహెచ్.వి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ డే సందర్భంగా ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుల మేరకు పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల వెనుక ప్రహరీ గోడ లేకపోవడం, ఆటస్థలంలో విద్యుత్ స్తంభం ఉండటం, పాఠశాల ఆవరణలోని కొబ్బరి చెట్ల ఆదాయం పాఠశాలకు కాకుండా పంచాయతీ వేలం ద్వారా ఇతరులకు వెళ్లడం వంటి అంశాలను పరిశీలించారు. పాఠశాల ఆస్తుల పరిరక్షణ, విద్యార్థుల భద్రతపై ఇన్నేళ్లుగా తగిన చర్యలు తీసుకోకపోవడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని ఆయన పేర్కొన్నారు. పాఠశాల భూముల సర్వే, కొబ్బరి చెట్ల ఆదాయానికి సంబంధించిన వివరాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించిన ఆయన, ఈ అంశాలపై జిల్లా పరిషత్‌కు నివేదిక పంపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి వి. సబిత, వ్యవసాయ ప్రత్యేక అధికారి లావణ్య, ఎంపీటీసీ గంట సుబ్బారావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మారే సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బుర్రకథలతో గెయిల్ పైప్‌లైన్ భద్రతపై చైతన్యం



రామచంద్రపురం,జూలై 30 (ప్రభాతవార్త): గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఓ.యు.గ్యాస్ పైప్‌లైన్ వెంబడి ఉన్న గ్రామాల్లో పైప్‌లైన్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువార బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు. రామచంద్రపురం కళాబృందానికి చెందిన గొర్రెల రాము, కృష్ణా, శ్రీనివాసరావు బ్రదర్స్ బృందాలు ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి, కొత్తపేట మండలంలోని ఏనుగుమహల్, అయినవిల్లి మండలంలోని వెలువలపల్లి గ్రామాల్లో బుర్రకథలు ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచాయి.ఈ సందర్భంగా గ్యాస్ పైప్‌లైన్ ప్రాధాన్యత,పైప్‌లైన్ పరిసర ప్రాంతాల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదనే విషయాలను వివరించారు. అలాగే పైప్‌లైన్ వద్ద గ్యాస్ లీకేజీ లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గమనించిన వెంటనే గెయిల్ టోల్‌ఫ్రీ నంబర్ 15101కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.


## తాళ్ళరేవు హైస్కూల్ కు పూర్వ విద్యార్థుల వితరణ.



తాళ్ళరేవు జులై 30 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977 - 78 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల పూర్వ విద్యార్థులంతా సమావేశమైనప్పుడు తమకు విద్యాబుద్ధులు చెప్పి సక్రమమైన మార్గంలో నడిపిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలని అందరూ సంకల్పించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి అవసరాలను తెలుసుకొని వాటిని సమకూర్చడానికి ప్రయత్నించారు. క్లాస్ రూమ్ లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించడానికి డస్క్ లు (బల్లలు) లేవని తెలుసుకుని సుమారు రూ. 50 వేలతో 11 తయారు చేయించారు. వాటిని గురువారం పూర్వ విద్యార్థులంతా పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల అవసరాలు తెలుసుకుని పెద్ద మనసుతో సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులకు హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం బాలసుబ్రమణ్యం, స్టాఫ్ సెక్రటరీ వాకపల్లి అప్పారావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1977 - 78 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ప్రతినిధులు పొన్నాడ చంటి, సామా ప్రకాష్, కన్నేపల్లి శర్మ, గనిశెట్టి రామకృష్ణ, పొన్నాడ రాజబాబు, దడాల భైరవ స్వామి, టేకుమూడి రత్నాకర్, ధూళిపూడి శ్రీను, గోడా వెంకటానందం, కందికొండ బాబి తదితరులు ఉన్నారు

## సాగునీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలి

### -పవన్ కళ్యాణ్ తో మంత్రి రామానాయుడు భేటీ-మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సమావేశం



పిఠాపురం, జూలై 30,( ప్రభాతవార్త) రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి సంక్షోభ పరిస్థితులను వివరించాలని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను కోరారు.సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలన్నారు.సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ పై దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సూచించారు.సాగునీటి అద్దటిపై రైతులు ఆందోళనతో ఉన్నారని వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు కూడా తీసుకుంటే ఫలితం ఉంటుందని స్పష్టం చేశారు.కాకినాడ జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గం రైతుల కోసం అడిగిన వెంటనే 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు కి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురం ప్రాంతంలో నెలకొన్న నీటి కొరత పరిస్థితులను పరిశీలించేందుకు ఏలేరు ఆయకట్టు ప్రాంతాలకు వెళున్నట్టు రామానాయుడు చెప్పారు.పిఠాపురం నియోజకవర్గం పై దృష్టి సారించి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని పవన్ కళ్యాణ్ కోరారు.కాలువల్లో నీటిమట్టాన్ని తనిఖీ చేసిన మంత్రి రామానాయుడు.కాకినాడ జిల్లాలో ఇరిగేషన్ అడ్వైజర్, ఈఎన్ సి, అధికారులతో కాలువల్లో నీటిమట్టాన్ని జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం తనిఖీ చేశారు.గోదావరి డెల్టా ఈస్టర్న్ కెనాల్, సామర్లకోట, పిఠాపురం బ్రాంచ్ కెనాల్సిలో తిరుగుతూ నీటి ప్రవాహాన్ని గుర్తించారు.ఆయకట్టు చివరి భూముల వరకు నిరందేలా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పరిధిలో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.రైతులకు సాగునీటి నిర్వహణలో అడ్డంకులు లేకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.ఎల్ నీనో నేపథ్యంలో నీటిని పొదుపుగా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించి, ప్రతి నీటి బొట్టు ను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు రైతులను కోరారు

## గోదావరి-శబరి నదుల్లో పెరుగుతున్న వరద ఉధృతి. వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**-చింతూరు ఐ. టీ. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి శుభం నొఖ్వాల్.**



**చింతూరు, జూలై 30 ప్రభాత వార్త.** గోదావరి, శబరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొఖ్వాల్ ఒక ప్రకటనలో కోరారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి, శబరి నదులతో పాటు వాటి ఉపనదుల్లో భారీగా వరద ఉధృతి పెరుగుతుందని, గోదావరి నదిలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని, ప్రాథమిక అంచనా ప్రకారం, భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం 31 జూలై ఉదయం మొదటి హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని, శనివారం 1 ఆగస్టున రెండవ హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని సూచించారు. ఈ నేపథ్యంలో గోదావరి మరియు శబరి నదుల పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు.గోదావరి మరియు శబరి నదుల ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వరదల సమయంలో అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దు. వరద నీటిలో మునిగిపోయిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, వాగులు మరియు ఇతర జలమార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని,జిల్లా పరిపాలన మరియు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని,అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులకు పూర్తిగా సహకరించాలని,ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ లేదా సంబంధిత మండల తహసీల్దార్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని,1. చింతూరు సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ 9490026397 8121729228 2. కూనవరం కంట్రోల్ రూమ్ 9652814712 3. వి.ఆర్. పురం కంట్రోల్ రూమ్ 78939 46774 4. చింతూరు కంట్రోల్ రూమ్ 9492527695 5. ఎటపాక కంట్రోల్ రూమ్ 8332085268 సంప్రదించాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని, అధికారులకూ జిల్లా పరిపాలన విభాగం విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించి, అధికారులు జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## సైకిల్ ఇప్పించండి అన్న పదవ తరగతి విద్యార్థిని మాటకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



**జగ్గంపేట, జూలై 30( ప్రభాతవార్త)** విద్యార్థుల చిన్న కష్టం కూడా పెద్దగా చూసే సంస్కారం ఉండటానికి ఇదే ఉదాహరణ. జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలో అదనపు తరగతుల ప్రారంభోత్సవానికి వెళ్లిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముందు 10వ తరగతి విద్యార్థిని ధైర్యంగా నిలబడింది. "సార్ నేను రోజూ 2 కిలోమీటర్లు నడుచుకుంటూ స్కూల్ కి వస్తున్నాను. చదువు ఇబ్బంది అవుతోంది. నాకు సైకిల్ ఇప్పించండి" అని ఆమె చేసిన వినతిని విన్న ఎమ్మెల్యే కదిలిపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా సైకిల్ విద్యార్థినికి ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. మాట ఇచ్చిన 24 గంటల్లోనే మాట నిలబెట్టుకున్నారు. గురువారం రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా దొడ్ల సత్యకు సైకిల్ అందజేశారు. "బాగా చదువుకో. నీ కలను సాకారం చేసుకో. నీ చదువుకు ప్రభుత్వం అండగా ఉంటుంది" అని ఆమెను నవీన్ అభినందించారు. చిన్న వినతిని కూడా పెద్దగా తీసుకుని వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే చర్యపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, రేఖ బల్లి రాజు, ముంద్రు ఎర్రబాబు, అడబాల రామానుజనేయులు, సియాద్రుల పెద్దకాపు, కాసరెడ్డి రామకృష్ణ, జొన్నద వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి చీర సారె సమర్పించిన నరసింహుడు....



**సఖినేటిపల్లి జూలై 30, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఉన్న స్వయంభూ గ్రామదేవత శ్రీ ఆది మోగాదాలమ్మ శ్రీ మారమ్మ శ్రీ గంట్లమ్మ అమ్మవార్ల జాతర లో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం తరఫున అమ్మవార్లకు చీరలు, సారె, గాజులు, పువ్వులు, పసుపు కుంకాలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెంట్ పి విజయసారథి, ఎంపీటీసీ బైరా నాగరాజు, కమిటీ సభ్యులు, సీనియర్ అసిస్టెంట్లు ఎం కిరణ్, శ్రీదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్. 3 కొనసాగించాలని పై వైస్సార్సీపి పిటీషన్లు వేసాం..

**-మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి**



**రాజవొమ్మంగి, జూలై 30, ప్రభాతవార్త** గిరిజనుల కోసం జీవో నెంబర్ 3 కొనసాగించాలని వైస్సార్సీపీ ప్రభుత్వంలో సుప్రీంకోర్టు రద్దు చేసిన వెంటనే పిటిషన్ వేయడం జరిగిందని రంపచోడవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 3 పై వైస్సార్సీపీ అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. గురువారం రాజవొమ్మంగి మండల కేంద్రంలో వైస్సార్సీపీ వాణిజ్య విభాగ అధ్యక్షులు కొత్త అర్జు రమేష్, భార్య లక్ష్మీపార్వతి నివాసం కార్యక్రమానికి వచ్చి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడుతూ జీవో నెంబర్. 3 పై వేసిన పిటీషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన కాపీలు కూడా కావాలంటే ఇస్తామన్నారు. కొందరు పత్రాలను వైస్సార్సీపీ ప్రభుత్వంలో ఇవ్వడం జరిగిందన్నారు. జీవో నెంబర్. 3 ప్రత్యామ్నాయం ఏమి చేస్తున్నారో ఇప్పటికైనా గిరిజనులకు కూటమి ప్రభుత్వం వెల్లడి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వైస్సార్సీపీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి జి.రా రాజశ్రీ, ఎంపిటిసి కనిగిరి గంగాధర్, మండల కో ఆప్షన్ సభ్యులు అడపా కామేశ్వరావు, మాజీ సర్పంచులు కొంగర మురళీకృష్ణ, సవిరాల చంద్రుడు, బీటీ శివ, మిరియాల గణేలక్ష్మి, కించు వెంకటలక్ష్మి, వైస్సార్సీపి నాయకులు దాట్ల వెంకటేష్ రాజు, కనిగిరి దుర్గాప్రసాద్, జల్లా జాన్ బాబు, బొద్దు వెంకటరమణ, కనిగిరి వీరబాబు, సింగిరెడ్డి రవి బాబీలా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గోదావరి వరదల నేపథ్యంలో గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలి.. తహసీల్దార్, ఎంపిడిఓ



**ఆత్రేయపురం, జూలై.30,ప్రభాత వార్త)** గోదావరి ఎగువ ప్రాంతాల్లో పెరుగుతున్న వరద ఉధృతి నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రావాపాక శ్రీ రామచంద్రమూర్తి అధికారులకు సూచించారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్. రామచంద్రమూర్తి, ఎంపీడీఓ. రాజు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపిడిఓ లు మాట్లాడుతూ గోదావరి నీటిమట్టం పెరుగుతున్న పరిస్థితుల నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.అదేవిధంగా, వరదల సమయంలో ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వారు సూచించారు.

# పొగాకు రైతుల గోడు వినిపించేందుకు జగన్ రాక

**-జగన్ పర్యటనను విజయవంతం చెయ్యాలని పిలుపు**



**గోపాలపురం జూలై 30, (ప్రభాతవార్త):** పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆగస్టు 5వ తేదీన దేవరపల్లికి రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ హోంమంత్రి తానేటి వనిత, జిల్లా పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలు పిలుపునిచ్చారు గురువారం గోపాలపురంలోని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. పొగాకు ధరలు భారీగా పతనమై రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నా కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పొగాకు పండించేందుకు రైతులు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి సాగు చేస్తున్నా పంట చేతికొచ్చే సమయానికి ధరలు లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, రవాణా వ్యయాలు భారీగా పెరిగినా రైతుకు మాత్రం గిట్టుబాటు ధర దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల గోడును ప్రభుత్వం వినకపోవడంతో మాజీ సీఎం వైఎస్ జగన్ స్వయంగా దేవరపల్లికి వచ్చి పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకోనున్నారని తెలిపారు. రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడంతో పాటు రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో దేవరపల్లి సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రతి కార్యకర్త, రైతు, పార్టీ అభిమానిపై ఉందని పేర్కొంటూ గోపాలపురం మండలం నుంచి భారీ సంఖ్యలో రైతులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామ్మోహన్ రెడ్డి, అస్లర్ బాషా, సాలి వేణు, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివేకానంద విద్యా సంస్థల్లో ఘనంగా రైనీ డే వేడుకలు



**జగ్గంపేట, జూలై 30 (ప్రభాతవార్త)** శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో "రైనీ డే సెలబ్రేషన్స్"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి వర్షాకాలం విశిష్టతను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాగితం పడవలు నీటిలో వేస్తూ, పాటలు, నృత్యాలు, ప్రసంగాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా సంస్థ అధినేత డా. ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ, వర్షం ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. భూమిపై జీవరాశుల మనుగడకు నీరు అత్యంత అవసరమని, వ్యవసాయం, తాగునీరు, పర్యావరణ సమతుల్యత అన్నీ వర్షంపైనే ఆధారపడి ఉంటాయని తెలిపారు.విద్యార్థులు ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. ప్రతి ఇంట్లో వర్షపు నీటి సంరక్షణ వంటి పద్ధతులను ప్రోత్సహించాలని, భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా ఆయన వివరించారు. వర్షంలో అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలని, తడిసిన వెంటనే పొడి దుస్తులు ధరించాలని, మరిగించి చల్లార్చిన లేదా శుభ్రమైన తాగునీటినే ఉపయోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు, స్తంభాల సమీపంలో జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వర్షాకాల ప్రాముఖ్యత, నీటి సంరక్షణ అవసరం, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు.

## పేద విద్యార్థిని చదువుకు టివిసి చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**కడియం: జూలై 30 ( ప్రభాతవార్త)** విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో టివిసి చారిటబుల్ ట్రస్ట్ నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తోందని ట్రస్ట్ అధినేత, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి తెలిపారు. స్థానిక ఎస్సీ పేటకు చెందిన గుమ్మడి రిషిత ముమ్మిడివరంలోని మహిళా కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఫీజులు చెల్లించకపోవడంతో పరీక్షలకు అనుమతించబోమని కళాశాల యాజమాన్యం తెలియజేయడంతో విద్యార్థిని నానమ్మ గుమ్మడి పాప, తండ్రి గుమ్మడి గంగరాజు చక్రవర్తిని ఆశ్రయించారు.విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న తాడాల విష్ణు చక్రవర్తి గురువారం కడియం మండలం బుర్రిలంక గ్రామంలోని శ్రీ ఈశ్వర ఫామ్స్ అండ్ నర్సరీ కార్యాలయంలో ఫీజుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువు మధ్యలో నిలిచిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థిని ఉన్నత చదువులకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సాపిరెడ్డి కామేష్, చిలుకూరి రామకృష్ణ, బి. చంద్రకుమారి, కె. కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు

## తొలకరి వరికి పంట బీమా తప్పనిసరి

**-ఆగస్టు 15లోపు ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచన**

**కడియం జులై 30 (ప్రభాతవార్త)** ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తొలకరి వరి సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకురాలు జె. శశి బిందు సూచించారు. మండల కేంద్రం కడియం గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో జె.శశి బిందు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పంట బీమాపై అవగాహన కల్పించారు.తొలకరి వరి పంటకు ఎకరాకు రూ.38 వేల బీమా వర్తిస్తుందని, అందులో రైతులు 1.5 శాతం ప్రీమియంగా రూ.570ను ఆగస్టు 15లోపు చెల్లించాలని తెలిపారు. పంట రుణం పొందిన రైతులు తమ బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించవచ్చని, రుణం లేని కౌలు రైతులు సి.ఎస్.సి. కేంద్రాలు లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించే అవకాశం ఉందని వివరించారు.పంట బీమా వల్ల ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల కారణంగా కలిగే నష్టాల నుంచి రైతులకు రక్షణ లభిస్తుందని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.పి.ఏ.సి.ఎస్. అధ్యక్షుడు ఎలుగుబంటి నాని మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులందరూ పంట బీమా చేయించుకోవడం అత్యవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్, సహాయ వ్యవసాయ అధికారి ప్రేమ్‌చంద్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రత్యూషతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



## రాజవొమ్మంగిలో విద్యార్థులకు మట్టి నమూనా సేకరణపై అవగాహన



**రాజవొమ్మంగి, జూలై 30, ప్రభాతవార్త** రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణారావు అధ్యక్షతన గురువారం వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి చక్రధర్ నిర్వహించారు. విద్యార్థులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, నేలలోని పోషకాల ఆధారంగా ఎరువుల వినియోగం వల్ల ఖర్చు తగ్గి అధిక దిగుబడి సాధ్యమవుతుందని ఏ. ఓ. చక్రధర్ వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి నాణ్యమైన పంటలు పండుతాయని తెలిపారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పటేల్, పాఠశాల సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏ. ఈ. ఓ గంగాభవాని, సహాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం



**ముమ్మిడివరం జూలై 30 తర్వాత వార్త** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంసందర్భంగా "వెట్టిచాకిరి ఒక లోతుగా వేళ్లూనుకున్న మోసం" అనే సందేశంతో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ మరియు జిల్లా వెట్టి విమోచన కోలిషన్ ఆధ్వర్యంలోరూపొందించిన అవగాహన పోస్టర్ల ఆవిష్క రించారు ముమ్మిడివరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీలు, గ్రామ సచివాలయాలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సిబ్బంది సమాజంలోని బలహీన వర్గాలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడం ద్వారా వెట్టిచాకిరి మరియు అక్రమ రవాణాను నివారించవచ్చని తెలిపారు. ఏపీఓ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాలు, ఉపాధి అవకాశాలు మరియు జీవనోపాధి కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి, మానవ అక్రమ రవాణా మరియు వెట్టిచాకిరికి గురికాకుండా కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.కార్యక్రమం చివరలో అధికారులు మరియు పాల్గొన్న వారందరూ కలిసి మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుబడి పనిచేయాలని అనుమానాస్పద సంఘటనలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ప్రతి వ్యక్తి స్వేచ్ఛ, గౌరవం మరియు మానవ హక్కులను కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కన్నీడి వెంకటేశ్వరరావు సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బి నాగార్జున, ఎం శివకుమార్ మండల అభివృద్ధి అధికారుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రూ.3 కోట్లతో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



**మామిడికుదురు.జూలై 30(ప్రభాతవార్త)** మండల కేంద్రమైన మామిడికుదురులో ఎన్నో ఏళ్ల నాటి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు.దీనిపై గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి గ్రామస్తులు,పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు.రూ.3 కోట్ల అంచనా వ్యయంతో 3.5 కిలోమీటర్ల ప్రధాన డ్రైన్, రెండు కిలోమీటర్ల సబ్ డ్రైన్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు.ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ యాలి శ్రీనివాస్,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్--బ్యాడ్ టచ్ పై విద్యార్థినులకు పోలీసులు అవగాహన



**రాజవొమ్మంగి, జూలై 30, ప్రభాత వార్త** రాజవొమ్మంగి ఏ. పి. గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ షీలా అధ్యక్షతన రాజవొమ్మంగి ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో సీఐ సన్యాసినాయుడు విద్యార్థినులకు గుడ్ టచ్ బాడ్ టచ్, చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్--బ్యాడ్ టచ్ లో అసౌకర్యంగా అనిపించే స్పర్శ ఎదురైతే వెంటనే విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు తెలియజేయాలని వివరించారు. పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా జాగ్రత్త పడాలనే అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలా, సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. వెంకట్రావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు, పోలీసులు పాల్గొన్నారు.

## లోకేష్ ఎదుగుదల చూసి ఓర్వలేకనే ఆరోపణలు

**-జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి**



**కొత్తపేట, జూలై 30, (ప్రభాతవార్త)** ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక డీఎస్సీ పై వైసీపీ నేతలు నిరాధారమైన ఆరోపణ చేయడం ప్రజలు గమనిస్తున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి అన్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు ఒక ఉపాధ్యాయ పోస్టును కూడా భర్త చేయలేదన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ ఫైల్ పై చేసి తద్వారా 16 347 పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారుఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2012లో స్పోర్ట్స్ కోటా నుండి జీవో నెంబర్ 74 ని చేయడం జరిగినదని ఆ జీవోని రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు చేసి ఆ స్పోర్ట్స్ కోటాని తగ్గించింది ఈరోజు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆ జీవో ప్రకారం డీఎస్సీ కి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు భర్తీ చేస్తే దాన్ని తప్పు పడుతూ వైసీపీ నే ధర్నాలు చేయడం సిగ్గుచేటు అన్నారు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే ధర్నాలు ప్రెస్ మీట్ లుతో వైసిపి అక్కసు వెళ్ళగక్కుతోందని ఆరోపించారు

## ప్రధాని పర్యటన విజయవంతానికి ఎమ్మెల్యే బండారు సమీక్ష



**కొత్తపేట, జూలై 30, (ప్రభాతవార్త)** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయడానికి యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును నియమితులయ్యారు ఈ సందర్భంగా యలమంచిలి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ టీడీపీ ఇంచార్జి ఆర్ అండ్ బి చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు బీజేపీ ఇంచార్జి రజనా సన్యాసి నాయుడు తో కలిసి నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్ష సమావేశం నిర్వహించారు సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు సభకు హాజరయ్యే ప్రజలు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రవాణా భోజనం తదితర అన్ని సౌకర్యాలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని అధికారులకు నాయకులకు సూచించారు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## పాపికొండలకు విహారయాత్రకు బ్రేక్

**దేవీపట్నం, జూలై 30 ప్రభాతవార్త :** గోదావరి నదిలో వరద ప్రవాహం పెరగడంతో పాపికొండల విహారయాత్రలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బోటు ప్రయాణాలకు అనుమతులు నిలిపివేసినట్లు తెలిపారు. వరద పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న అనంతరం తిరిగి విహారయాత్రలను ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. పర్యాటకులు అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గొల్లప్రోలులో గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు



**గొల్లప్రోలు, జూలై 30(ప్రభాతవార్త)** గొల్లప్రోలు పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ సి) పరిధిలోని రంగప్ప చెరువు సచివాలయం పరిధిలో మాతా శిశు సంక్షేమ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.ఇందులో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలోని గర్భిణీ తల్లుల ఇళ్లను ఏఎన్ఎం శివకుమారి,ఆశా కార్యకర్తలు గృహ దర్శనం (హోమ్ విజిట్) చేశారు.ఈ సందర్భంగా గర్భిణీల ఆరోగ్య స్థితిగతులను,వారు తీసుకుంటున్న పౌష్టికాహార వివరాలను ప్రత్యేకంగా పరిశీలించారు.ప్రతి ఒక్కరికీ బీపీ,షుగర్, ఎత్తు,బరువు,రక్తంలో హిమోగ్లోబిన్ శాతంతో పాటు బ్లడ్ గ్రూపింగ్ వంటి కీలక వైటల్స్ పరీక్షలను నిర్వహించారు.ఆరోగ్య విద్య,పోషక విలువలపై అవగాహన:అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న టేక్ హోమ్ రేషన్ పొందుతున్న స్థితిని, పీఎంఎస్ఎంఏ హెల్త్ చెకప్స్ విజిట్ అవశ్యకతను గర్భిణీలకు వివరించారు. అనంతరం ఏఎన్ఎం శివకుమారి మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా టెటానస్, డిఫ్తీరియా టీకాలు వేయించుకోవాలని,ఐరన్ ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ) కాల్షియం బిళ్ళలను నిరంతరం వాడాలని సూచించారు.నిత్యం ఆహారంలో ఆకుకూరలు,పప్పులు,గుడ్లు ఇతర పోషక విలువలు గల ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచించారు.ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే వైద్యుల పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జితేంద్ర సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయం ఆర్డీవో సత్యనారాయణ



**కొత్తపేట, జూలై 30,( ప్రభాతవార్త)** సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ నిరుపేదలకు అండగా నిలుస్తున్న జితేంద్ర సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొత్తపేట ఆర్డీవో జి వి వి సత్యనారాయణ అన్నారు గురువారం కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామానికి చెందిన బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 14 ఏళ్ల బాలుడు ఆలపాటి అజయ్ సత్యవర ప్రసాద్ వైద్య చికిత్స కోసం జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సేకరించిన1లక్ష రూపాయలు చెక్కును బాలుడి తండ్రి ఆలపాటి ప్రకాశరావుకు ఆర్డీవో సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు వాడపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి ప్రకాశరావు కుమారుడు అజయ్ సత్యవర ప్రసాద్ తీవ్రమైన బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఖరీదైన వైద్య చికిత్స పొందుతున్నాడు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో సహాయం కోసం జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ జితేంద్ర కుమార్ ను ఆశ్రయించారు వెంటనే స్పందించిన ఆయన న్యూస్ గ్రూప్స్ ద్వారా దాతలకు విజ్ఞప్తి చేయగా పలువురు దాతలు ఉదారంగా ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయం అందించారుఆ సహకారంతో సేకరించిన నిధుల్లో రూ1 లక్ష చెక్కును ఆర్డీవో సత్యనారాయణ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ జితేంద్ర కుమార్ ట్రస్ట్ సభ్యులు సంసాని బాలాజీ ఆలపాటి వేణుగోపాల్ ఆలపాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## రైల్వే అండర్ పాస్ వద్ద పేరుకుపోయిన మట్టి తొలగింపు

**-కమిషనర్ ను అభినందించిన ప్రజలు**



**గొల్లప్రోలు, జూలై 30,(ప్రభాతవార్త)** గొల్లప్రోలు పట్టణ పరిధి సూరంపేట ప్రాంతంలో గురువారం కమిషనర్ దివిజా సంపతి పర్యటించారు.ఈ సందర్భంగా సూరంపేట నుండి పట్టణంలోకి వెళ్లే ప్రధాన దారిలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద భారీగా మట్టి పేరుకుపోయి ఉండటాన్ని ఆమె గమనించారు. వాహనదారులకు,ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను గుర్తించిన కమిషనర్ తక్షణమే స్పందించారు.వెంటనే మినీ జెసిబి వాహనాన్ని రప్పించి అక్కడ పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించారు.అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి తక్షణమే పరిష్కారం చూపిన కమిషనర్ దివిజా సంపతిని సూరంపేట ప్రజలు ఎంతో అభినందించారు.ఈ పారిశుద్ధ్య శుభ్రతా కార్యక్రమంలో ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రఘు ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు,ఏమినిటీ సెక్రటరీ సాయి దుర్గ మరియు పట్టణ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు

## పంట బీమా తప్పనిసరి ఏ డి ఏ అరుణ



**కె గంగవరం, జూలై 30,(ప్రభాతవార్త):** కె గంగవరం మండలం బట్లపాలిక గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని ఏమో సద్గురు మూర్తి నిర్వహించగా ముఖ్య అతిథిగా రామచంద్రపురం ఏడీఏ ఎం అరుణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏల్నినో అసాధారణ వాతావరణ మార్పులు నేపథ్యంలో ఆగస్టు 15 లోపు పంట రుణం తీసుకునే ప్రతి రైతు ఎకరానికి 76 రూపాయలు చొప్పున నామమాత్రపు రుసుము తో ఖరీఫ్ 2026 పంట బీమా చేయించుకోవాల్సిందిగా కోరారు. వ్యవసాయంలో రైతులు విచ్చలవిడిగా వాడుతున్న ఎరువులు పురుగు మందులతో మానవాళి ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో సమతుల్య రసాయనిక ఎరువులు పురుగు మందుల వినియోగం ద్వారా ఆరోగ్యకరమైన పంట పండించడంపై 14 వారాలు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

## ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**సీతానగరం, జూలై 30, (ప్రభాతవార్త) :** సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వి.చలపతిరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన ఆయన, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. బాల్యవివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్లు, అత్యవసర మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వార్డులో ఉన్న బాలింత, శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శైలజ రాణి, ఎంపిహెచ్ఈఓలు నాగు, వైఎస్.రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్వైజర్లు కె.సుధాకర్, ఎన్.అనురాధ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps